ఈనాడు

కరీంనగర్ 1-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 142

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కొత్త రాష్ట్రం తెలంగాణ మూడున్నరేళ్లలో ఆవిష్కరించిన అద్భుతం

నేటి నుండి వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా నాణ్యమైన ఉచిత విద్యుత్

Reliable Power Supply to all sectors in Telangana — 24x7 Hrs POWER

దేశంలో ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి కృషితో మూడున్నర దశాబ్దాల కరెంటు కష్టాలకు చరమగీతం



తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నేటి నుండి 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది.

ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖిస్తున్నది.

సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత వల్ల గంటల కొద్దీ విద్యుత్ కోతలతో జనజీవనం దుర్భరంగా మారింది. కనీసం మూడు నాలుగు గంటలు కూడా కరెంటు అందక పంటలు ఎండిపోయినయి. అర్ధరాత్రి, అపరాత్రి నీళ్లు పెట్టుకోవడానికి పోయిన రైతుల ప్రాణాలు కరెంటు షాకులకు బలైపోయినయి. లో ఓల్టేజి సమస్యతో ట్రాన్స్ ఫార్మర్లు పటాకుల వలె పేలిపోయేవి. నిరంతరం మోటార్లు కాలిపోయేవి.

పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వారంలో కొన్నిరోజులు పవర్ హాలిడేలు ప్రకటించే దుస్థితి ఆవరించి, పరిశ్రమలు మూతపడే స్థాయికి సంక్షోభం చేరింది.

సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో, కార్యదీక్షతో కృషి చేసి, మూడున్నరేళ్ల అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. తెలంగాణలో కరెంటు కోతలు ఇప్పుడు ప్రజలు మరిచిపోయిన గతం. 24 గంటల విద్యుత్ సరఫరా ఇప్పుడు ప్రజల నిత్యానుభవం. పవర్ హాలిడేలు పోయి ఎవ్రీ డే ఈజ్ పవర్ డే అనే రోజులొచ్చినయి. నిరంతర విద్యుత్ సరఫరాతో పరిశ్రమలలో ఉత్పత్తి పెరిగింది. కార్మికులకు కావాల్సినంత పని దొరుకుతున్నది. పెరిగిన వ్యవసాయోత్పత్తులతో రైతాంగంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. కొద్ది కాలంలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించబోతున్నది.

వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

తెలంగాణలో ఇప్పుడిక అన్ని రంగాలకు 24x7 నాణ్యమైన విద్యుత్

ఎత్తిపోతల పథకాలకు 12వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి సర్వసన్నద్ధం.

లోటు నుంచి మిగులు వరకు

2వ జూన్ 2014 తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు.

1 జనవరి 2018 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 మెగావాట్లు.

కొద్ది కాలంలోనే అందుబాటులోకి వచ్చే విద్యుత్ 28,000 మెగావాట్లు.

రూ.12,316 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థల పటిష్టం

వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ.12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1,724 కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించింది.

సోలార్ పవర్‌లో దేశంలో నెంబర్ వన్

3,142 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

జాతీయ సగటును దాటిన తలసరి విద్యుత్ వినియోగం

ఆర్థిక ప్రగతికి సూచికగా చెప్పబడే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1,200 యూనిట్లు, నేడు 1,505కు పెరిగింది. ఇది తెలంగాణలో జీవన ప్రమాణాల పెరుగుదలకు అద్దం పడుతున్నది.

శరవేగంగా అల్ట్రా మెగా & సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం

- 4000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో టీ.ఎస్.జెన్‌కో సారథ్యంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు నిర్మాణం జరుగుతున్నది.
- 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిశంబరు 2018 లో పూర్తి కానున్నవి
- 800 మెగావాట్లు కెటిపిఎస్ పవర్ ప్లాంటు ఈ మార్చిలో ఉత్పత్తి ప్రారంభం కానున్నది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్-765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

- జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది.
- విద్యుత్ సంస్థల్లో 24,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత. దళారీ వ్యవస్థను నిర్మూలించింది.



తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ | ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

R.O.No.62/17

జయ లోటు భర్తీ అవుతుందా?



- ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్టీలు
- రాజకీయ ప్రకటనపై రాష్ట్రంలో చర్చ

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడులో అన్నాడీఎంకే, డీఎంకేలకు ప్రత్యామ్నాయంగా రజనీకాంత్ ఎదుగుతారా? అనే చర్చ మొదలైంది. రాష్ట్రంలో ఈ రెండు పార్టీలు యాభై ఏళ్లకుపైగా అధికారాన్ని పంచుకుంటున్నాయి. ఏడాదిన్నర కిందటి సార్వత్రిక ఎన్నికలు మినహాయించి అయిదేళ్లకోసారి అధికారాన్ని బదలాయించే సంప్రదాయాన్ని రాష్ట్ర ఓటర్లు కొనసాగించారు. చరిత్రను తిరగరాసిన జయలలిత ఏడాది పాలించి కన్నుమూశారు. అప్పటినుంచి జయలలిత, ప్రస్తుతం కురువృద్ధుడైన కరుణానిధి స్థానాలను భర్తీ చేసే నేత ఎవరనే ప్రశ్న వస్తోంది. ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్, శశికళ బంధువు దినకరన్‌ల పేర్లు వినిపించాయి. కమల్‌హాసన్, రజనీకాంత్ పేర్లూ వచ్చినప్పటికీ వారి రాకపై ఇప్పటివరకు సందిగ్ధత కొనసాగింది. జయలలిత శకం ముగిశాక రాజకీయ శూన్యత ఏర్పడిన సమయంలో రజనీ రాక రాజకీయ మార్పులకు నాంది పలకనుంది. ఆర్కేనగర్ ఉపఎన్నికల్లో డీఎంకే ధరావతు కూడా కోల్పోవడం ఆ పార్టీ దైన్యతను చెబుతోందనే విమర్శలు వచ్చాయి. దళపతి అని పిలిపించుకునే డీఎంకే అగ్రనేత స్టాలిన్ సినీ 'దళపతి'ని ఎలా ఎదుర్కొంటారోననే వ్యాఖ్యలు ప్రస్తుతం చెన్నైలో ప్రచారమవుతున్నాయి.

సాధారణ జీవనమే అండ..: దశాబ్దం కిందటే ప్రముఖ నటుడు విజయ్‌కాంత్ రాజకీయాల్లో చేరి 2006 ఎన్నికల్లో పది శాతం ఓట్ల వరకు సాధించారు. ఈ ఆదరణ తరువాతి ఎన్నికల్లో కనిపించలేదు. అగ్రనటుడు రజనీకాంత్‌కున్న ఆకర్షణ శక్తి, సేవలు, ప్రజా సంబంధాలు కొనసాగిస్తున్న తీరు, సాధారణ జీవనం, మంచి పేరు, అభిమానుల్లోని అచంచల విశ్వాసం ఆయనకు మెరుగైన రాజకీయ ప్రస్థానానికి బాటలు వేస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వివిధ సమస్యలు, అంశాలపై ఆయన వాణి వినిపించాల్సి ఉంది. కావేరి వివాదం ఇతర అంశాలపై ఆయన అభిప్రాయాలను అప్పుడే కొన్ని పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

ప్రభుత్వం క్షేమమేనా? ఆర్కేనగర్ ఉపఎన్నికలో విజయం సాధించిన దినకరన్ ప్రస్తుత ప్రభుత్వం త్వరలో పడిపోతుందని జోస్యం చెబుతున్నారు. మరోవైపు డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ ఇదేలా అభిప్రాయపడుతున్నారు. ఈ సమయంలోనూ పూర్తికాలం అధికారంలో కొనసాగుతామని అన్నాడీఎంకే ధీమాగా ఉంది. బలమైన ద్రావిడ పార్టీలకు రజనీకాంత్ ఎంతగా ప్రత్యామ్నాయమవుతారనేది వేచి చూడాల్సిందే.

తప్పక వస్తా..: 'నేను ఎప్పుడు వస్తానో నాకే తెలియదు.. సమయం వచ్చినప్పుడు తప్పక వస్తా' సూపర్‌స్టార్ రజనీకాంత్ వెండితెరపై పలికిన ఈ సంభాషణను వందశాతం నిజం చేస్తూ ఆదివారం రాజకీయ ప్రవేశాన్ని ప్రకటించారు. మరోవైపు తనకు రాజకీయాలంటేనే గిట్టవని చెబుతూ వచ్చిన విశ్వనటుడు కమల్‌హాసన్ ఏకంగా తాను వచ్చానంటే ముఖ్యమంత్రినవుతానని వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి వస్తున్నానంటూ ప్రకటించి జనవరిలో రాష్ట్రవ్యాప్త పర్యటనకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో రాజకీయాలకు రావాల్సిన ఆవశ్యకత ఇప్పుడేమొచ్చిందని ఇటీవల రజనీ ప్రకటించి ఆశ్చర్యపరిచారు. సరిగ్గా ఈ వ్యాఖ్యలు చేసిన నెలలోనే తానూ రాజకీయ ప్రవేశం చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందామని సవాలు విసిరారు. రజనీ 2019లో తమకు మద్దతిస్తారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు సౌందరరాజన్ పేర్కొనడంపైనా మరో కోణంలో చర్చ మొదలైంది. ఆయన సొంత పార్టీ పెట్టాక భాజపాకు మద్దతిస్తారేమోనని వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అంటున్నారు.

'నేను వచ్చేశానని వారికి చెప్పండి.. 25ఏళ్ల క్రితం ఎలా వెళ్లానో అలాగే వచ్చా..' 'కబాలి' చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ డైలాగులివి.

★ అది 1992. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత నివాసం పోయెస్‌గార్డెన్ పక్కనున్న తన ఇంటికి వెళ్లేందుకు రజనీ బయలుదేరారు. ముఖ్యమంత్రి వస్తున్నారంటూ రజనీ వాహనాన్ని 30 నిమిషాల పాటు పోలీసులు ఆపేశారు. ఇదే సమయంలో రజనీ తన కారు నుంచి దిగి సమీపంలోని చిరుకొట్టుకు వెళ్లి సిగరెట్ ముట్టించారు. ఇంతలో జనం గుమిగూడటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. 'ఆమె వెళ్లేందుకే నిరీక్షిస్తున్నా. దీనికెలాంటి అభ్యంతరం లే'దంటూ రజనీ పోలీసు అధికారితో వ్యాఖ్యానించారు. భయపడుతూనే.. పోలీసు అధికారి ఆయన్ని బయలుదేరాలని కోరారు.

- గాయత్రీ శ్రీకాంత్ రాసిన సూపర్‌స్టార్ జీవితచరిత్ర 'ది నేమ్ ఇజ్ రజనీకాంత్' పుస్తకంలో ఓ భాగమిది.

★ సరిగ్గా 25ఏళ్ల తరువాత తన చిత్రం కబాలిలో చెప్పిన విధంగానే 2017 చివరి తేదీనాడు రాజకీయ ప్రవేశాన్ని ప్రకటించారు. నెరిసిన గడ్డం, బట్టతల, సాధారణ ఆహార్యంతోనే ఈ నిర్ణయం వెల్లడించారు.

రాజ 'యోగ' ముద్ర!



చెన్నై: 'ఆధ్యాత్మిక రాజకీయ ప్రభుత్వం' ఇదే.. మీకు నా వాగ్దానం.....అంటూ చూపుడువేలు, చిటికెన వేలును పైకి చూపుతూ...మధ్యరెండువేళ్లనూ మడిచి వాటి చివర్లను బొటనవేలితో తాకతూ 'తలైవర్'గా అశేషఅభిమానులు పేర్కొనే రజనీకాంత్ చూపిన 'యోగముద్ర' ఆదివారం సామాజిక మాధ్యమాలను పెను ఉప్పెనై ముంచెత్తేసింది. ఆదివారం మధ్యాహ్నానికల్లా ట్విటర్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లన్నీ రజనీ యోగముద్రతో నిండిపోయాయి. నిజాయితీకి మారుపేరై...కులరాజకీయాలకు అతీతమై అలరారే ఆధ్మాత్మిక రాజకీయ ప్రభుత్వం నా లక్ష్యం అంటూ ఆయన చూపిన ఈ యోగముద్ర ఎన్నెన్నో ఊహాగానాలకు తావిస్తోంది. అసలీ ముద్రనే ఆయన ఎన్నికల చిహ్నంగా మార్చుకుంటారా? అనే విషయంపై 'తలైవర్' ఇంకా పెదవి విప్పనే లేదు. ఆధ్మాత్మికం అంటే తన ఉద్దేశంలో స్వేచ్ఛాస్వాతంత్ర్యభరిత ప్రభుత్వం అనే విషయాన్ని ఆయన ఆ తర్వాత చెప్పడమూ గమనార్హమే.

తమిళనాట ప్రభంజనం సృష్టించిన ద్రవిడ ఉద్యమ లక్ష్యాలను ఒక్కసారి మననం చేసుకునే అవసరాన్ని కల్పించింది. సంఘసంస్కర్త ఈవీ రామస్వామి స్ఫూర్తితో పెల్లుబికిన ఈ ఉద్యమం ధాటికి దాదాపు ఆరుదశాబ్దాల పాటు తమిళ రాజకీయాల్లో ఎక్కడా కూడా 'ఆధ్మాత్మికత' అనే కనీస ప్రస్తావన జోలికి కూడా వెళ్లలేని పరిస్థితిని కల్పించింది. ఎంతో ప్రజాదరణ ఉన్న నాటి ఎంజీఆర్ కూడా బహిరంగంగా ఎక్కడా భగవదారాధన ముచ్చటే ఎత్తలేదు. ఆలయాలక్కూడా గుంభనంగానే వెళ్లి వచ్చేవారు. తర్వాత అధికార పీఠమెక్కిన ఏఐడీఎంకె సారధి జయలలిత మాత్రం బాహాటంగానే గుళ్లూ గోపురాలకు విరాళాలు ప్రకటించేశారు. రాజకీయాల విషయానికి వచ్చేసరికి ద్రవిడ ఉద్యమ స్రష్టలైన పెరియార్, అన్నాదురైలను ప్రత్యేకంగా ప్రస్తావించే వారు. మతం అనేది వ్యక్తిగతమైనదని తన మాటగా చెప్పుకొనేవారు. తనను ద్రవిడియన్ నేతగా చెప్పుకోవడానికి గర్వపడుతున్నాననే వారు. అంటే...మతం ఛాయ అనేది కూడా రాజకీయాలపై పడకుండా నేతలంతా ఆచితూచి చూసిన నేపథ్యంలో ఇప్పుడు తలైవర్ ప్రత్యేకంగా 'ఆధ్మాత్మిక' రాజకీయాలనడం కచ్చితంగా, స్పష్టంగా, తప్పనిసరిగా పరిగణించాల్సిన పరిణామం. పైగా, ఆయన ఎందరో ఆధ్మాతిక గురువులను నమ్ముతారు. అంతేకాదు, ఆరె స్సెస్ ఇప్పటిదాకా తమిళనాట సాధించలేకపోయిన పరిణామానికి రజనీ తెరతీయవచ్చు.



రజనీ పేరే.. ఓ స్టైల్

- ఆయన తెరపై కనిపిస్తే ప్రభంజనమే
- తెరవెనుక సామాన్యుడే..
- ఆడంబరాలకు దూరం

చెన్నై, న్యూస్‌టుడే: ముందుకొచ్చి పడే ముంగురుల నుంచి.. చేతులు తిప్పుతూ చెప్పే సెల్యూట్ వరకూ. ఆయనకు ఆయనే సాటి. నడకలో వేగం, నటనలో వైవిధ్యం.. ఆయన సొంతం. చెన్నైలోని జామ్‌బజార్ నుంచి జపాన్ వరకూ అయనకు అభిమానులే. కండక్టరుగా కెరీర్‌ను ఆరంభించి.. చిత్ర పరిశ్రమను శాసించగల స్థాయి ఆయనది.

★ రజనీకాంత్‌కు ఆభరణాలంటే పెద్దగా ఇష్టపడరు. గతంలో తన కుడిచేతికి కడియం ధరించేవారు. అయితే నెల్లైకి చెందిన తన అభిమాని తిరుమారన్‌కు దానిని బహుమతిగా ఇచ్చారాయన.

★ 'ఓ వ్యక్తి దేనినైనా దక్కించుకోవాలని బలంగా ప్రయత్నిస్తే.. ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదు'.. స్వామి వివేకానందుడి ఈ సూక్తే రజనీకాంత్ ఇంటి గుమ్మంపై ఉంటుంది.

★ ఆధ్యాత్మికానికి సంబంధించిన పుస్తకాలను చదవడం రజనీకి చాలా ఇష్టం. పలువురు రాజకీయవేత్తల జీవిత చరిత్రలన్నా ఆసక్తే.

★ తెలుపు, నలుపు వస్త్రాలను ఇష్టపడతారు.

★ 'నేను ఆధ్యాత్మిక వేత్తనే. అయితే ఒక చెంపపై కొడితే మరో చెంప చూపించేంత కాదు. అలాంటి పద్ధతి నాకు ఇష్టం ఉండ'దని రజనీకాంత్ ఓ సారి చెప్పారు.

★ తన వద్ద 25 ఏళ్లుగా పనిచేసిన వ్యక్తిగత సహాయకుడు జయరామన్‌కు ఇప్పటికీ వేతనం అందిస్తున్నారట.

★ కన్నడ, మరాఠీతోపాటు తమిళం, తెలుగు, మలయాళం, ఆంగ్ల భాషల్లో మాట్లాడగలరు.

★ హిమాలయ యాత్ర అంటే మహా ప్రీతి. ఏ ఆధ్యాత్మిక ప్రాంతాలకు వెళ్లినా రుద్రాక్షలను సేకరిస్తుంటారు సూపర్‌స్టార్.

★ తనకు ఏదైనా సినిమా బాగా నచ్చితే ఆ సినిమా యూనిట్‌ను పిలిపించి బంగారు గొలుసు కానుకగా ఇవ్వడం రజనీ అలవాటు.

★ ఎంజీఆర్, శివాజీ గణేశన్‌లంటే బాగా ఇష్టం. వాళ్లే చిత్ర పరిశ్రమకు మార్గదర్శకులు అని చెబుతుంటారు. శివాజీని 'నట విశ్వవిద్యాలయం' అని అభివర్ణిస్తుంటారు.

★ రజనీకాంత్ సినిమాలకు ఎక్కువగా సంగీతం అందించింది ఇళయరాజానే. ఆయన్ను ఆప్యాయంగా 'స్వామి' అని పిలుస్తుంటారు.

★ పర్సు, క్రెడిట్ కార్డులను వాడే అలవాటు లేదు. బయటకు వెళ్తే తక్కువ మొత్తంతీసుకెళ్తారు.

★ తన స్నేహితుల ఇంటికి సాదాసీదాగా వెళ్లి ఆశ్చర్యపరచడం ఆయనకు అలవాటు.

★ తనతో ఫొటో దిగేవారిలో చిన్న పిల్లలుంటే... వారిని ఎత్తుకుని ఫొటో దిగుతారు.

★ పుట్టినరోజు వేడుకలకు ఆమడ దూరం. ఏకాంతంగా ఉంటారాయన. తనను చూసేందుకు ఇంటికి రావద్దని చెబుతుంటారు.

★ చాలావరకు సన్నివేశాలను తన ఇంట్లో ఉన్న అద్దం ముందు నుంచోని రిహార్సల్ చేసే అలవాటు ఉందంటారు.

★ ఫైవ్ స్టార్ హోటళ్లకన్నా.. రోడ్డుపక్కన ఉన్న చిరు దుకాణాల్లో తినడానికే రజనీకాంత్ ఎక్కువ ఇష్టపడతారు. చెన్నైలోని పోరూర్ సిగ్నల్‌లో ఉన్న ఓ చిన్న దుకాణంలోని బిరియానీ అంటే ఇష్టం.

★ మెరీనాలోని వేరుశెనగలంటే ఇష్టపడి తింటారు.

★ తిరుమల కొండపైనే రజనీకాంత్-లతల వివాహమైంది.

అవకాశాలు ఉజ్వలం

- విదేశీ వార్తాసంస్థల అంచనా

దిల్లీ: రాజకీయరంగ ప్రవేశం చేస్తున్నట్లు ప్రకటించిన ప్రముఖ సినీనటుడు రజనీకాంత్‌కు అవకాశాలు ఉజ్వలంగా ఉంటాయని అగ్రశ్రేణి విదేశీ వార్తాసంస్థలు అంచనా వేస్తున్నాయి. రాజకీయంగా కొంత అస్థిరత నెలకొన్న తమిళనాడులో రజనీ తనదైన ముద్ర వేస్తారని రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొన్నాయి. జయలలిత మరణానంతరం రాజకీయ శూన్యత నెలకొందనీ, విపక్ష డీఎంకే అగ్రనేత కరుణానిధికి 93 ఏళ్లు నిండాయనీ గుర్తుచేశాయి. తమిళ రాజకీయాలపై సినీరంగ ప్రభావం ఎక్కువగా ఉందనీ, గతంలోనూ అనేకమంది ఈ రంగం నుంచి వచ్చి కీలక పదవుల్ని అందుకున్నారనీ ప్రస్తావించాయి. రెండు పార్టీలే ఏలుతూ వస్తున్న తమిళనాడులో అడుగుపెట్టేందుకు భాజపా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో రజనీ తీసుకున్న నిర్ణయానికి విశేష ప్రాధాన్యం ఉందన్నాయి.



రాఘవేంద్ర కల్యాణ మండపం వెలుపల అభిమానుల సందడి

రెండు దశాబ్దాల ఉత్కంఠకు తెర

ఈనాడు డిజిటల్, చెన్నై: రాజకీయాలు భ్రష్టుపట్టాయని, వాటి ప్రక్షాళనే లక్ష్యంగా పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రకటించారు. గెలుపోటములు దేవుడి చేతుల్లోనేనని పేర్కొంటూ.. రాజకీయాలంటే తనకు భయం లేదని స్పష్టంచేశారు. గెలిస్తే విజయం, లేకుంటే విరమణ అని ప్రకటించారు.

చిరుద్యోగి నుంచి..: కండక్టర్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించి అనుకోకుండా నటనవైపు వచ్చిన రజనీకాంత్ సూపర్‌స్టార్‌గా ఎదిగారు. వెండితెరపై తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించారు. ఆ అభిమానులే రాష్ట్ర రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్‌ను సమయం వచ్చినప్పుడల్లా ఆహ్వానించారు. తమిళనాడులో 1996 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన మొట్టమొదటిసారిగా రాజకీయ ప్రస్తావన చేశారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలనుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే ఆ అంశం అసంపూర్తిగా మిగిలిపోయింది. కాంగ్రెస్.. ఆయనను నిరుత్సాహపరుస్తూ అన్నాడీఎంకేకు మద్దతుగా నిలిచింది. అన్నాడీఎంకే, కాంగ్రెస్ సంకీర్ణంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. "ఒకవేళ జయలలిత తిరిగి అధికారంలోకి వస్తే.. దేవుడు కూడా తమిళనాడును రక్షించలేరు" అని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓడిపోయింది. డీఎంకే అధికారంలోకి వచ్చింది.

● 1996 ఎన్నికల్లో జయలలిత ఓటమికి తన పిలుపే ప్రధాన కారణమంటూ ఆ తర్వాత.. రజనీ పేర్కొన్నారు. ● అధికారంలోకి వస్తే నదుల అనుసంధానాన్ని చేపడతామన్న హామీపై 2004లో రజనీకాంత్.. ఎన్‌డీఏ కూటమికి మద్దతు తెలిపారు. ● 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు.. భాజపా ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోదీతో భేటీ కావడంతో రజనీ రాజకీయరంగ ప్రవేశంపై ఊహాగానాలు, చర్చలు మొదలయ్యాయి. ● 2014లో జైలు నుంచి విడుదలైన జయలలితతో సమావేశం కావడం ద్వారా రజనీ.. అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. జయ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తంచేశారు. ● 2016 డిసెంబరులో జయలలిత మరణించడంతో అప్పటి నుంచి అందరి చూపు రజనీకాంత్ వైపు మళ్లింది. ఈ క్రమంలో 2017 మే నెలలో రజనీ సమావేశమయ్యారు. యుద్ధానికి సిద్ధంగా ఉండాలని అభిమానులకు పిలుపునిచ్చారు.

జాతీయ పార్టీల యత్నాలు..: తమిళనాడులో పాగా వేయాలని చూసిన జాతీయ పార్టీలైన భాజపా, కాంగ్రెస్‌లు గతంలో రజనీకాంత్‌ను తమ వైపునకు తెచ్చుకోవాలని అన్ని ప్రయత్నాలు చేశాయి. మరోవైపు, ఏడాది కాలంలో రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రజనీకాంత్ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగలరని కేంద్ర నిఘావర్గాలు ఇటీవల చేసిన ఒక సర్వేలో వెల్లడైందని ప్రముఖ తమిళ పత్రిక పేర్కొంది. అందులో తమిళనాడు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రజనీకాంత్‌కు ఉందా? అనే ప్రశ్నకు మెజారిటీ శాతం ప్రజలు ఉందని తెలిపారని, ఆయన తమిళ ప్రజలను ప్రభావితం చేయగలరని ఎక్కువమంది అభిప్రాయపడ్డారని కథనంలో ఆ పత్రిక తెలిపింది.

ఏడాదిగా రజనీ చుట్టూ..: "రజనీకాంత్ రాజకీయ ప్రవేశం తప్పదు.. ఆయన త్వరలో పార్టీ ప్రకటన చేస్తారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారు. అతి త్వరలోనే సొంత పార్టీ పెడతారు..." లాంటి ప్రకటనలు ఏడాది కాలంగా బలంగా వినిపించాయి. సాక్షాత్తు సూపర్‌స్టార్ సోదరుడు సత్యనారాయణ రావు గైక్వాడ్ కూడా ఇలాంటి ప్రకటనలతో ఆసక్తి రేపారు. రజనీ స్నేహితుడు రాజ్ బహదూర్ కూడా రజనీకాంత్‌లో ఎవరూ చూడని కోణం ఒకటుందని, అది త్వరలో చూస్తారని, వ్యాఖ్యానించారు.

రజనీకాంత్ వ్యక్తిగతం

అసలుపేరు: శివాజీరావు గైక్వాడ్
ప్రస్తుత పేరు: రజనీకాంత్
ముద్దుపేర్లు: సూపర్‌స్టార్, తలైవర్, ఆండవర్
పుట్టినతేది : డిసెంబరు 12, 1950
జన్మస్థలం : బెంగళూరు
తల్లిదండ్రులు: రామోజీరావ్ గైక్వాడ్, రమాబాయ్
చదివిన పాఠశాల : బెంగళూరు సమీపం గవిపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
ప్రారంభ వృత్తి : బస్సు కండక్టర్
తొలిచిత్రం : 'అపూర్వ రాగంగల్' (1975). ఈచిత్రంలోనే దర్శకుడు బాలచందర్ శివాజీరావు పేరుని రజనీకాంత్‌గా మార్చారు.
100వ చిత్రం : శ్రీ రాఘవేంద్ర
మైలురాయి చిత్రాలు: వేలైక్కారన్, అన్నామలై, అరుణాచలం, బాషా
వివాహం : 1981లో లతతో...
నచ్చిన దేవుడు : వినాయకుడు, బాబా, రాఘవేంద్రస్వామి


రజనీ.. కమల్ !

ఒకరు క్లాసు, ఒకరు మాసు.. రజనీ, కమల్ ఇద్దరూ సినీ కళామతల్లి ముద్దుబిడ్డలే. ఇద్దరూ మిత్రులే. సూపర్ స్టార్లుగా ఇన్నాళ్లు సినిమా తెరపై పోటీ పడ్డారు. ఇకపై రాజకీయ తెరపైనా వీరు పోటీ పడబోతున్నారా? తమిళ రాజకీయం వీరిద్దరి చుట్టూనే తిరగబోతుందా? అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు నవంబరులోనే ప్రకటించిన కమల్‌హాసన్ జనవరిలో పార్టీకి సంబంధించి మొబైల్ యాప్‌ను ప్రారంభించబోతున్నారు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆదివారం రజనీకాంత్ ప్రకటించగా.. అంతకుముందే కాబోయే సీఎం రజనీ అంటూ పలుచోట్ల పోస్టర్లు వెలిశాయి. ప్రస్తుతం ఈ ఇద్దరి బలాబలాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

రాజకీయాలు వయా వెండితెర!


చెన్నై, న్యూస్‌టుడే: సినిమాలు, రాజకీయాలు.. తమిళనాడులో ఈ రెండింటిని వేర్వేరుగా చూడడం అత్యాశే అవుతుంది. కొన్ని దశాబ్దాలుగా ఆ రాష్ట్రంలో అధికారం చేపట్టిన, ప్రతిపక్షంలో కూర్చున్న అన్నాడీఎంకే, డీఎంకేల అధినేతలు ఇద్దరికీ సినిమా రంగంతో విడదీయరాని బంధముంది. వాస్తవానికి తమిళనాట రాజకీయాల్లోకి ప్రవేశించిన వారిలో అనేకమంది సినీనటులతోపాటు రచయితలు, ఇతర విభాగాల్లో పని చేసిన వారు ఉన్నారు. వీరిలో కొందరు విజయాలు సాధించి ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. అదేసమయంలో మరికొందరు పరాజయాల్ని మూటకట్టుకోవాల్సి వచ్చింది.

అన్నాదురై..



విజయాలు సాధించినవారిలో.. ప్రప్రథమంగా గుర్తుచేసుకోవాల్సిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై. ఆయన తమిళ సినిమా రంగంలో రచయితగా పని చేశారు. ఆకర్షణీయ స్క్రీన్‌ప్లే, డైలాగులు రాసి ఒకప్పుడు ఎంతో పేరు తెచ్చుకున్నారు. 1935లో ఆయన రాజకీయ ప్రవేశం జరిగింది. నీతికట్చిలో చేరి సేవలందించారు. ద్రవిడ పార్టీ వ్యవస్థాపకుడు పెరియార్‌తో కలిసి పని చేసిన ఆయన ఆ తర్వాత డీఎంకే పేరిట సొంత పార్టీ పెట్టారు. తద్వారా 1967లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించారు. అనంతరం ముఖ్యమంత్రిగా కొనసాగారు.

ఎంజీఆర్..



దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ కూడా ఒకప్పుడు తమిళనాట అగ్రనటుడు. ఆయన తన చలనచిత్రాల ద్వారా జనాదరణ పొందారు. 1972లో అన్నాడీఎంకేను ప్రారంభించారు. 1977లో జరిగిన ఎన్నికల్లో భారీ విజయం సాధించి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. సుమారు 10 సంవత్సరాల పాటు ఆ పదవిలో ఉన్నారు.

కరుణానిధి..



డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి సినీరంగంలో రచయితగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురైతో కలిసి రాజకీయ సేవలందించారు. అన్నాదురై మరణించినప్పటి నుంచి ఇప్పటివరకు డీఎంకే అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 1969లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత అన్నాడీఎంకే ప్రవేశంతో కరుణానిధి రాజకీయాల్లో వెనుకబడిపోయారు. ఎంజీఆర్ మరణం తర్వాత అనేక సార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టారు.

శివాజీగణేశన్..



దివంగత సినీ నటుడు, నడిగర్ తిలకంగా గుర్తింపు పొందిన శివాజీగణేశన్ కూడా ఒకప్పుడు రాజకీయ పార్టీ ప్రారంభించారు. 1995లో ద్రవిడ ఇయక్కం తరపున రాజకీయాల్లో కొనసాగిన ఆయన 1961లో కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. 1982లో రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 1987లో కాంగ్రెస్‌తో ఏర్పడిన విభేదాల కారణంగా ఆ పార్టీ నుంచి వైదొలిగారు. 'తమిళగ మున్నేట్ర మున్నని' పేరిట కొత్త పార్టీ పెట్టారు. సినీరంగం ద్వారా అభిమానులను సంపాదించినప్పటికీ రాజకీయాల్లో సత్తా చాటలేకపోయారు. తమిళనాట అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేసిన ఆయన పార్టీ పరాజయం పాలైంది. తిరువయ్యారులో బరిలో నిలిచిన ఆయన కూడా గెలవలేకపోయారు.

జయలలిత..

దివంగత ముఖ్యమంత్రి జయలలిత ఒకప్పటి నటీమణి. తెలుగు, తమిళం తదితర అనేక భాషల చిత్రాల్లో నటించారు. 1981లో ఆమె అన్నాడీఎంకేలో చేరి ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్‌కు చేదోడువాదోడుగా పని చేశారు. ఆయన మరణించిన తర్వాత పార్టీ పగ్గాలు చేపట్టారు. 1991లో ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారిగా ముఖ్యమంత్రి అయ్యారు. పదవిలో ఉండగానే 2016లో ఆమె కన్నుమూశారు.

విజయకాంత్..

ప్రముఖ నటుడు విజయకాంత్ 2005లో డీఎండీకేను ప్రారంభించారు. సినీ నేపథ్యంలో నుంచి రాజకీయ పార్టీని ప్రారంభించడంతో అప్పట్లో సంచలనం సృష్టించారు. తొలిసారి ఎన్నికల్లో ఒక సీటుకే పరిమితమైన ఆయన పార్టీ.. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను వెనక్కు నెట్టి శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో 2016లో ఒక్క సీటు కూడా గెలవలేదు.

★ నామ్ తమిళర్ కట్చి వ్యస్థాపకుడు సీమాన్ కూడా సినీ నటుడే. దర్శకుడిగా సుపరిచితమైన ఆయన రాజకీయ ప్రవేశం చేసినా చట్టసభలో మాత్రం ప్రాతినిధ్యం వహించలేదు. ఆందోళనలు, ఉద్యమాలతోనే సరిపెట్టారు.

★ మరో తమిళ నటుడు శరత్‌కుమార్ కూడా సొంతంగా అఖిలభారత సమథువ మక్కల్ కట్చి అనే రాజకీయపార్టీ పెట్టారు. 2011 నుంచి 16 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు.

★ కమల్‌హాసన్: రాజకీయాలంటే తనకు పడదంటూ వచ్చిన కమల్‌హాసన్ 2017లో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. బిగ్‌బాస్ షో ద్వారా బుల్లితెరపై కనిపించిన ఆయన అనంతరం చోటు చేసుకున్న వివాదాల నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అక్కడి నుంచి ఆయన దిశ మార్చుకుని ఏకంగా రాజకీయాల్లోకి వస్తున్నానని తన పుట్టిన రోజైన నవంబరు 7న ప్రకటించారు.

- **అన్నాడీఎంకేని ఎవరూ ఓడించలేరు**

ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయాల్లోకి రావచ్చు. దేశంలో ప్రతి ఒక్కరికీ పార్టీ పెట్టే హక్కు ఉంది. అయితే అన్నాడీఎంకేని ఎవరూ ఓడించలేరు. రజనీ సహా ఎవరూ మా ఓట్లను చీల్చలేరు.
- తమిళనాడు సీఎం పళనిస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం

- **మా పార్టీపై ఎలాంటి ప్రభావం ఉండదు**

రజనీకాంత్‌కు అభినందనలు. ఆయన అభిమానుల ఎదురుచూపులు ఫలించాయి. రజనీ రాజకీయ ప్రవేశం డీఎంకేపై ఎలాంటి ప్రభావం చూపదు. ***- స్టాలిన్, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు***

- **రజనీ నిరక్షరాస్యుడు, అవినీతిపరుడు**

రజనీకాంత్ నిరక్షరాస్యుడు, అవినీతిపరుడు. నేనెప్పుడూ ఆయనను వ్యతిరేకిస్తా. అవినీతిపై పోరాడడానికి ఆయనకు స్పష్టమైన అజెండా లేదు. ఆయన పార్టీ పేరు ప్రకటించలేదు కదా? ఆయనది ప్రచారార్భాటమే. ***- సుబ్రమణ్యస్వామి, భాజపా నేత***

- **మా పార్టీ లక్ష్యం కూడా అదే**

రాజకీయాల్లోకి రావాలన్న రజనీ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం. అవినీతి రహిత భారత్ - సుపరిపాలన.. భాజపా ఏకైక లక్ష్యం కూడా ఇదే. ***- తమిళిసై సౌందర్‌రాజన్, తమిళనాడు భాజపా అధ్యక్షురాలు***

- **అవసరమైతే రాజకీయాల్లోకి వస్తా**

తాను రాజకీయాల్లోకి వచ్చే సూచనలేవీ లేవు. అవసరమైతే మాత్రం తప్పక వస్తా. ***- నటుడు ప్రకాష్‌రాజ్***

- రజనీ ప్రకటన నాకు చాలా సంతోషాన్నిచ్చింది ***- టీటీవీ దినకరన్, ఆర్కేనగర్ ఎమ్మెల్యే***


- సోదరుడు రజనీ సామాజిక బాధ్యతని, రాజకీయ ప్రవేశాన్ని ఆహ్వానిస్తున్నా ***- ట్విట్టర్‌లో కమల్‌హాసన్***

- నా స్నేహితుడు రజనీ రాజకీయాల్లో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా ***- ట్విట్టర్‌లో అమితాబ్‌బచ్చన్***

బాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్, రితేష్‌దేశ్‌ముఖ్, నటి, కాంగ్రెస్ నాయకురాలు ఖుష్బూ తదితరులు రజనీకి అభినందనలు తెలిపారు.



ఈనాడు



కరీంనగర్ 1-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 142

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



బరిలోకి తలైవర్

రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన రజనీ

- అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని ప్రారంభిస్తానని వెల్లడి
- తమిళనాట 234 నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తాం
- లోక్‌సభ ఎన్నికలపై ఆ సమయంలో నిర్ణయం
- నాకు పదవులపై ఆశ లేనేలేదు.. అభిమానుల సమక్షంలో ప్రకటన
- 'దళపతి' రాజకీయ ప్రవేశంపై దశాబ్దాల ఊహాగానాలకు తెర
- రాజకీయ, సినీ ప్రముఖుల అభినందనలు

2లో



రాజకీయ రంగప్రవేశ ప్రకటన సందర్భంగా అభిమానులకు అభివాదం చేస్తున్న రజనీకాంత్

ఈనాడు

నూతన సంవత్సర కానుక



2018 క్యాలండర్

నేటి సంచికతో ఏజెంట్ / హాకర్ ద్వారా ఉచితంగా పొందండి

కార్ఖానాకు కొత్త వెలుగు

పరిశ్రమలకు ఇక నిరంతర విద్యుత్!

- 'ఆటో రీసైక్లర్' వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం
- దేశంలోనే తొలిసారి తెలంగాణ ప్రభుత్వ డిస్కం చర్యలు
- ఇప్పటివరకు ప్రైవేటు డిస్కంల్లోనే ఈ వ్యవస్థ
- రూ.300 కోట్లతో టెండర్లు పిలిచిన ఎస్పీడీసీఎల్
- విద్యుత్ విక్రయ ఆదాయం పెంపు ప్రధాన లక్ష్యం

ఈనాడు - హైదరాబాద్

పరిశ్రమలకు విద్యుత్ పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చేందుకు తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) శ్రీకారం చుట్టింది. రూ.300 కోట్ల వ్యయంతో కొత్తగా 'ఆటో రీసైక్లర్' వ్యవస్థను పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తోంది. ఈ పనులు చేయడానికి 'ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తు'లను ఆహ్వానిస్తూ తాజాగా ప్రకటన జారీచేసింది. ఈ నెల 28 వరకు దరఖాస్తు గడువునిచ్చింది. దేశంలో ఇంతకాలం కోల్‌కతా, దిల్లీ వంటి మహానగరాల్లో విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రైవేటు డిస్కంలే ఈ ఆటో వ్యవస్థను పరిశ్రమలకు ఏర్పాటుచేశాయి. తొలిసారి ప్రభుత్వ రంగంలో ఎస్పీడీసీఎల్ ఈ పనులు చేపడుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఎలా పనిచేస్తుందంటే...

రాష్ట్రంలో వివిధ చోట్ల ఉన్న పరిశ్రమల పార్కులు, పరిశ్రమలకు ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా కోసం 450 ఫీడర్లు ఉన్నాయి. ఒక్కోదాని పరిధిలో ఐదారు కిలోమీటర్ల మేర పరిశ్రమలకు కరెంటు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఒక ఫీడర్ పరిధిలో సాంకేతిక సమస్య వల్ల విద్యుత్తు సరఫరా ఆగితే దాని పరిధిలో ఉన్న (మిగతా 2లో)

సాగుకు నిరంతర విద్యుత్ దేశానికే ఆదర్శం

- పకడ్బందీగా అమలు చేయాలన్న సీఎం కేసీఆర్
- 24 గంటల సరఫరా పథకం ప్రారంభం

-3లో





వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

యువ ఓటర్లే నవభారత పునాది

- ఓటు శక్తి ప్రజాస్వామ్యానికి బలం
- పంద్రాగస్టుకు దగ్గర్లో నమూనా పార్లమెంటు
- జనవరి 4 నుంచి పరిశుభ్రతపై అతిపెద్ద సర్వే
- దిల్లీలో ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని నరేంద్రమోదీ

దిల్లీ: యువ ఓట్లే నవభారత్‌కు పునాదిగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. నూతన సంవత్సరాది నాటికి 18 ఏళ్లు పూర్తవుతున్నవారంతా సహస్రాబ్ది ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం 'మన్‌కీ బాత్'లో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 2000 సంవత్సరంలో పుట్టినవారు 2018లో ఓటర్లుగా అర్హత సాధిస్తారని గుర్తుచేస్తూ వారందరినీ భారత ప్రజాస్వామ్యం స్వాగతిస్తోందన్నారు. 'ఓటుకున్న శక్తి ప్రజాస్వామ్యానికి గొప్ప బలం. కోట్లమంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు ఇది అత్యంత శక్తిమంతమైన సాధనమ'ని మోదీ పేర్కొన్నారు. రాబోయే అయిదేళ్లలో దేశాన్ని సరికొత్తగా ఎలా తీర్చిదిద్దాలనే అంశంపై చర్చించడానికి పంద్రాగస్టుకు దగ్గర్లో దిల్లీలో నమూనా పార్లమెంటును నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లాకొక యువ ప్రతినిధిని ఎంపిక చేసి దీనికి పంపాలన్నారు. దీనికంటే ముందు ప్రతీజిల్లాలో ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. సరికొత్త భారతదేశంలో అందరికీ సమానావకాశాలు లభించి ప్రతి (మిగతా 2లో)



ముందు మన జీవితాలు ఎన్ని కొత్త పరవళ్లు తొక్కబోతున్నాయి?

నూతన సంవత్సర విశేషాలపై ప్రత్యేక కథనాలు 10, 11, 12 పేజీల్లో

గురుకులాల్లో పీజీటీ ఫలితాల వెల్లడి

-2లో

- సబ్జెక్టుల్లో 475 మందితో జాబితా



హైకోర్టు విభజన అంశాలపై ముఖ్యమంత్రి అంతర్గత సమీక్ష!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి హైకోర్టు విభజన అంశాలపై రెండు రోజుల పాటు అంతర్గత సమీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. ఆయన శని, ఆదివారాల్లో పార్టీ ఎంపీలు, ఇతర ముఖ్యనేతలతో చర్చించి, వారి అభిప్రాయాలను తీసుకున్నారని సమాచారం. ఉమ్మడి హైకోర్టు విభజనపై ఇటీవల లోక్‌సభలో తెరాస ఎంపీల ఆందోళన, కేంద్ర న్యాయ, హోంశాఖల మంత్రులు రవిశంకర్ ప్రసాద్, రాజ్‌నాథ్‌సింగ్‌లు దానికి చెప్పిన సమాధానం, ఏపీ సీఎం చంద్రబాబు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం ఇతర అంశాలపై మాట్లాడినట్లు తెలిసింది. 2018లో ఉమ్మడి హైకోర్టు విభజన ఖాయమని, సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటవుతుందని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. విభజన తీరు, తెలంగాణకు వచ్చే న్యాయమూర్తులు, పరిపాలనాపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. విభజన అనంతరం ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు.

'తలాక్'పై పోరాడిన ఇష్రత్ భాజపాలోకి

కోల్‌కతా: 'ముమ్మారు తలాక్'పై పెద్ద ఎత్తున న్యాయపోరాటం చేసిన మహిళ ఇష్రత్ జహాన్ తాజాగా భాజపాలో చేరారు. పశ్చిమబెంగాల్ భాజపా విభాగం ప్రధాన కార్యదర్శి సయాన్‌తన్ బసు ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించారు. ఆమె శనివారమే హౌరాలోని భాజపా కార్యాలయానికి వచ్చి పార్టీలో చేరినట్లు ఆయన వెల్లడించారు. తలాక్‌ను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పోరాటం చేసిన అయిదుగురు బాధిత మహిళల్లో ఇష్రత్ ఒకరు.

బరిలోకి తలైవర్

చెన్నై - న్యూస్‌టుడే

ఆదివారం ఉదయం తమిళనాడు అంతటా ఉత్కంఠ ఉదయించిన వేళ... దేశమంతటా ఉత్సుకత నిండిన వేళ.. చెన్నైలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో వేలాది మంది అభిమానుల కేరింతలు, కోలాహలం పొంగిన వేళ.. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు. త్వరలోనే రాజకీయపార్టీని స్థాపిస్తున్నట్టు ఘనంగా వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని శాసనసభ స్థానాలకూ పోటీ చేస్తామని ఉత్సాహంగా తెలిపారు. తన రాజకీయ ప్రవేశంపై రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించారు. అభిమానులు గౌరవంగా పిలుచుకునే తలైవర్(నాయకుడు) బిరుదుకు సార్థకత చేకూర్చేందుకు నడుం బిగిస్తున్నట్టు తేల్చారు. రజనీ ప్రకటనతో తమిళనాట అంతటా ఆయన అభిమానులకు నూతన సంవత్సర, సంక్రాంతి సంబరాలు ముందే వచ్చేశాయి. ఎక్కడ చూసినా ఆనందోత్సాహాలతో పెద్దఎత్తున బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. మైమరచి నృత్యాలు చేశారు. తమకోరిక ఇన్నాళ్లకు నెరవేరుతోందంటూ పండగ చేసుకున్నారు. రజనీ నిర్ణయంపై పెద్దఎత్తున సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. సినిమాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగిన 'దళపతి' రాజకీయాల్లోనూ మహోన్నత శిఖరాలు అధిరోహించాలంటూ ఆకాంక్షించారు.



ప్రకటన చేయగానే అభిమానుల ఆనందోత్సాహాలు



రాజకీయ ప్రవేశ ప్రకటన తర్వాత అభిమానులకు అభివాదం చేస్తున్న రజనీకాంత్

రాజకీయాల్లోకి రావడానికి భయం లేదు

గత మే నెలలో అభిమానులతో సమావేశమైన రజనీకాంత్ మళ్లీ డిసెంబరు 26వ తేదీన అదే తరహా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చివరి రోజైన ఆదివారం తన రాజకీయ ప్రవేశంపై స్పష్టం చేస్తానని తొలిరోజే ప్రకటించారు. ఆ మేరకు ఉదయం రాఘవేంద్ర కల్యాణమండపానికి బయలుదేరడానికి ముందుగా పోయెస్‌గార్డెన్‌లోని తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతూ... "మరో పది నిమిషాల్లో చెప్పేస్తా. దయచేసి వేచి ఉండండి"అని సమాధానమిచ్చారు. తర్వాత మండపానికి విచ్చేసిన ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. కొన్ని నిమిషాలపాటు అభిమానుల కేకలు, కేరింతలు ఆగలేదు. తర్వాత రజనీకాంత్ ప్రసంగిస్తూ... "అభిమానులను ఎలా అభినందించాలో అర్థం కావడం లేదు. ఎంతో క్రమశిక్షణతో, ప్రశాంతంగా ఫొటోలు తీసుకుంటూ సహకరిస్తున్నారు. నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చు. నాకు రాజకీయాల్లోకి రావడంలో ఎలాంటి భయం లేదు. మీడియాను చూస్తేనే భయమేస్తోంది. హేమాహేమీలే మీడియాను చూసి భయపడుతున్నారు. నేను ఓ చిన్న బిడ్డలాంటివాడిని. ఎలా భయపడకుండా ఉండగలను. చో రామస్వామి నాకు మంచి మిత్రుడు. ఆయన అతిపెద్ద బలం. ఇప్పుడు పక్కన ఉంటే చాలా సంతోషపడేవాడిని. అయినా ఆయన ఆత్మ ఎప్పుడూ నాతోనే ఉంటుందని నమ్ముతున్నా. నేను రాజకీయాల్లోకి తప్పకుండా వస్తా. ఇది కాల నిర్ణయం. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే కొత్త పార్టీని ప్రారంభించి 234 నియోజక వర్గాల్లోనూ పోటీకి అభ్యర్థులను దింపుతా. సమయం చాలా తక్కువగా ఉన్నందువల్ల స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఆ సమయంలో నిర్ణయం తీసుకుంటా. పేరు, ప్రఖ్యాతులు, పదవులకు ఆశపడి నేను రాజకీయాల్లోకి రావడం లేదు. వాటికి నేను ఏనాడూ ఆశపడిన దాఖలాలు లేవు. అందుకు పలురెట్లు ఎక్కువగా మీరు నాకు ఇచ్చారు. 1994లో పదవి నన్ను వెతుక్కుంటూ వచ్చింది. అప్పుడు లేని ఆశలు, 68 ఏళ్ల వయస్సులో నాకు వస్తాయా?.... అలా ఆశపడితే నేను పిచ్చివాడినే!

ప్రజల అభిమానం ఉంటే ఏదైనా సాధ్యం

నిజమైన, స్వచ్ఛమైన, పారదర్శకమైన, నిజాయతీ కలిగిన రాజకీయాలను తీసుకురావాలన్నదే నా ఉద్దేశం. ఇందుకు ప్రజలందరూ నాకు సహకరించాలని కోరుకుంటున్నా. పార్టీ ప్రారంభించి ఎన్నికల్లో పోటీ చేయడమనేది సాధారణమైన విషయం కాదు. నడి సముద్రంలో మునిగి ముత్యాన్ని వెలికి తీయడంతో సమానం. దేవుడి ఆశీస్సులు, ప్రజల నమ్మకం, అభిమానం, ఆదరణ, ప్రేమ ఉంటే ఏదైనా సాధించగలం. అది తప్పకుండా లభిస్తుందన్న నమ్మకం ఉంది. ఒకప్పట్లో రాజులు మరో రాజ్యంపై దండెత్తి విజయం సాధించినప్పుడు... ఆ రాజ్యంలోని ఖజానాను స్వాధీనం చేసుకునేవారు. కానీ ఇప్పటి రాజకీయ నేతలు ప్రజాస్వామ్యం పేరుతో సొంత ప్రాంతంలోనే కాజేస్తున్నారు. ఈ పరిస్థితులు మారాలి.

అభిమానులు కాపలాదారులుగా మారాలి

నాకు కార్యకర్తలు వద్దు... మీరందరూ కాపలాదారులుగా మారాలి. మీ సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఇచ్చే పథకాలు ప్రజలకు సరైనరీతిలో చేరకుండా చేసే దుష్టశక్తులను అడ్డుకునే కాపలాదారులుగా ఉండాలి. ఎవరు తప్పు చేసినా నిలదీసే కాపలాదారులుగా మారాలి. మిమ్మల్ని మంచిగా చూసుకునే ప్రజా ప్రతినిధిని మాత్రమే నేను. ప్రస్తుతం నమోదు కాని అభిమాన సంఘాలను కూడా ఓ పద్ధతి ప్రకారం నమోదు చేయాలి. వాటిని పాత సంఘాలతో చేర్చాలి. ప్రతి ప్రాంతంలోనూ మన అభిమాన సంఘాలు ఉండాలి.

రాజకీయాలు మాట్లాడొద్దు

క్రమశిక్షణ చాలా ముఖ్యం. యుద్ధానికి తయారయ్యేంత వరకు మనమెవరం రాజకీయాల గురించి మాట్లాడకూడదు... నాతో సహా! ఎవర్నీ విమర్శించకండి. ప్రకటనలు విడుదల చేయడం, పోరాటాలు చేయడం వంటి రాజకీయాలు చేసేందుకు చాలా మంది ఉన్నారు. ప్రజల ప్రేమ, మద్దతును సొంతం చేసుకుందాం. మనం ఏం చేస్తామో వారికి చెబుదాం. గద్దెనెక్కిన తర్వాత మూడేళ్లలో ఆ పనులన్నీ చేసి చూపిద్దాం. లేకుంటే రాజీనామా చేసేద్దాం. నిజాయతీ, శ్రమ, ఉన్నత స్థాయి.. ఇదే మన తారక మంత్రం. 'మంచి అనుకుందాం; మంచి చేద్దాం; అంతా మంచే జరుగుతుంది'.. ఇదే మన లక్ష్యం. ప్రజాస్వామ్య పోరులో ఇక మన సేన కూడా తప్పకుండా ఉంటుంది"అని పేర్కొన్నారు.

రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి

ప్రస్తుతం రాజకీయాలు చాలా భ్రష్టుపట్టిపోయాయి. ఏడాది కాలంలో జరిగిన కొన్ని రాజకీయ విషయాలు, ఘటనలు తమిళనాడులోని ప్రతి ఒక్కరినీ తలదించుకునేలా చేశాయి. అన్ని రాష్ట్రాల ప్రజలు మనల్ని చూసి నవ్వుతున్నారు. నాకు ఈ స్థాయిని ఇచ్చిన ప్రేక్షక దేవుళ్లకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వస్తున్నా. ఇప్పటికీ నేను రాజకీయాల్లోకి రాకపోతే... ఈ ప్రజలకు నేను ఏమీ చేయలేకపోయానన్న బాధ చచ్చేంత వరకు నన్ను వేధిస్తుంది. రాజకీయ పరిస్థితులను మార్చాల్సిన పరిస్థితి వచ్చేసింది. వ్యవస్థను మార్చాలి.

అన్నింటికీ ఒకే సెట్‌టాప్ బాక్స్

- కేబుల్ వినియోగదారులకూ 'ఎమ్ఎన్‌పీ' సౌకర్యం కల్పించాలి
- పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫార్సు

ఈనాడు, దిల్లీ: మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ (ఎమ్ఎన్‌పీ) సౌకర్యం తరహాలో.. కేబుల్ వినియోగదారులూ తమకు నచ్చిన సర్వీస్‌కు మారేందుకు వీలుగా ఒకే ఏకీకృత సెట్‌టాప్ బాక్స్‌ను తీసుకురావాలని కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. దీంతో పోటీపెరిగి వినియోగదారుడికి తక్కువ ధరకే నాణ్యమైన సేవలు అందుతాయని పేర్కొంది. ఏకీకృత సెట్‌టాప్‌బాక్స్‌లు బహిరంగమార్కెట్‌లో లభ్యమయ్యేలా చేస్తే ధరలు తగ్గడంతోపాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాల సమస్య తగ్గుతుందని విశ్లేషించింది. సర్వీస్‌ప్రొవైడర్లకూ సమానమైన అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. ప్రస్తుతం కేబుల్‌ఆపరేటర్లు, ఎంఎస్‌ఓలు ఒక్కో సాధారణ సెట్‌టాప్ బాక్స్‌కు రూ. వెయ్యినుంచి రూ. 1200 వసూలుచేస్తున్నారని.. హెచ్‌డీ బాక్సులపై మరింత బాదుతున్నారని తెలిపింది. ఇన్‌స్టలేషన్, యాక్టివేషన్‌లకు అదనంగా రుసుములు వసూలుచేస్తున్నట్లు పేర్కొంది. కనెక్షన్ ఇచ్చేసమయంలో పరికరాలు, ఇతర సేవలను వేర్వేరుగా చూపి అంశాలవారీగా బిల్లింగ్ చేయాలని పేర్కొంది. సెట్‌టాప్ బాక్సులను దేశీయంగా తయారుచేసే సౌకర్యం పెంచాలని సిఫార్సుచేసింది.

సెల్‌కాన్ కంపెనీ డైరెక్టర్లపై కేసు

మాదాపూర్, న్యూస్‌టుడే: తప్పుడు ఆర్థిక నివేదికలు తయారు చేసి రూ. 15 కోట్ల మోసానికి పాల్పడ్డారంటూ సెల్‌కాన్ కంపెనీకి చెందిన డైరెక్టర్లు వై. స్వప్నకుమార్‌తో పాటు రెతినేని మురళీకృష్ణ, కె. రాధాకృష్ణ, కుజేటి కృష్ణపవన్, వై. గురుస్వామినాయుడులపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల గురుస్వామినాయుడు మిగతా డైరెక్టర్లు కలిసి కంపెనీకి సంబంధించి తప్పుడు ఆర్థిక నివేదికలు తయారుచేసి రూ. 15 కోట్ల మోసానికి పాల్పడ్డారంటూ కంపెనీలో 10 శాతం వాటా ఉన్న డైరెక్టర్ స్వప్నకుమార్ కోర్టును ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇదీ సంగతి!



గురుకులాల్లో పీజీటీ ఫలితాల వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

గురుకులాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) సబ్జెక్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ ఆదివారం ప్రకటించింది. పీజీటీలో 513 పోస్టులకు 475 మంది అభ్యర్థులతో కూడిన ఎంపిక జాబితాను విడుదల చేసింది. దీంతో గురుకులాల్లో పీజీటీ పోస్టుల ఫలితాలు పూర్తయ్యాయి. భాషలు, సబ్జెక్టులు కలిపి 921 పోస్టులకు ఫలితాలు వెల్లడయ్యాయి. ఆదివారం విడుదల చేసిన పీజీటీ గణితం, బయోలాజికల్ సైన్స్, సోషల్ సైన్సెస్, ఫిజికల్‌సైన్స్ పోస్టులకు జులై 18, 19 తేదీల్లో రాతపరీక్షలు జరిగాయి. ఈ పోస్టులకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచి ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసింది. పీజీటీ పోస్టుల్లో దాదాపు 75 పోస్టులు ఖాళీగా మిగిలిపోయినట్లు తెలుస్తోంది. భాషల పోస్టులకు 363 మంది అభ్యర్థులు మాత్రమే ఎంపికయ్యారు. మరో 45 పోస్టులకు అభ్యర్థులు అందుబాటులో లేరు. ఇందులో 17 పోస్టులకు అర్హులైన దివ్యాంగ అభ్యర్థులు అందుబాటులో లేరు. మిగతావి 28 ఉర్దూ పోస్టులు. ఇక సబ్జెక్టుల్లోనూ ఇదేపరిస్థితి నెలకొంది. ఏజెన్సీ ప్రాంతంలో అభ్యర్థి లేనందున బయోలాజికల్ సైన్స్‌లో ఒక పోస్టు మిలిగిపోయిందని టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ప్రకటించింది. సబ్జెక్టుల్లో 30 వరకూ పోస్టులకు అభ్యర్థులు అందుబాటులో లేరని తెలిసింది. ఖాళీల తుది వివరాలు తేలేందుకు మరికొంత సమయం పట్టవచ్చు.

ఫలితాలు ఇలా...

- పీజీటీ గణితంలో 126 పోస్టులకు 114 మంది అభ్యర్థులతో కూడిన ఎంపిక జాబితాను కమిషన్ ప్రకటించింది.
- బయోలాజికల్ సైన్స్ కేటగిరీలో 22 పోస్టులకు 21 మంది ఎంపికయ్యారు.
- సోషల్ సైన్సెస్‌లో 177 పోస్టులకు 166 మంది అభ్యర్థులతో నియామక జాబితా వెల్లడైంది.
- ఫిజికల్ సైన్స్ కేటగిరీలో 188 పోస్టులకు 174 మందితో కూడిన ఎంపిక జాబితాను విడుదల చేసింది.
- ఆయా సబ్జెక్టుల్లో దివ్యాంగుల కోటాలోని ఖాళీలను వైద్యపరీక్ష నివేదికలు వచ్చిన తరువాత వెల్లడిస్తుంది.

అటవీ కళాశాల ఫలితాలు..

ములుగులోని అటవీ కళాశాల పరిశోధన సంస్థలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎనిమిది మంది అభ్యర్థులతో కూడిన ప్రాథమిక జాబితాను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. వివిధ సబ్జెక్టుల్లో కలిపి 19 పోస్టులకు ప్రకటన జారీ చేయగా... ఎనిమిది పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రొఫెసర్ పోస్టుల్లో రెండు సబ్జెక్టులకు దరఖాస్తులు స్వీకరించగా.. ఒకటే పోస్టుకు దరఖాస్తు వచ్చింది. అసోసియేట్ ప్రొఫెసర్ కేటగిరీలో నాలుగు సబ్జెక్టులకు దరఖాస్తు రాలేదు. సహాయ ప్రొఫెసర్ కేటగిరీలో 12 సబ్జెక్టుల్లో 11కు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. వీటిలోనూ ఏడు సబ్జెక్టుల పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. ఒక లైబ్రేరియన్ పోస్టుకు జనవరి 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు.

యువ ఓటర్లే నవభారత పునాది

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కరి కలలూ నెరవేరాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలిచిపోయే పరిశుభ్రత సర్వేను జనవరి 4 నుంచి మార్చి 10 వరకు నిర్వహించి, స్వచ్ఛభారత్ లక్ష్యాలు పట్టణప్రాంతాల్లో ఎంతవరకు నెరవేరాయో మదింపు చేస్తామని తెలిపారు. 4000 నగరాల్లో 40 కోట్ల మంది ప్రజలతో ఈ సర్వే జరగనుందన్నారు.

'ఘన'తంత్రానికి 10 మంది అతిథులు

ఈసారి గణతంత్ర వేడుకలకు 10 మంది ముఖ్య అతిథుల్ని రాజ్‌పథ్‌కు ఆహ్వానిస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్)లో ఉన్న పది దేశాల నేతలూ దీనికి హాజరవుతారనీ, ఇది భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ లేని వేడుకగా నిలిచిపోతుందనీ చెప్పారు. 'ఆసియాన్ ఏర్పడి 50 ఏళ్లు, ఆ కూటమితో భారత్ భాగస్వామ్యానికి పాతికేళ్లు నిండింది. ఆ వేడుకల ముగింపు నేపథ్యంలో గణతంత్ర ఉత్సవాలకు ఆసియాన్ దేశాల అధినేతలంతా రానుండడం భారతీయులందరికీ గర్వకారణం. జనవరి 25న దిల్లీలో జరిగే ముగింపు సదస్సుకు వారందరినీ స్వాగతించడానికి నేనెంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాన'ని చెప్పారు. మహిళలు ఒంటరిగానూ హజ్‌యాత్ర చేసే అవకాశాన్ని తమ సర్కారు తీసుకువచ్చిందనీ, ఇదొక చిన్న విషయంగా కనిపిస్తున్నా సమాజంపై ఎంతో ప్రభావం చూపిస్తుందనీ అన్నారు.

తలాక్ బిల్లుతో మహిళలకు ఊరట

దిల్లీ: అప్పటికప్పుడు ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతిని నిషేధించే బిల్లుతో ముస్లిం మహిళలకు ఊరట లభించిందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. అనేక ఏళ్లుగా ముస్లిం మహిళలు పడుతున్న బాధలకు ఎట్టకేలకు విముక్తి లభించిందన్నారు. ఈ బిల్లుపై తొలిసారిగా ఆయన స్పందించారు. కేరళలోని శివగిరి మఠం 85వ యాత్రోత్సవాలను ఆదివారం ఆయన ప్రత్యక్ష ప్రసార సదస్సు ద్వారా ప్రారంభించారు. మహిళల హక్కుల కోసం తాము వేసిన పెద్ద ముందడుగుతో సంఘ సంస్కర్తల ఆత్మలూ శాంతిస్తాయని చెప్పారు.

కార్ఖానాకు కొత్త వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

వందల కనెక్షన్లన్నింటికీ నిలిచిపోతోంది. ఒకసారి కరెంటు పోతే ఫీడర్‌లో ఏ సెక్షన్‌లో సమస్య వచ్చిందనేది తెలుసుకోవడానికి విద్యుత్ సిబ్బంది అన్ని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తనిఖీ చేయక తప్పదు. ఇలా వారు సమస్యను గుర్తించి సరిచేసేసరికి ఐదారు గంటల సమయం పడుతోంది. అంతసేపు కరెంటు పోతే పరిశ్రమలకు సగటున వంద మెగావాట్ల వరకు వినియోగం నిలిచిపోతోంది. ఈ మేరకు వాటి నుంచి విద్యుత్తు బిల్లుల ద్వారా ఆదాయం డిస్కంకు రావడం లేదు. ఒకసారి ఒక ఫీడర్‌లో కరెంటు నిలిచిపోతే రూ. 30 లక్షలకు పైగా బిల్లుల ఆదాయం కోల్పోతున్నట్లు డిస్కం అధ్యయనంలో గుర్తించారు. ఆదాయం పోవడం ఒక సమస్య అయితే నిరంతర సరఫరా కోసం విద్యుత్కేంద్రాల్లో విద్యుదుత్పత్తి జరుగుతోంది. సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో వాడకం లేనందున ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ఎక్కడికి పంపాలో తెలియక గ్రిడ్ నిర్వహణలో మరో సమస్య వస్తోంది. దీన్ని అధిగమించేందుకు ప్రతి ఫీడర్ పరిధిలో ఒక ఆటో రీసైక్లిర్, 3 సెక్షనలైజర్లు ఏర్పాటుచేయనున్నారు. ఇవి ఏర్పాటైన తర్వాత ఫీడర్ పరిధిలో సాంకేతిక సమస్య ఏర్పడితే ఆ కొద్ది ప్రాంతంలోనే సరఫరా ఆగేలా ఆటో రీసైక్లిర్ నియంత్రిస్తుంది. అదే ఫీడర్ పరిధిలో మిగిలిన 3 వంతుల కనెక్షన్లకు సరఫరా ఉంటుంది. పైగా సమస్య ఎక్కడ ఏర్పడిందనే సమాచారం ఆటో రీసైక్లిర్ ద్వారా నేరుగా కంట్రోలు గదిలోని కంప్యూటర్ తెరపై కనిపిస్తోంది. వెంటనే అక్కడికెళ్లి దాన్ని పరిష్కరించి సరఫరాను పునరుద్ధరిస్తారు. దీనివల్ల పరిశ్రమలకు చాలా తక్కువగా సరఫరా ఆగి, విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతుంది. బిల్లుల ద్వారా ఆదాయం అధికంగా వస్తుంది. విద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తిని ఆపాల్సిన అవసరం ఉండదని డిస్కం అధికారులు వివరించారు.

భారత సంతతి పౌరులు ఇక నుంచీ తమ 'పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్'(పీఐవో) గుర్తింపు కార్డులను 'ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా'(ఓసీఐ) కార్డులుగా మార్చుకోవాలంటే నిర్దేశిత రుసుమును చెల్లించాల్సి ఉంటుందని కేంద్రహోం శాఖ వర్గాలు తెలిపాయి.

గ్రహం అనుగ్రహం

1-1-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
చతుర్దశి: ఉ. 11-23 తదుపరి పూర్ణిమ
మృగశిర నక్షత్రం: మ. 3-13 తదుపరి ఆర్ద్ర
అమృత ఘడియలు: ఉ. 7-00 నుంచి 8-30 వరకు
వర్జ్యం: రా. 11-02 నుంచి 12-31 వరకు
దుర్ముహూర్తం: మ. 12-24 నుంచి 1-08 వరకు
తిరిగి మ. 2-36 నుంచి 3-20 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-34; సూర్యాస్తమయం: సా.5-32

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	5.7	29.0
మెదక్	9.6	32.4
రామగుండం	12.0	29.4
హన్మకొండ	12.0	31.0
హైదరాబాద్	12.7	30.8
నిజామాబాద్	13.0	28.0
కరీంనగర్	13.0	30.0
మహబూబ్‌నగర్	15.0	30.9
ఖమ్మం	17.0	32.0
అనంతపురం	17.4	30.4
సూర్యాపేట	20.0	32.0

అనుసంధానమే సమస్య

- నేటి నుంచి ఎరువుల రాయితీలో కొత్త విధానం
- అమ్మే ప్రతి బస్తా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందే

రంగారెడ్డి జిల్లా నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో ఎరువుల విక్రయాల్లో విప్లవాత్మక మార్పు తెచ్చే కేంద్ర ప్రభుత్వ పథకం సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. నేరుగా లబ్ధిదారుకు రాయితీ బదిలీ(డీబీటీ) చేసే ఈ పథకాన్ని పలు రాష్ట్రాల్లో ఆంగ్ల సంవత్సర ప్రారంభం నుంచి శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసినందున క్షేత్రస్థాయిలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. పాత రంగారెడ్డి జిల్లాలో గత ఏడాదిగా ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేశాయి. ప్రతి ఎరువుల దుకాణానికి 'పాయింట్ ఆఫ్ సేల్' (పీఓఎస్) యంత్రాన్ని ప్రభుత్వం తరపున ఎరువుల కంపెనీ సరఫరా చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 7,326 పీఓఎస్‌లలో గతనెల 30నాటికి 6641 పంపిణీ చేయగా వాటిలో 6377 నెట్‌వర్క్‌తో కలిపాయి. ఈ ప్రక్రియ రాష్ట్రమంతా పూర్తికాలేదు. సోమవారం నుంచి ఈ దుకాణంలో నిల్వ ఉండే ప్రతి ఎరువు బస్తాల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించాలి. ఎవరైనా రైతు ఎరువు కోసం వస్తే ముందుగా అతని ఆధార్ సంఖ్యను నమోదుచేసి వేలిముద్ర తీసుకున్న తరువాతనే విక్రయించాలి. ఆన్‌లైన్‌లో వివరాలు ప్రత్యక్షం కావడానికి 10 నిమిషాల నుంచి అరగంట వరకూ పడుతోందని ఇబ్రహీంపట్నం, తాండూరుకు చెందిన వ్యాపారులు సత్యనారాయణ, శ్రీనివాస్‌లు వాపోయారు. మారుమూల పల్లెల్లో ఆధార్ వివరాలు నమోదు కాగానే వివరాలు కనిపించడానికి ఇంటర్‌నెట్ అనుసంధానాని(నెట్‌వర్క్)కి సిగ్నల్ కలవడం లేదని, ఇది అమ్మకాలపై ప్రభావం పడుతోందంటున్నారు. భవిష్యత్తులో రైతుల వివరాలన్నీ ఈ యంత్రాల్లో కనిపించే ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. భూసార పరీక్షల వివరాలు ఇందులో కనిపించేలా చూడాలని కసరత్తు చేస్తోంది.


ఆధార్‌లు తనిఖీ చేయాలి



-అంజిరెడ్డి, ఆదర్శ రైతు, శేరిగూడ, రంగారెడ్డి జిల్లా

ఎరువుల కొనుగోలుకు ఎవరి ఆధార్‌నైనా నమోదు చేసే సదుపాయం కల్పించారు. దీని వల్ల వ్యాపారులు వారికిష్టమైన వారి ఆధార్‌లను నమోదుచేసి ధరలు పెంచి అమ్మేసుకుంటున్నారు. కచ్చితంగా రైతు ఆధార్‌ను మాత్రమే నమోదు చేసేలా ఏర్పాటు ఉండాలి.

సరళతరం చేయాలి



-శివశంకర్, వ్యాపారి, తాండూరు

పీఓఎస్ యంత్రాలతో అమ్మకాల్లో సమయం వృథా అవుతోంది. పథకం బాగానే ఉన్నా అమలులో సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామాలకు అంతర్జాలం సిగ్నల్స్ వేగంగా అందినపుడే ఎరువుల అమ్మకాలు వేగంగా చేయగలం.

కేంద్రం అభినందనలు తెలిపింది

-పార్థసారథి, కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయశాఖ

యంత్రాల పంపిణీ, అంతర్జాల అనుసంధాన ప్రక్రియలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉందని కేంద్రం అభినందనలు తెలిపింది. మిగిలిన వాటిని వేగంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించాం. రాష్ట్రంలో దీనిని పటిష్ఠంగా అమలు చేయాలని అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

జడ్‌ఎఫ్‌ఆర్‌సీ ఛైర్మన్లుగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్ పాఠశాలల రుసుముల నియంత్రణలో భాగంగా నియమించే జోనల్ రుసుముల నియంత్రణ కమిటీ(జడ్‌ఎఫ్‌ఆర్‌సీ) ఛైర్మన్లుగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు వ్యవహరిస్తారు. ఈమేరకు ఆచార్య తిరుపతిరావు కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఛైర్మన్ సహా అయిదుగురు కమిటీలో ఉంటారు. విద్యావేత్త, ఆడిట్ విభాగాధికారి, విద్యాశాఖాధికారి, మరొకరు ఈ కమిటీలో ఉంటారు. రుసుములపై నిర్ణయం తీసుకోవాలంటే కనీసం ముగ్గురు సభ్యుల మద్దతు(కోరం) అవసరం. ఈ కమిటీ యాజమాన్యాల ఆదాయ, వివరాలను పరిశీలించి ఎంత రుసుం పెంచుకోవచ్చో రాష్ట్రప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. రాష్ట్ర విద్యాశాఖ తుది నిర్ణయం తీసుకుంటుంది. గతంలో 2008 ఆగస్టులో జిల్లాల వారీగా కలెక్టర్లు ఛైర్మన్లుగా డీఎఫ్‌ఆర్‌సీలు ఉండాలని జీఓ91ను ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం జారీ చేసింది. రుసుములను నిర్ణయించే అధికారం డీఎఫ్‌ఆర్‌సీలకు ఉండదని పాఠశాలల యాజమాన్యం న్యాయస్థానానికి వెళ్లడంతో దాన్ని 2016 సెప్టెంబరులో సుప్రీంకోర్టు వారి వాదనను సమర్థించి జీఓలో మార్పులు చేసుకోవాలని సూచించింది. ఈక్రమంలో తాజాగా జడ్‌ఎఫ్‌ఆర్‌సీల ఏర్పాటు, దాని సిఫారసు మేరకు రాష్ట్రప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని తిరుపతిరావు కమిటీ ప్రతిపాదించింది.

వచ్చే ఎన్నికల్లో విజయం మాదే: ఉత్తమ్

ఈనాడు, హైదరాబాద్: 2019 ఎన్నికల్లో కేంద్రంలో, తెలంగాణలో విజయం కాంగ్రెస్‌దేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం దూరదర్శన్ మాజీ జేడీ సుజాత్‌అలీ సహా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఉత్తమ్ మాట్లాడుతూ..లౌకికత్వం, సామాజిక న్యాయమున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన తెరాస హామీ 40 నెలలైనా అమలు కాలేదని చెప్పారు. రిజర్వేషన్లపై మాట నిలబెట్టుకోవాలని, లేదంటే ముస్లింల ఓట్లు అడిగే హక్కు సీఎం కేసీఆర్‌కు లేదన్నారు. పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభం కాకపోవడం పాతనగరంపై వివక్ష చూపడమేనని విమర్శించారు. రెండు పడకల గదుల ఇళ్లు మైనార్టీలకు ఎన్ని కట్టారని ప్రశ్నించారు.

4 నుంచి తెదేపా శ్రేణులకు శిక్షణ

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ

ఈనాడు, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ మండల స్థాయి నేతలకు ఈనెల 4 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మొత్తం 10 అంశాలపై నిర్వహిస్తున్న ఈ తరగతులకు మండల స్థాయి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర ముఖ్యనేతలను పిలుస్తున్నట్లు చెప్పారు. తెదేపా రాజకీయ ప్రస్థానం, ప్రస్తుత రాజకీయాల్లో పార్టీ ఆవశ్యకత, తెరాస ప్రభుత్వ వైఫల్యాలు, దళితులకు మూడెకరాల పంపిణీ, సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్, రిజర్వేషన్లు, సామాజిక భద్రత తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. తెలంగాణలో తెదేపా లేదని తెరాస చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఈ తరగతులకు మండల స్థాయి నేతలు పలువురు ఆసక్తిగా ముందుకొస్తున్నట్లు తెలిపారు.

పట్టాలెక్కని 'భాగస్వామ్య' బండి

- సగానికిపైగా ఖర్చు రాష్ట్రం భరిస్తేనే కొత్త రైల్వే ప్రాజెక్టులు
- పలు రాష్ట్రాలతో ఇలాంటి ఒప్పందాలు
- తెలంగాణ నిర్ణయం కోసం రైల్వే శాఖ నిరీక్షణ

- పెద్దపల్లి- కరీంనగర్- నిజామాబాద్.. 1993-94లో మంజూరైన ఈ రైల్వే ప్రాజెక్టు పూర్తవడానికి రెండు దశాబ్దాలకు పైగానే పట్టింది.
- పదేళ్ల క్రితం మంజూరైన కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైనులో రెండేళ్ల నుంచే కదలిక మొదలై పనులు జరుగుతున్నాయి.

ఇలా కేంద్ర బడ్జెట్‌లో అరకొర నిధుల కేటాయింపులతో కొత్త రైల్వే లైన్లు పూర్తవడానికి దశాబ్దాలు పడుతోంది. అంచనా వ్యయం వందల కోట్ల నుంచి వేల కోట్లకు పెరుగుతోంది. ఉన్న ప్రాజెక్టుల్ని పూర్తి చేయడానికి పెద్దఎత్తున నిధులు కేటాయించాల్సి వస్తుండడంతో కొత్తవాటి మంజూరులో రైల్వే శాఖ దృక్పథం మార్చుకుంది. భూమి కేటాయింపులతో పాటు సగానికిపైగా నిర్మాణ వ్యయం రాష్ట్రాలు భరించేలా సంయుక్త భాగస్వామ్య ఒప్పందం (జాయింట్ వెంచర్) విధానాన్ని తీసుకువచ్చింది. తెలంగాణతో కూడా ఈ ఒప్పందం కుదిరితే కొత్త రాష్ట్రంలో నూతన రైలు మార్గాల పనులు వేగంగా జరిగేందుకు, కావల్సినచోట కొత్త రైల్వే లైన్లు నిర్మించుకునేందుకు దోహదపడుతుంది. దక్షిణాదిలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే రైల్వే నెట్‌వర్క్ తక్కువగా ఉన్న తెలంగాణ.. కొత్త విధానాన్ని అందిపుచ్చుకుని పెద్దఎత్తున రైలు మార్గాలు నిర్మించుకోవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ పరిధిలో ఇప్పటికే మొదలుపెట్టిన కొత్త రైలు మార్గాల్లో ఐదింటికి ఇంకా రూ.2,500 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. మూడో లైను పనులకు రూ.1,134 కోట్ల వరకు, తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న ప్రాజెక్టులకు ఏపీ, తెలంగాణ మరో రూ.2,000 కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంది. గతేడాది మంజూరయిన ఆదిలాబాద్- ఆర్మూర్ నూతన రైలు మార్గం అంచనా వ్యయం రూ.2,800 కోట్లు. పటాన్‌చెరు- ఆదిలాబాద్‌తో పాటు మరికొన్ని కొత్త రైలు ప్రాజెక్టులున్నాయి. ఈ కొత్త ప్రాజెక్టుల్లో కనీస పురోగతి లేదు. వీటిని జేవీ పరిధిలోకి తేవాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది.

భారమూ ఉంటుంది.

ఈ విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థికభారం పడుతుందన్న వాదనా ఉంది. గతంలో పూర్తి వ్యయం రైల్వే శాఖే భరించేది. జేవీ వల్ల ఆర్థికంగా లాభసాటిగా ఉండే మార్గాలనే ఎంచుకునే అవకాశాలుంటాయి. వెనుకబడిన ప్రాంతాలకు రైలు మార్గాల నిర్మాణానికి ప్రతికూలం కావచ్చు.

ఏడాదిగా ప్రతిపాదనల్లోనే..

నూతన విధానంలో రైల్వే శాఖ పలు రాష్ట్రాలతో జేవీ ఒప్పందాలు చేసుకుంది. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌తోనూ ఎంఓయూ కుదుర్చుకుంది. తెలంగాణతో ఒప్పందం ఏడాదిగా ప్రతిపాదనల్లోనే ఉంది. సంయుక్త భాగస్వామ్య ఒప్పందంపై సంతకం కాలేదని, దీనికి ఇంకా సమయం పడుతుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఒప్పందానికి రైల్వే శాఖ సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు రావాలని దక్షిణ మధ్య రైల్వే వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ విషయంలో చొరవ చూపడం లేదని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

– ఈనాడు, హైదరాబాద్

జేవీతో ప్రయోజనాలేంటి?

- స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ) పరిధిలోకి తీసుకువచ్చిన కొన్ని ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని ఉచితంగా ఇస్తోంది. నిర్మాణ వ్యయంలో కొన్నింటికి గరిష్ఠంగా 50 శాతం భరిస్తోంది. అయినా రాష్ట్రానికి నయా పైసా ప్రయోజనం ఉండదు.
- సంయుక్త భాగస్వామ్య ఒప్పందం ఇందుకు పూర్తిగా భిన్నం. భూమితో పాటు 51 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వం భరించాలి.
- ఆ ప్రాజెక్టుపైనా, దానిపై వచ్చే ఆదాయంలోనూ రాష్ట్రానికి వాటా ఉంటుంది.
- ఏ ప్రాంతంలో కొత్తగా రైలు మార్గం కావాలన్నా కీలక నిర్ణయాధికారం రాష్ట్రం చేతిలోనే ఉంటుంది. కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేయక్కర్లేదు.
- సంయుక్త భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంటే దాని పరిధిలోకి వచ్చే ప్రాజెక్టుల నిర్మాణానికి రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కూడా రుణాలు తీసుకోవచ్చు. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయొచ్చు.



వేదిక వద్ద 134 రకాల పుష్పాల పళ్లేలు. (అంతరచిత్రంలో) తల్లి పాదాలకు పుష్పాభిషేకం చేస్తున్న దారా విష్ణుమోహన్‌రావు దంపతులు

అమ్మకు అరుదైన గౌరవం

95 ఏళ్ల తల్లికి 134 రకాల పుష్పాలతో పాదపూజ

ఖమ్మం జిల్లా మండల కేంద్రం తల్లాడకు చెందిన దారా సుబ్బమ్మ(95)కు విష్ణుమోహన్‌రావు ఏకైక కుమారుడు. జన్మనిచ్చిన తల్లికి అరుదైన బహుమానం ఇవ్వాలని భావించిన ఆయన..పాద పుష్పాభిషేకానికి ఏర్పాట్లు చేసి బంధుమిత్రులను ఆహ్వానించాడు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆదివారం ఆమెకు 134 రకాల పుష్పాలతో దంపత సమేతంగా అభిషేకం చేశాడు. ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, తల్లాడ

బతుకు జీవుడా..!

- ప్రమాదంలో స్పృహ కోల్పోయిన వ్యక్తి
- రెండు రోజులు డీసీఎం వ్యాన్‌లోనే

వలిగొండ, న్యూస్‌టుడే: ప్రమాదంలో వాహనం అదుపుతప్పగా.. అపస్మారక స్థితికి చేరిన ఆ చోదకుడు 31 గంటల తర్వాత తనకు తానే తెలివిలోకి వచ్చి బతికి బయటపడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లాకు చెందిన పొలిశెట్టి ఆంజనేయులు వృత్తిరీత్యా డ్రైవర్. నల్గొండలో నివాసం ఉంటున్నాడు. డీసీఎం వ్యాన్‌లో పత్తి లోడు చేసుకుని నల్గొండ నుంచి జగిత్యాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా శుక్రవారం అర్ధరాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అక్కంపల్లి స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ. . డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా..ఆంజనేయులు స్పృహతప్పాడు. ఆదివారం ఉదయం వరకు అలాగే ఉండిపోయాడు. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో స్పృహలోకి వచ్చిన ఆంజనేయులు అటుగా వెళ్తున్న వారి చరవాణి ద్వారా సోదరుడు మల్లేష్‌కు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఆయన భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కట్టుకున్నోడి.. కిరాతకం

- భార్య, కుమారుడి హత్య
- ఇద్దరి గొంతుకోసి పరారైన నిందితుడు
- అనుమానమే కారణం



బాలమ్మ (పాతచిత్రం) ★ విగతజీవిగా చిన్నారి వివేక్ ★ నిందితుడు శ్రీనివాస్

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అనుమానానికి మద్యం మత్తు తోడవడంతో మానవ మృగంగా మారిన వ్యక్తి..భార్య, ఐదు నెలల పసికందును గొంతుకోసి హతమార్చాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం సీసీసీలో ఆదివారం ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సంపంగి శ్రీనివాస్‌కు, నస్పూర్ మండలం సీసీసీ విద్యానగర్‌కు చెందిన పీరక్క-తుకారాం దంపతుల కుమార్తె బాలమ్మ(19)తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. తొలి కాన్పు కోసం ఆర్నెల్ల క్రితం పుట్టింటికి వెళ్లిన బాలమ్మ.. కుమారుడు వివేక్(5 నెలలు)తోపాటు అక్కడే ఉంటోంది.

మద్యానికి బానిసై: ఇటీవలి కాలంలో మద్యానికి బానిసైన శ్రీనివాస్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో అత్తింటికి వెళ్లిన ప్రతిసారీ ఆమెతో గొడవ పడేవాడు. క్రిస్మస్ పండగకు అత్తగారింటికి వెళ్లి.. అక్కడే ఉంటున్న అతను ఆదివారం ఉదయం మద్యం తాగి ఇంటికొచ్చాడు. భార్యతో గొడవకు దిగాడు. అదికాస్తా ఘర్షణకు దారితీయడంతో ఆవేశానికి లోనై విచక్షణ కోల్పోయాడు. ఇంట్లోనే ఉన్న కత్తితో తొలుత భార్య, తర్వాత కుమారుడి గొంతు కోసి పరారయ్యాడు. తీవ్ర రక్త స్రావమై..ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు.

రోగుల సహాయకులకు మెరుగైన సౌకర్యాలు

- ఓపీ సేవల సమయమూ పెంపు
- 'ఈనాడు' కథనంపై ఆరోగ్యమంత్రి లక్ష్మారెడ్డి స్పందన

ఈనాడు – హైదరాబాద్



లక్ష్మారెడ్డి

రోగులు, వారి సహాయకులకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, రోగుల సహాయకులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. రోగుల సహాయకుల కష్టాలపై 'దయలేని దవాఖాన' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలను పేర్కొంటూ వైద్యవిద్య సంచాలకులకు, రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీకి ఆదివారం మంత్రి ఆదేశాలు జారీచేశారు. రోగుల సహాయకుల సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉండడం వల్లనే ఎవరూ కోరకుండానే వసతిగృహాల నిర్మాణాలపై ఆదేశాలిచ్చారని, అందులో భాగంగానే ఇప్పటికే కొన్ని ఆసుపత్రుల్లో 'రాత్రిబస' గృహాలను నిర్మించామన్నారు. జీహెచ్‌ఎంసీ సౌలభ్యంతో నిలోఫర్, ఉస్మానియా తదితర ఆసుపత్రుల్లో నిర్మించిన వాటిని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఏయే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్తగా వసతిగృహాలు నిర్మించాల్సిన అవసరముందో వాటి ప్రతిపాదనలను యుద్ధప్రాతిపదికన రూపొందించాలని, కేవలం పడుకోవడానికే కాకుండా స్నానాల గదులు, మరుగుదొడ్లు, దుస్తులు శుభ్రపర్చుకునే ప్రదేశాలను, అందుకు అవసరమైన నీటిని, తాగునీరు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగులకు సాధ్యమైనంత వరకూ ఏరోజు ఓపీ సేవలు ఆరోజే ముగిసిపోయేలా చర్యలు చేపట్టాలని, గరిష్ఠంగా రెండు రోజులు మించకుండా ఓపీలో వైద్యుని సంప్రదింపులు, నిర్ధారణ పరీక్షలు పూర్తవ్వాలని సూచించారు. కొత్తగా నిర్మించబోయే ఆసుపత్రుల ప్రతిపాదనల్లో ముందుగానే రోగుల సహాయకుల వసతిగృహ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించి అనుమతులు పొందాలన్నారు.

నదీజలాలపై కేంద్రం పట్టు!

- అంతర్‌రాష్ట్ర నదులపై అవసరమైతే జోక్యం
- ముసాయిదా చట్టం రూపకల్పన
- న్యాయనిపుణులతోనూ లోతుగా చర్చ

ఈనాడు – హైదరాబాద్

అంతర్‌రాష్ట్ర నదులపై అవసరమైనప్పుడు కేంద్రం కూడా జోక్యం చేసుకొనేలా చట్టంలో మార్పులు చేయాలని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఇందుకు సంబంధించి తేనున్న కొత్త చట్టం ముసాయిదాలో ఈ అంశాన్ని పేర్కొంది. ఇటీవల న్యాయనిపుణులతోనూ లోతుగా చర్చించింది. ఇప్పటివరకు బేసిన్ పరిధిలోని రాష్ట్రాలు నీటి వినియోగంపై ఒప్పందాలు చేసుకోవడం, పూర్తిగా ఈ నీటిపై తమదే హక్కు అనేలా వ్యవహరిస్తున్నాయి. వాస్తవానికి ఇప్పటివరకు ఇదే ఉంది. రానున్న రోజుల్లో కేంద్రం దీన్ని తన చేతిలోకి తీసుకొనే అవకాశం కనిపిస్తోంది.

కేంద్ర జోక్యం ఇలా..

అంతర్‌రాష్ట్ర నదీ వివాదాలు తలెత్తినపుడు వీలైనంత వరకు ట్రైబ్యునళ్ల ఏర్పాటు వరకు పోకుండా చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని ముసాయిదా చట్టం పేర్కొంది.

ఇక్కడే కేంద్ర జోక్యానికి వెసులుబాటును కూడా కల్పించింది. నదీ పరివాహక ప్రాంతంలోని ఏ రాష్ట్రానికీ అది సొంతం కాదు. అయితే ప్రజల కోసం నది నీటిని వినియోగించుకొనే హక్కు ఉంది. కానీ ఇతరుల హక్కులను కాలరాయకూడదని, నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఎలా వినియోగించుకోవాలన్నది ముందుగానే అంగీకారానికి రావాలని కేంద్రం పేర్కొంది. ఇప్పటివరకు బేసిన్ పరిధిలోని రాష్ట్రాలు నీటి వినియోగంపై ఓ అంగీకారానికి వస్తున్నాయి. రాలేకపోతే కేంద్రానికి ఫిర్యాదు చేస్తే అంతర్‌రాష్ట్ర జలవనరుల చట్టం ప్రకారం ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తుంది. ఈ ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం నీటిని వినియోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు కేంద్ర జోక్యం లేకపోగా రానున్న రోజుల్లో పెరగనుంది.

చట్టానికి తుదిరూపు!

ముసాయిదా బిల్లులో కేంద్రం పాత్ర, జోక్యం గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ.. న్యాయనిపుణులతో సమావేశం ఏర్పాటు చేసి దీనిపై చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతర్‌రాష్ట్ర జలవనరుల చట్టంలో కేంద్ర ప్రమేయం గురించి ఉందని, దీనికే కొన్ని మార్పులు చేస్తే సరిపోతుందని నిపుణులు సూచించినట్లు తెలిసింది. కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ కూడా కొన్ని సిఫార్సులు చేసింది. వీటన్నింటి ఆధారంగా చట్టానికి తుదిరూపం ఇచ్చే ఆలోచనతో జలవనరుల మంత్రిత్వ శాఖ ఉంది. దీనికి పార్లమెంటుతో పాటు రాష్ట్రాలు కూడా ఆమోదించాలి. తెలంగాణ అంతర్‌రాష్ట్ర జలవనరుల విభాగం ఆధ్వర్యంలో నదుల అనుసంధానంపై జరిగిన చర్చలోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. రానున్న రోజుల్లో రాష్ట్రాలు ఆమోదించినా, ఆమోదించకపోయినా కేంద్రమే ఓ నిర్ణయం తీసుకొనే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుందని కొందరు విశ్రాంత ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

ముసాయిదాలో ఏముంది?

నీటి వినియోగంపై కొత్త చట్టాన్ని తేవాలని నిర్ణయించిన కేంద్రం ముసాయిదాను తయారు చేసి రాష్ట్రాలకు పంపింది. దీని ప్రకారం

- ప్రతి నదీ పరివాహక ప్రాంతానికి ఒక అథార్టీని ఏర్పాటు చేయాలి.
- కేటాయింపులకు తగ్గట్లు రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవాలి.
- వినియోగాన్ని లెక్కగట్టేందుకు వాల్యూమెట్రిక్ యంత్రాల ఏర్పాటు చేయాలి.
- వాణిజ్యం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన వాటికి వాడుకున్న నీటికి ఛార్జీలు వసూలు చేయాలి.

సాగుకు నిరంతర విద్యుత్ దేశానికే ఆదర్శం

ఈనాడు, హైదరాబాద్ : కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని రైతన్నల కోసం చేపట్టిన నిరంతర విద్యుత్ పంపిణీ పథకాన్ని పకడ్బందీగా, విజయవంతంగా అమలు చేయాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆయన ఆదివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో పలు దఫాలు మాట్లాడారు. ఈ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. దీని అమలు కోసం విద్యుత్‌తో పాటు వ్యవసాయం ఇతర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాను ప్రారంభించిన తర్వాత క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలన్నారు. దీనిపై రైతులందరికీ సమాచారం అందించాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. విద్యుత్ పుష్కలంగా అందుబాటులో ఉన్నందున రైతులకు పంపుసెట్ల వినియోగంపై ఎలాంటి చింత ఉండదన్నారు.

అర్ధరాత్రి పొలాలకు సీఎండీలు: విద్యుత్ రంగంలో కొత్త శకానికి నాంది పలుకుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వ్యవసాయానికి 24గంటల(నిరంతర) కరెంట్ సరఫరాను ఆదివారం అర్ధరాత్రి 12.01 గంటలకు ప్రారంభించినట్లు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు 'ఈనాడు'కు తెలిపారు. మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలం పోతాయపల్లి గ్రామంలోని చింతల వెంకట్‌రెడ్డి అనే రైతు పొలంలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పండుగను రైతులతో నేరుగా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా జరుపుకునేందుకు ఆదివారం అర్ధరాత్రి సమయంలో పొలాలకు వెళ్లినట్లు చెప్పారు. ఇక వ్యవసాయానికి విద్యుత్ కోత ఉండదని, ప్రభుత్వం సహకరిస్తోందని రైతులు సంతోషంగా చెప్పినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా పతకాలు ప్రకటించిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన వారికి ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. పోలీసు, అవినీతి నిరోధక శాఖ, ప్రత్యేక భద్రతా దళం(ఎస్పీఎఫ్), అగ్నిమాపకశాఖ, ప్రత్యేక పోలీసు పటాలాలలో పనిచేసే సిబ్బందికి పతకాలు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా వీటిని ప్రదానం చేయనున్నారు.

పోలీసుశాఖ

ముఖ్యమంత్రి సేవాపతకం

1. యరబాటి శ్రీనివాసరావు, కమాండెంట్, మొదటి బెటాలియన్, తెలంగాణ ప్రత్యేక పోలీసు పటాలం.
2. కిరణ్ రాయ్, డీఎస్పీ, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్,
3. మది ప్రవీణ్‌కుమార్, అదనపు సీఐ, అఫ్జల్‌గంజ్
4. కొక్కొండ బలరాజు, ఎస్సై, సీసీఎస్, శంషాబాద్. వీటితోపాటు 11మందికి శౌర్యపతకం, 37మందికి ఉత్తమ సేవాపతకం, 21మందికి కఠిన సేవా పతకం, 165 మందికి సేవాపతకం

ప్రత్యేక భద్రతా దళం

మహోన్నత సేవాపతకం

1. బిక్షపతి, అసిస్టెంట్ కమాండెంట్.

ముగ్గురికి ఉత్తమ సేవాపతకం, 15మందికి సేవాపతకం

అగ్నిమాపక విపత్తు నివారణశాఖ

ఆరుగురికి శౌర్యపతకం, ఒకరికి ఉత్తమ సేవాపతకం, 14మందికి సేవా పతకాలు

అవినీతి నిరోధక శాఖ

ముగ్గురికి ఉత్తమ సేవాపతకం, 12మందికి సేవాపతకాలు ప్రకటించారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ఇద్దరికి సేవాపతకాలు.

ఈనాడు
రాజకీయాలపై రజనీ కాంతులు


రెండు దశాబ్దాల ఉత్కంఠకు తెరదించుతూ 'తలైవర్' రజనీకాంత్ చేసిన తాజా ప్రకటన తమిళ రాజకీయాల తీరుతెన్నుల్ని మార్చేసేటంత ప్రభావాన్వితమైనది. 'దేవుడు శాసిస్తే రజని పాటిస్తాడు' అంటూ తన రాజకీయ రంగ ప్రవేశంపై ఎప్పటికప్పుడు మాట దాటవేస్తూ వచ్చిన 'సూపర్ స్టార్'- సొంత పార్టీ స్థాపించి వచ్చే శాసనసభ ఎన్నికల్లో 234 స్థానాల్లోనూ పోటీ చెయ్యాలనుకుంటున్నట్లు ప్రకటించడంతో అభిమాన జనసంద్రం ఆనందోత్సాహాలతో ఎగసిపడుతోంది. 'యుద్ధంలో విజయం సాధించేందుకు వీరత్వం మాత్రమే సరిపోదు... వ్యూహం ఉండాలి' అని మూన్నాళ్ల క్రితమే అభిమాన గణానికి స్పష్టీకరించిన రజనీ- ప్రజాస్వామ్య అవ్యవస్థపైనా, తాను ఆశిస్తున్న మార్పు మీద స్పష్టమైన మనోభావాల్ని వెల్లడించారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనలు తమిళులంతా సిగ్గుతో తలదించుకొనేలా చేశాయని, ప్రజాస్వామిక పంథాలో ప్రజలకు మంచి చెయ్యడానికి తానిప్పుడు ముందుకురాకపోతే ఆ అపరాధభావన తనను జీవితాంతం వెంటాడుతుందన్న రజనీ- తన రాజకీయ దృక్కోణాన్ని చూచాయగా ఆవిష్కరించారు. తన మొదటి లక్ష్యం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలకొద్దీ అభిమాన సంఘాలను క్రమబద్ధీకరించడమేనంటూ, సొంత పనులు చక్కబెట్టుకొనే కార్యకర్తల బలగం తనకు అవసరం లేదని, స్వచ్ఛంద సేవకుల సైన్యం తన వెంట నడవాలని క్రమశిక్షణాయుత లక్షణ రేఖలు గీస్తున్నారు. నిజాయతీ, గట్టికృషి, అభివృద్ధి- ఇవే తన పార్టీ నినాదాలని, కులమతాల ఛాయలు ఏ మాత్రం లేని పారదర్శక 'ఆధ్యాత్మిక రాజకీయాలు' రావాల్సిన అవసరం ఉందంటున్నారు. ఐహిక భోగాలకు ఆమడ దూరం ఉండే వ్యక్తిగా, హిమాలయాల్లో ఆధ్యాత్మిక చింతన అనురక్తుడిగా అందరికీ తెలిసిన రజనీ- సమకాలీన రాజకీయాల్లో ఆధ్యాత్మికతకు ఎలా పాదు చెయ్యగలరన్నది ఊహాకందనిది! ఇప్పుడు పార్టీలు సొంత ప్రజల్నే దోపిడి చేస్తున్న వ్యవస్థ మారాలంటూ స్వీయరాజకీయ అరంగేట్రానికి రజనీ 'క్లాప్' కొట్టినా- పేరు, గుర్తు, సిద్ధాంతాల క్రోడీకరణతో పార్టీ విడుదల తేదీ కోసం మరికొంత కాలం ఆగాలి!

గజ సమానంగా ఎదిగిన ద్రవిడ కజగ పార్టీల మధ్య పోరులో తృతీయ రాజకీయ పక్షం ఏ మాత్రం నిలదొక్కుకోలేదని తమిళనాట దశాబ్దాల చరిత్ర చాటుతోంది. డీఎంకే నుంచి విడివడి ఎంజీఆర్ ఆల్ఇండియా అన్నాడీఎంకే స్థాపించింది మొదలు ఆ రెండు ప్రధాన పక్షాల మధ్యే పోటాపోటీ! చరిత్రను తిరగరాసి ఏఐఏడీఎంకే వరసగా రెండోసారి అధికారానికి రావడానికి కారణమైన పురచ్చితలైవి జయ నిరుడు డిసెంబరులో మరణించడంతో- పాలక పక్షం దిక్కులేనిది కావడమే కాదు; ఎవరూ పూడ్చలేని రాజకీయ శూన్యం ఏర్పడింది. డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి సైతం అంపశయ్యపై భీష్ముడిలా ఉండటంతో తమిళ రాజకీయాల భవిష్యత్తు ఆందోళనకరంగా మారింది. జయలలిత ప్రాతినిధ్యం వహించిన ఆర్కే నగర్ ఉప ఎన్నిక ఫలితం- డీఎంకే, ఏఐఏడీఎంకేలకు చావుదెబ్బలాంటిది. రాజకీయ అవ్యవస్థ తీవ్రతను ముందే పసిగట్టి కొన్ని నెలల క్రితమే కమల్ హాసన్ తాను రాజకీయాల్లోకి అడుగిడుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే. తన రంగు 'కాషాయం' కాదని, ఏ రాజకీయ పక్షంలోనూ చేరబోననీ స్పష్టీకరించిన కమల్- సొంత పార్టీ ఏర్పాటుకు పూర్వరంగం సిద్ధం చేసుకొంటున్నారు. రాజకీయ భాషాపదకోశంపై పట్టులేక, సమస్యల సున్నితత్వంపై అవగాహన కొరవడి, హిందూ ఉగ్రవాదమన్న సూత్రీకరణలతో తీవ్ర విమర్శల పాలవుతున్నారు. కమల్ తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చినట్లుగా- సవిస్తృత ప్రజాసమూహాల మద్దతుతో పార్టీ ఏర్పాటయ్యేదాకా తనతో సహా ఎవరూ రాజకీయాలు మాట్లాడకూడదని రజనీకాంత్ గిరి గీస్తున్నారు. విజయమో వీర స్వర్గమో తేల్చుకోవాలిగాని, అసలు యుద్ధానికే మొహం చాటేస్తే పిరికిపందలంటారంటూ అభిమానులకు వీరగంధాలు పూస్తున్న రజనీ రాకతో తమిళ రాజకీయాల దశ దిశ మారతాయనడంలో సందేహం లేదు!

రాజకీయాల్ని, నైతిక విలువల్ని వేరుచేసి చూడలేమన్నారు మహాత్మాగాంధీ. దురదృష్టవశాత్తు డెబ్బయ్యేళ్ల స్వతంత్ర భారతంలో శీలహీన రాజకీయ ఘోషే ఆసేతు శీతనగం ప్రతిధ్వనిస్తోంది. ఇండియాలో నాలుగో అతిపెద్ద రాష్ట్రంగానే కాదు, 2005-'06 నుంచి 2016-'17 మధ్య 11.8 శాతం వృద్ధితో 20,780 కోట్ల డాలర్ల స్థూల రాష్ట్రోత్పత్తి సాధించిన ఘనాపాటిగా రాణకెక్కిన తమిళనాడు- అవినీతి, బంధుప్రీతి, వారసత్వపోరు, రాజకీయ అనిశ్చితి ఆటుపోట్లతో చితికిపోతోంది. తెరవేల్పులను నేతలుగా నెత్తిన పెట్టుకొనే విలక్షణ సంస్కృతిగల రాష్ట్రం- అన్నాదురై, ఎంజీఆర్, జయలలితలతో పాటు రాజకీయ కథా సంవిధాన దురంధరుడైన కరుణానిధినీ అక్కున చేర్చుకొంది. పాతికేళ్ల క్రితమే రజనీని రాజకీయాల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం జరిగినా ఆయన అనాసక్తి కారణంగా అది నెరవేరలేదు. దరిమిలా 1996లో డీఎంకే-టీఎంసీ కూటమికి ప్రత్యక్షంగా మద్దతు ప్రకటిస్తూ, జయ పార్టీని గెలిపిస్తే రాష్ట్రాన్ని ఆ భగవంతుడు కూడా రక్షించలేడని స్పష్టీకరించిన రజనీ- అప్పటినుంచే రాజకీయ ప్రవేశంపై ముందువెనకలాడుతున్నారు. ఆధునిక సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ తనకు ఇష్టమైన నాయకుడని చెప్పిన రజనీకాంత్- అట్టడుగు స్థాయినుంచి పార్టీ నిర్మాణంపై ఆచితూచి అడుగేయక తప్పదు. కర్ణాటకలో 23 ఏళ్ల పాటే ఉన్న తాను దాదాపు అంతకు రెట్టింపు కాలం తమిళనాట తమిళుడిగానే జీవిస్తున్నానని, రాష్ట్రం వదిలిపొమ్మంటే హిమాలయాలకే వెళతానన్న 'తలైవర్' నిజాయతీని శంకించాల్సిన పని లేదు. ఢక్కామొక్కీలు తిన్నా సిద్ధాంతాలు, విలువల్ని వదిలిపెట్టని నిబద్ధ రాజకీయాలకు చిరునామాగా మారగలిగితే రజనీ పార్టీ సూపర్ హిట్టవుతుందనడంలో సందేహం లేదు!

యువభారతానికి కొత్త అజెండా


'చెబుతున్నవారిని బట్టి నిజం విలువ మారదు... సమర్థకులు, వ్యతిరేకులను బట్టి న్యాయం వాసి తరగదు' అంటారు అమెరికన్ మానవతావాది మాల్కమ్ ఎక్స్. నల్లజాతి అమెరికన్ల హక్కులకోసం జీవిత పర్యంతం పోరాడిన మాల్కమ్‌ను ఆయన 39వ ఏట దుండగులు కాల్చి చంపారు. మనిషి బాగు గురించి మాట్లాడే ప్రతి గళంలోనూ ఆయన ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. ప్రశ్న వినబడకుండా గొంతు నొక్కే నియంతలను నిలదీసే నైతిక బలిమికీ అలాంటి యోధుల ధీరత్వమే ప్రాతిపదిక. అయోగ్యులు, అక్రమార్కుల పాల బడి కుంటుపడిన భావి భారత నిర్మాణాన్ని తిరిగి గాడిన పెట్టాలంటే పదును, పరిణతి, నియతిగల ప్రశ్నించే యువజనమే కీలకం. స్వాతంత్ర్యానికి ముందు స్వదేశీ ఉద్యమం మొదలు నిన్న మొన్నటి నిర్భయ పోరాటం దాకా తరతరాల బూజును ఊడ్చిపారేసే సంఘటిత శక్తిగా సత్తా చాటిన యువజనం- కట్టుతప్పితే ఓటు వేటు వేయడానికి సదా సిద్ధంగా ఉంటుందన్న ఎరుక రాజకీయ పక్షాల్లో ఎంతో అవసరం. నిరుద్యోగం, అవిద్య, అసమానతలు, మహిళలపై అత్యాచారాల నిరోధంపై వాగ్దానాలే తప్ప సమర్థ పరిష్కారాలు వాస్తవ రూపం దాల్చని దురవస్థలో- తలరాతలు తిరగబడకముందే పార్టీలన్నీ ప్రజాపంథాలో కొత్త అజెండా ప్రకటించాలి. దేశ జనాభాలో 35ఏళ్లలోపు యువజనం సుమారు ముప్పాతిక శాతానికి చేరిన నేపథ్యంలో వారి ఆలోచనలకు అనుగుణంగా రాజకీయ సంస్కృతిని సమీక్షించుకొని, పునరుజ్జీవం పొందాల్సిన అవసరం పార్టీలపై ఉంది.



సమధిక వాటా

'దేశాన్ని యువజనులు గుణాత్మకంగా తీర్చిదిద్దనున్నారు. జిల్లా స్థాయుల్లోనే నమూనా పార్లమెంటు సమావేశాలు నిర్వహించి పాలన విధానాలపై విస్తృతంగా చర్చించాలి. అభివృద్ధిని ఓ ఉద్యమంగా ముందుకు తీసుకువెళ్ళాలి. ఈ క్రమంలో యువత కీలక పాత్ర పోషించాలి. కొత్త ఓటర్లుగా జనవరి 1నుంచి నమోదవుతున్నవారికి స్వాగతం పలుకుతున్నాను' 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నిన్నటి రోజున వినిపించిన సందేశమది. పద్దెనిమిదేళ్లు నిండిన యువత ప్రతి నెల సగటున పది లక్షల మంది దేశ జనాభాకు జమపడుతున్నారు. 2000 జనవరి 1న జన్మించిన దాదాపు 74వేలమంది ఇవాళ్టితో పద్దెనిమిదేళ్లు పూర్తి చేసుకొని సహస్రాబ్ది ఓటర్లుగా జాతి నిర్మాణ క్రతువులో క్రియాశీల భాగస్వాములవుతున్నారు. దేశంలో 18-35 ఏళ్లలోపు ఓటర్లు 65శాతానికిపైబడి ఉన్న నేపథ్యంలో కొత్త తరం ఓట్లను గుండుగుత్తగా ఒడిసిపట్టేందుకు తహతహలాడుతున్న రాజకీయ పార్టీలేవీ వారికి నిజమైన కట్టుబాటు చాటే యువజన విధానాన్ని అమలు చేయలేకపోయాయి. స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు ఆరున్నర శాతానికి అటుఇటుగా కొనసాగుతూ ఆర్థిక వ్యవస్థ తేరుకుంటోందన్న సూచనలు అందిస్తున్నా- నిరుద్యోగం మాత్రం దేశం నెత్తిన ఎత్తిన కత్తిలా వేలాడుతూనే ఉంది. దేశంలో 15-29 ఏళ్ల మధ్య వయస్కుల్లో 30శాతం మంది ఉద్యోగం, ఉపాధి శిక్షణ అందుబాటులో లేక కుంగుతున్న తీరు ఆందోళన పెంచుతోంది. మరో వంక దేశవ్యాప్తంగా మహిళలపై గంటకు 39 నేరాలు చోటుచేసుకుంటున్నాయి. గడచిన పదేళ్లలో మొత్తంగా స్త్రీలపై రెండున్నర లక్షలకుపైగా నేరాలు నమోదయ్యాయి. 2007నాటితో పోలిస్తే నారీమణులపై 2016లో నేరాల రేటు వెయ్యికి 41నుంచి 55కి పెరిగింది. నేరాలకు పాల్పడిన వారిపై శిక్షల రేటు గడచిన దశాబ్దకాలంలో కనీవినీ ఎరుగని విధంగా 18.9శాతానికి పడిపోవడం దేశంలో నేర నమోదు, విచారణ యంత్రాంగాల వైఫల్యాన్ని వెల్లడిస్తోంది. చదువుకు తగిన ఉపాధి లేక, ఉద్యోగాలకు అవసరమైన విద్య అందక ఒక వంక నిరుద్యోగం ఉరుముతోంది. మరోవంక మహిళలపై ప్రబలుతున్న హింసోన్మాదం దేశ యువత గౌరవప్రద జీవనాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తోంది. యువజనం భవిష్యత్తుపట్ల పార్టీల దృక్పథం నిర్మాణాత్మకంగా మారాల్సిన, ప్రభుత్వాల స్థాయిలో నిర్దిష్ట కార్యాచరణ పట్టాలకెక్కాల్సిన అవసరాన్ని వెల్లడిస్తున్న వాస్తవాలివి. మేనిఫెస్టోల్లో అలవికాని వాగ్దానాలు వండి వార్చే భ్రమల ప్రపంచంనుంచి- కాగడాపట్టి కఠిన వాస్తవాలు తెలుసుకొని, సమస్యల పరిష్కారంలో యువతను చేయీ చేయీ కలిపి నడిపించే క్రియాశీల రాజకీయాలే ఈ దేశానికి ఇప్పుడు ప్రాణావసరం.

రాజకీయాలు, ప్రజా ప్రయోజనాలకు జన్మవైరుధ్యం లేదని; అవి ఒకే నాణేనికి రెండు ముఖాలు అన్న విషయం అంతుపట్టని పార్టీలు దేశంలో ఇప్పటికీ నిండా విస్తరించి ఉన్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన పనులు చేయని పాపానికి- ఎన్నికల వేళ వివిధ పార్టీలు డబ్బు, మద్యం వెదజల్లుతూ చేయకూడని పనులన్నీ చేసేస్తున్నాయి. దశాబ్దాలుగా దేశంలో స్థిరపడిన ఈ పాత రాజకీయ నమూనాను బద్దలు కొట్టాలనే యువజనం నేడు పరితపిస్తోంది. చేతకానితనాన్ని సహించగలరేమోగాని- అబద్ధాన్ని ప్రజలు సహించరు. వివిధ సందర్భాల్లో ఇది నిరూపణ అయింది. చట్టసభల్లో తమ భవిష్యత్తును నిర్దేశించే చర్చల్లో తమకు భాగస్వామ్యం లేకపోవడాన్ని యువత జీర్ణించుకోలేకపోతోంది. సచివాలయాలకే పరిమితమవుతున్న పాలకపక్షాలను వారు ఏవగించుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు తమ ప్రాపంచిక దృక్పథంలో అంతర్భాగం కావాలని కోరుకుంటున్నారు. పాలనాధికారంలో తమకు వాటా పెట్టే పార్టీలతో ఎక్కడిదాకా నడిచేందుకైనా యువత నేడు సంసిద్ధంగా ఉంది. ఏమాత్రం రాజకీయ అనుభవం లేని బీఎస్ఎఫ్ మాజీ కమెండోలను, జర్నలిస్టులను, బ్యాంకు ఉద్యోగులను, టీచర్లను, చిన్న వ్యాపారులను కేవలం వారి గుణగణాల ప్రాతిపదికన ఎంపిక చేసి అభ్యర్థులుగా నిలపడం ద్వారా గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ దిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కోటలను కుప్పకూల్చిన వైనం పార్టీలన్నింటికీ గుణపాఠం కావాలి. సగటు భారతీయుడి వయసు 29ఏళ్లు కాగా- లోక్‌సభ ఎంపీల సగటు వయసు 56ఏళ్లుగా ఉండటమే దేశంలో రాజకీయాలకూ యువజనానికీ మధ్య విస్తరిస్తున్న అగాధానికి దాఖలా! మొత్తం 543 లోక్‌సభ ఎంపీల్లో కేవలం 12మంది మాత్రమే 30ఏళ్ల లోపు వారు కావడం (2.2శాతం), వారు సైతం రాజకీయ కుటుంబాలకు చెందినవారే కావడం- యువతకు వాటా విషయంలో రాజకీయ పక్షాల తిరోగమన వైఖరినే వెల్లడిస్తోంది. ప్రజల సామూహిక చైతన్యమే పార్టీల తలరాతలను నిర్దేశిస్తుందన్నది తిరుగులేని నిజం. 2009లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నవారి సంఖ్య 10 కోట్లు కాగా; 2014నాటికి ఆ సంఖ్య 15కోట్లకు పెరిగింది, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈ సంఖ్య 21 కోట్లకు చేరవచ్చన్న స్పష్టమైన అంచనాల నేపథ్యంలో ఓటునే పాశుపతంలా మార్చి యువశక్తి నీతి తప్పిన నేతల భరతం పట్టేందుకు సిద్ధంగా ఉందనడంలో సందేహం లేదు. యువతను నిర్ణాయక శక్తిగా గుర్తించి, వారి భాగస్వామ్యంతో ముందడుగు వేసే రాజకీయాల దిశగా పార్టీలన్నీ తమ మౌలిక స్వభావాన్ని పునర్నిర్వచించుకోవడం నేటి చారిత్రక అవసరం!



పార్టీల తీరు మారాలి

'యువజనానికి అన్నివేళలా బంగారు భవిష్యత్తును మనం నిర్మించలేకపోవచ్చు; కానీ భవిష్యత్ లక్ష్యాలకు దీటుగా యువతరాన్ని మనం సిద్ధం చెయ్యగలం' అని అమెరికా అధ్యక్షుడిగా ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ఆ తరహా దార్శనికత కలికానికి కూడా కనిపించని నేతల కారణంగానే దేశంలో నిరుద్యోగం, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. ఆకలి, పౌష్టికాహార లోపాలు అంతర్జాతీయ సగటును మించి విస్తరించాయి. దేశంలో పట్టాలు అందుకున్నవారిలో ముప్పాతిక శాతానికి ఉద్యోగ నైపుణ్యాలు లేవు. డాక్టర్లుగా చలామణీ అవుతున్నవారిలో సగానికిపైగా సరైన విద్యార్హతలు లేకుండానే వైద్యం అందిస్తున్నారు. పల్లెజనం కనీసంగా అయిదు కిలోమీటర్లు నడిస్తే తప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను చేరుకోలేని దుస్థితి నెలకొంది. జాతి పురోభివృద్ధి బాటలో యువజనానికి నాణ్యమైన ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రభుత్వాల వైఫల్యాన్నే ఈ వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. జనాభాలో యాభైశాతానికిమించి పాతికేళ్లలోపు వారున్న మన దేశంలో చోటుచేసుకుంటున్న ఆత్మహత్యల్లో- సగానికిపైగా 30ఏళ్ల లోపువారివే అంటే అర్థమేమిటి? 35కోట్లకుపైగా నిరక్షరాస్యులు, ఇంచుమించు అంతే సంఖ్యలో పేదలు పోగుబడి ఉన్నచోట- ఆకలి, అనారోగ్యం, స్త్రీ పురుష నిష్పత్తిలో క్షీణత వంటివి ఒక దేశంగా భారత్‌కు తలవంపులు తెస్తున్నాయి. యువతకు మేలిమి భాగస్వామ్యం కట్టబెట్టి, లోపరహిత వ్యవస్థలను ఆవిష్కరించుకొని హాంకాంగ్, సింగపూర్, అమెరికా, ఐరోపాలు ఆకలి, అవినీతి, అనారోగ్యాలపై విజయం సాధించాయి. 2009 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నేరచరితుల్లో 74శాతం తిరిగి 2014లో గెలుపొందడం- ఎలెక్షన్లలో నేరచరితులనే పార్టీలు గెలుపు గుర్రాలుగా పరిగణిస్తున్నాయన్న వాస్తవాన్ని వెల్లడిస్తోంది. నేరచరితుల కట్టడి, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేయడం, పార్టీల ఆర్థిక లావాదేవీలను సమాచార హక్కు పరిధిలోకి తీసుకురావడం వంటి అంతర్గత సంస్కరణలకు సంసిద్ధత వ్యక్తం చేయడమే రాజకీయ పక్షాల చిత్తశుద్ధికి గీటురాయి అవుతుంది. నేరగాళ్లు, అవినీతి కేటుగాళ్ల ముసుగుల్ని తొలగిస్తూ ఎన్నికల్లో వారి కోటలను బద్దలు కొట్టడం ద్వారానే యువజనం రాజకీయ పక్షాలను సమూల క్షాళన దిశగా నడిపించాలి. ప్రపంచీకరణ యుగంలో ఇప్పటికీ కులం కళ్లద్దాలతోనో, మతం కొలమానాలతోనో యువత అవసరాలను తీర్మానించే పార్టీలకు ఎన్నికల వేదికలమీదే యువత దిమ్మతిరిగే గుణపాఠం నేర్పాలి. నిర్దిష్ట ప్రాతిపదికలపై పంచాయతీ స్థాయినుంచే పరిణత నేతలను ఎంపిక చేసుకోగల చైతన్యాన్ని యువజనం కనబరచాలి. యువత ధర్మాగ్రహం పార్టీల పుట్టి ముంచకముందే రాజకీయ పక్షాల్లో ప్రాప్తకాలజ్ఞత పొడచూపాలి. పావన నవజీవన బృందావన నిర్మాతలుగా యువతరం వినిపిస్తున్న సందేశాన్ని దేశంలోని రాజకీయ పక్షాలు గ్రహించి కొత్త చరిత్రకు తెరచాపలెత్తాలి!

- ఉల్చాల హరిప్రసాదరెడ్డి

మహిళా సాధికారతే లక్ష్యంగా...

'మహిళే ప్రథమం. మహిళా సాధికారతే ముఖ్యం'- ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు నినాదమిది. సదస్సులో పాల్గొన్నవారిలో సగం- మహిళా పారిశ్రామికవేత్తలే. వారిలో మనదేశ వనితలు 15 శాతమే. సంప్రదాయాల పేరిట ఆంక్షలు భారతీయ మహిళల వికాసాన్ని నిరోధిస్తున్నాయని తాజా అంతర్జాతీయ సర్వేలో తేలింది. వారు ఉన్నత చదువులకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగానే ఉంటున్నారని వెల్లడైంది. దేశంలోని వ్యాపార యాజమాన్యాల్లో మహిళల వాటా చాలా తక్కువగా ఉండటం ఆశాజనక పరిణామం కాదు!

సురక్షిత నగరాలు

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల (ఎండీజీ) సాధనలో గణనీయ పురోగతి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ, బాల బాలికలందరూ 2015 నాటికల్లా పూర్తిస్థాయిలో ప్రాథమిక విద్య తరగతుల్లో చేరిపోవాలనే లక్ష్యం నేటికీ సాకారం కాలేదు. పాఠశాల విద్యలో లైంగిక సమానత్వం, మహిళా సాధికారతను సాధించినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమం అమలు మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. బాలికలకు అన్ని రకాల విద్యావకాశాలు లభించడమే దేశ ప్రగతికి నిదర్శనమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇటీవల విశాఖ-ఆంధ్రా విశ్వవిద్యాలయాలను సందర్శించినప్పుడు వ్యాఖ్యానించారు. శాస్త్ర సాంకేతిక విద్యాసంస్థల్లో నేటికీ యువతుల సంఖ్య తక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తపరచారు. పేదరికం, విద్య, ఆరోగ్యం, భద్రత అంశాల్లో బాలికలు, మహిళలు విచక్షణ ఎదుర్కొంటున్నారని అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'ప్లాన్ ఇండియా' నిర్వహించిన విస్తృత అధ్యయనంలో తేటతెల్లమైంది. 'ప్రతి బిడ్డకూ ఓ ప్రణాళిక... ఏ బాలికనూ విస్మరించకండి' పేరిట దిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ అధ్యయన నివేదికను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ విడుదల చేశారు. మహిళాభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న పౌరసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, ప్రభుత్వ ప్రతినిధులు, ఐక్యరాజ్య సమితి, ఇతర పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, నిపుణులు, విద్యావేత్తలు, సదస్సులో పాల్గొని కీలకాంశాలపై చర్చించారు. మరోవైపు, దేశంలోని ఎనిమిది మెట్రో నగరాల్లో 'సేఫ్ సిటీ' పేరిట త్వరలోనే ఓ సమగ్ర పథకం అమలుచేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. హైదరాబాద్, దిల్లీ, ముంబయి, బెంగళూరు, కోల్‌కత, చెన్నై, లఖ్‌నవూ, అహ్మదాబాద్‌లలో 'సురక్షిత నగరం' పథకాన్ని అమలు చేస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఆగమేఘాల మీద స్పందించే వ్యవస్థ, పోలీసు తనిఖీలున్న ప్రజారవాణా వ్యవస్థలు ఆయా నగరాల్లో అందుబాటులోకి వస్తాయి. పెళ్లి పేరిట మహిళలు మోసపోకుండా ఉండేందుకు వివాహాల నమోదు తప్పనిసరి చేయించాలని కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ భావిస్తోంది. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సమావేశంలో దీనిపై చర్చించారు. భార్యలకు తెలియకుండా భర్తలు చేసుకుంటున్న రెండో వివాహాలను ఈ నమోదు వ్యవస్థ ద్వారా అడ్డుకోవచ్చని అందులో అభిప్రాయపడింది. నమోదు బాధ్యతను నగర పాలికలు, గ్రామ పంచాయతీలకు అప్పగించినా, ఆచరణలో అది సక్రమంగా అమలు కావడంతో మహిళా కమిషన్ గుర్తించింది. ఇటీవల విడాకుల కేసులు ఎక్కువ కావడంలో వివాహ నమోదును తప్పనిసరి చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాయాలనీ నిర్ణయించింది.

జాతీయ నేరగణాంక నివేదిక ప్రకారం, మహిళల అక్రమ రవాణా అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2016లో దేశవ్యాప్తంగా 4,941 మంది మహిళలను వ్యభిచారం కోసం అక్రమ రవాణా చేశారు. వారిలో 14.89 శాతం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



ముందుకు సాగాల్సిన సమయం

ఈ నేరాల నియంత్రణపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం, ముఠాల కార్యకలాపాలపై నియంత్రణ లేకపోవడంతో దీనిబారిన పడుతున్నవారి సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది.

జాతీయ నేరగణాంక సంస్థ నివేదిక ప్రకారం- 2016లో మహిళల ఆత్మగౌరవాన్ని కించపరచే ఘటనల్లో ఆంధ్రప్రదేశ్‌ది మొదటిస్థానం కావడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో ఈ తరహా నేరాలు మొత్తం 1,831 చోటు చేసుకున్నాయి. ఏపీ తరవాత 1,003 ఘటనలతో తెలంగాణ రెండోస్థానంలో ఉంది. చిన్నారులపై లైంగిక వేధింపులు పెరుగుతున్న పరిస్థితుల్లో రక్షణ చర్యలపై తెలంగాణ మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. తెలంగాణలోని అన్ని పాఠశాల బస్సుల్లో మహిళలనే సహాయక సిబ్బందిగా నియమించాలన్న నిబంధనలు రూపొందించింది. పాఠశాల విద్య, రవాణాశాఖ, పోలీసు విభాగాల్లో సమన్వయం చేసుకుంటూ నోటీసులు జారీచేయడంతోపాటు, అన్ని పాఠశాలల యాజమాన్యాలకు లేఖలు రాయాలని నిర్ణయించింది.

మహిళలపై లైంగిక హింసకు పాల్పడితే ఒకే చట్టం కింద శిక్షపడేలా, ఐపీసీలోని పలు సెక్షన్లను సవరించాలని జస్టిస్ వర్మ కమిటీ గతంలోనే ప్రతిపాదించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 140 దేశాలు గృహహింస నిరోధక చట్టాలు చేశాయి. లైంగిక వేధింపులను తీవ్ర నేరాలుగా పేర్కొంటూ 144 దేశాలు చట్టాలు రూపొందించాయి. కేంద్ర ప్రభుత్వం మహిళా పోలీసు వాలంటీర్లను, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు 'షీ టీమ్స్' వంటి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేశాయి. ప్రపంచవ్యాప్తంగా లైంగిక హింస ఎదుర్కొంటున్న మహిళలు 35 శాతం ఉన్నారని ఐక్యరాజ్య సమితి నివేదిక స్పష్టీకరించింది. మనదేశంలో 79 శాతం మహిళలు బాధితులేనని తేల్చింది. ప్రతి 26 నిమిషాలకో మహిళపై అసభ్య ప్రవర్తన, 34 నిమిషాలకో అత్యాచారం, 42 నిమిషాలకో లైంగిక వేధింపు, 43 నిమిషాలకో అపహరణ, 93 నిమిషాలకో వరకట్న ఆహుతి సాగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి పది అత్యాచారాల్లో ఆరు బాలికలపైనే జరుగుతున్నాయని తేలడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

మరిన్ని అవకాశాలు

దేశవ్యాప్తంగా 200 జిల్లాల్లో సుమారు కోటిమంది కిశోర బాలికలకు అదనపు పోషకాహారాన్ని అందించేలా 2011లో 'సబల' కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమలులోకి తెచ్చారు. తాజాగా కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని జాతీయ పోషకాహార మిషన్ పరిధిలోకి తెచ్చింది. ఫలితంగా 15-18 వయసు బాలికలు పోషకాహారంతో పాటు వైద్యపరమైన అవగాహనకూ దూరం కానున్నారు. బడి బయట ఉండే బాలికలకే అదనపు పోషకాహారం అందించాలనే కొత్త నిబంధన కారణంగా రేషన్ సదుపాయమూ నిలిచిపోతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, పర్యావరణ కాలుష్య సంబంధ ఆరోగ్య సమస్యలు మహిళలు, చిన్నపిల్లల్ని కుంగదీస్తున్నాయి. మహిళలు శ్వాసకోశ సంబంధ సమస్య, గుండెపోటు, క్యాన్సర్, హృద్రోగ సమస్యలతో మరణిస్తున్నారని తేల్చింది. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ పారిశ్రామికవేత్తల శిఖరాగ్ర సదస్సు కొత్త స్ఫూర్తినింపింది. మహిళా సాధికారత, అభివృద్ధి, భద్రత, రక్షణ, ఉపాధి, ప్రోత్సాహం వంటి అంశాలపై చర్చించడం ఆశాజనకంగా ఉంది. నూతన ఆవిష్కరణల్లో మహిళల వాటా పెంచేందుకు ఆర్థిక, సామాజిక ప్రోత్సాహానికి కార్యాచరణ రూపొందించి అమలుచేయాలి. అంతర్జాతీయ వాణిజ్యాన్ని మహిళలు నడుపుతున్న వ్యాపారాలతో అనుసంధానించాలి. అంకుర సంస్థల్లో ఉపాధి అవకాశాలు, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం వంటి రంగాల్లో మహిళలు మరింత ప్రగతి సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. 'మహిళల సారథ్యంలోనే అందరికీ సౌభాగ్యం' అని నిరూపించే అవకాశం కల్పించాలి. ఆర్థికవృద్ధిలో మహిళల పాత్ర గణనీయంగా ఉన్న వాస్తవాన్ని గుర్తించి ప్రోత్సహించాలి. పట్టణ ప్రాంతాల వారితోపాటు గ్రామీణ మహిళల్నీ భాగస్వాముల్ని చేస్తేనే సాధికారతకు సంపూర్ణత లభిస్తుంది.

- నల్లాని రాజేశ్వరి

సద్భావనే శుభాకాంక్ష

కాలగణనలో అనేక పద్ధతులున్నాయి. అవి ఎన్ని ఉన్నా, ప్రధానంగా లెక్కించదగినవి రెండు. ఒకటి- వ్యవహారం, మరొకటి- సంప్రదాయం. దేశ సంప్రదాయ పద్ధతుల్లో సౌరమాన, చాంద్రమాన, బార్హస్పత్యం అనేవి మూడు కాలమానాలు. వాటి ప్రకారమే ఏడాదులు, వాటన్నింటి ప్రారంభ రోజులు, విభిన్న పర్వదినాలను గణించుకుంటాం. ప్రస్తుత కాలంలో ప్రపంచమంతా స్వీకరించిన 'జనవరి-డిసెంబరు' కాలగణనను 'వ్యవహార సంవత్సరం' అని చెప్పవచ్చు.

సంప్రదాయ వత్సరాదులు ఈ దేశ సంస్కృతికి చెందినవి. కాలమానం అనుసరించి, సంవత్సరారంభాన్ని మహోత్సాహంతో పాటిస్తారు. వీటిని వీడకుండానే వ్యవహార సంవత్సరం మొదటిరోజున శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీ అయింది. ఇదే ధోరణిలో అర్ధరాత్రి కేలండర్ మారగానే- కేరింతలు, సందడులు, హడావుడి అనివార్యాలయ్యాయి. హద్దు మీరనంతవరకు వీటిని కాదనలేం. నిత్యవ్యవహారంలో 'ఉపయోగించుకొనే కేలండర్‌కి తొలినాడు' ఈ ఏడాది బాగుండాలి అని ఆకాంక్షించడం దోషమేమీ కాదు. ఉత్సాహంగా ఉండటానికి, మంచిని కోరుకోవడానికి ఇదొక అవకాశంగా భావించడం సముచితమే.

ఏ లెక్కన చూసినా- రాబోయే కాలం అనుకూలంగా ఉండాలని ఆశించడం సహజం. భాష ఏదైనా, దేశమేదైనా మానవుడి స్వాభావిక లక్షణమిది. అందుకే ప్రపంచంలో అన్ని దేశాలవారు, అన్ని భాషలవారు వారి పరంపరను అనుసరించి సంవత్సరంలో ఆది దినాన్ని ప్రధానంగా భావిస్తారు. ఈ రోజు మంచిని భావిస్తే ఏడాది పొడుగునా ఇదే ప్రసరిస్తుందని విశ్వసిస్తారు. ఒక చక్కని పరిణామాన్ని ఆశించడమే 'ఆశీస్సు'. అది సమానుల నడుమ పంచుకుంటే 'శుభాకాంక్ష'. పెద్దల ద్వారా లభిస్తే 'దీవెన'. భగవంతుడి నుంచి పొందితే 'వరం'. సత్సంకల్పంతో, సహృదయంతో పలికే శుభాకాంక్షల్ని, దీవెనల్ని కాల స్వరూపుడైన భగవంతుడు తన వరాలుగా కురిపించాలని ఆశిద్దాం.

'ఏడాదిలో జరిగే మార్పులన్నీ మనకు హితం కలిగించాలి' అనే భావంతో కూడిన మంత్రాలు వేదవాఙ్మయంలో లభిస్తాయి.

'మేఘాలు సకాలంలో వర్షించుగాక- భూమి సస్యశ్యామలంగా, ఈ దేశమంతా క్షోభ లేకుండా ఉండు గాక/ మనమంతా ద్వేషం లేకుండా ఉందాం- పరస్పరం సౌమనస్యంతో జీవిద్దాం/ అందరూ సుఖంగా ఉండాలి, ఆరోగ్యంగా ఉండాలి, అందరూ శుభాలనే అనుభవిస్తుండాలి, ఏ ఒక్కరూ దుఃఖితులు కారాదు'- ఈ భావాలు సనాతన ధర్మాలలోని వేదాలు, పురాణాలు యుగాల క్రితమే పలికిన శుభాకాంక్షలు, దివ్యాశీస్సులు. రుషులు వీటిని మంత్రభాషలో పలికారు. అదే భాషలో అందరూ స్వీకరించినప్పుడు- అవి కేవలం ఆకాంక్షలుగా కాక, అమోఘమైన దేవభావనలుగా అనుభూతినిస్తాయి.



అంతర్యామి

ధర్మానికి జయం కలుగు గాక , అధర్మం నశించు గాక, ప్రాణులలో సద్భావన నెలకొను గాక- అనే భావాలు మన సంప్రదాయ శుభ కామనలలో కనిపిస్తాయి. కేవలం మానవుల మధ్యనే కాక- ప్రకృతిలో సర్వజీవులలో సద్భావన స్థిరపడాలి, వృద్ధిచెందాలి... అనే విస్తారమైన విశ్వహిత కాంక్ష మన రుషుల వాక్యాల్లో స్పష్టంగా ప్రకాశిస్తోంది. భూమి, అంతరిక్షం, దిక్కులు, ఓషధులు, వాయువు, జలం ...అన్నీ శాంతంగా ఉండాలన్న వేదకాంక్ష ఉత్పాతాలు లేని, ప్రకోపాలు లేని ప్రకృతి శాంతిని సంభావిస్తోంది.

ఆదర్శ మానవుణ్ని చిత్రిస్తూ- ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సర్వభూత హితకాంక్షి, కృపాళువు, క్షమాస్వరూపుడు అనే వర్ణనను వాల్మీకి మహర్షి ఆవిష్కరించాడు. సకల లోక హితాన్ని, సర్వప్రాణి క్షేమాన్ని కోరుకొనేవాడు, వాటి కోసం ప్రయత్నించేవాడు పరిపూర్ణుడు. అటువంటి పరిపూర్ణత మానవుడికి ఆదర్శం కావాలన్నదే భారతీయ ఆర్షభావన. ఆ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని శ్రీరామ చంద్రమూర్తిగా ప్రత్యక్షం చేశాడు మహర్షి. మానవులు ఒకరి హితం కోసం ఒకరు ఉండాలి, ప్రకృతి క్షేమం కోరి వ్యవహరించాలి- అనే శుభాశయాన్ని నిరంతరం కొనసాగిద్దాం!

- సామవేదం షణ్ముఖశర్మ

వేడుకల వేళ... విచిత్రాల మేళా



నూతన సంవత్సరంలో అడుగు పెట్టాం... ఏడాదంతా హాయిగా సాగిపోవాలంటూ... అంతా మనమంతా కోరుకుంటాం... ఈరోజంతా సంతోషంగా గడుపుతూ వేడుకలు చేసుకుంటాం... ప్రపంచవ్యాప్తంగా ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా... చిత్రమైన సంప్రదాయాలతో చేసుకుంటారీ పండగని... ఎక్కడెక్కడ ఎలా ఉంటుందో తెలుసుకుందామా!

ఎస్తోనియా: కొత్త సంవత్సరం మొదటి రోజు ఏడు సార్లు భోజనం చేస్తారు. ఏడాదంతా సమృద్ధిగా ఆహారం దొరుకుతుందనే నమ్మకంతో.

టర్కీ: అందరూ కలిసి డబ్బులు సేకరించి పేద వారికి పంచిపెడుతుంటారు. ఇందుకు బోలెడు కార్యక్రమాలూ ఏర్పాటు చేస్తారు. సాయం పొందిన వారిచ్చే దీవెనలతో అంతా మంచే జరుగుతుందనుకుంటారు.

కొలంబియా: రోజంతా సూట్‌కేసులు పట్టుకుని తిరుగుతారు. ఎందుకంటే ఏడాదంతా తమ ప్రయాణాలు సజావుగా సాగాలని.

ఫిలిప్పీన్స్: గుండ్రని ఆకారాన్ని సంపదకు సూచికగా భావిస్తారు. అందుకే ఈరోజు గుండ్రంగా ఉన్న రకరకాల పండ్లని డైనింగ్ టేబుల్ దగ్గర ప్రత్యేకంగా ఉంచుతారు. సర్కిల్స్ డిజైన్లతో ఉన్న దుస్తుల్ని ధరిస్తారు.

స్కాట్లాండ్: రోజు మొదలవ్వగానే ఎవరు ముందు ఇంటిమీదుగా వెళితే వాళ్లు తప్పకుండా ఓ బహుమతి తీసుకొచ్చి ఇవ్వాలట.

రొమేనియా: నదుల్లో చిల్లర నాణేలు వేస్తారు. వ్యవసాయదారులు ఏడాదంతా చక్కగా గడిచిపోవాలని తమ ఆవులతో సరదాగా గడుపుతారు.







స్విట్జర్లాండ్: నేలపై ఐస్‌క్రీంను వేస్తూ వేడుక చేసుకుంటారు.

థాయిలాండ్: హోలి పండగకు రంగులు చల్లుకున్నట్టు ఇక్కడ బకెట్ల కొద్దీ నీటిని చిమ్ముకుంటారు.

చిలీ: శ్మశానం దగ్గరకు వెళ్లి చనిపోయిన తమ కుటుంబ సభ్యుల సమక్షంలో కొత్త ఏడాదిని ఆహ్వానిస్తారు.

బొలీవియా: నాణెం పెట్టి కేకులు, మిఠాయిలు తయారుచేస్తారు. వాటిని తింటున్నప్పుడు ఎవరికి ఆ నాణెం వస్తే వాళ్లకి ఆ ఏడాదంతా కలిసి వస్తుందని భావిస్తారు.

ఈక్వెడార్: దిష్టిబొమ్మల్ని తయారుచేసి తగలబెడతారు. ఇలా చేస్తే... కీడంతా తొలిగిపోతుందని నమ్ముతారు.

దక్షిణాఫ్రికా: తమ కిటికీల నుంచి పాత సామగ్రిని పడేస్తుంటారు.

ఐర్లాండ్: గోడలపై బ్రెడ్డు ముక్కలు విసురుతారు. ఇలా చేస్తే దుష్టశక్తులు పోతాయని నమ్మకం.

బ్రెజిల్: దుష్టశక్తులకు భయపడిపోకుండా తెల్లదుస్తులు వేసుకుంటారు.

– జి.నవనీత

వారెవ్వా!

కరీంనగర్, సోమవారం జనవరి 1, 2018

5

varevva@eenadu.in

ఈనాడు

పత్తి మందుల గత్తరు వాసన తప్ప చేలు పండిందీ లేదు.. వేలు వచ్చిందీ లేదు. అప్పుల కిస్తీలు కుత్తుకలు పిసుకుతుంటే.. తట్టుకోలేక ఎడారి దేశాలకు వెళ్లిపోయాడు కాశబోయిన కనకయ్య. అయిన వారికి దూరంగా ఆరేళ్లు పడిన కష్టం పొట్టకూటికే సరిపోయింది. పుట్టెడు దుఃఖంతో పురిటిగడ్డ చేరుకున్నాడు. కానీ, ఇప్పుడు కనకయ్య సంతోషంగా ఉన్నాడు. సొంత ఊళ్లో హాయిగా ఉన్నాడు.

కనకయ్యకు అల్లాద్దీన్ అద్భుత దీపమేమీ దొరకలేదు. భాగ్యలక్ష్మి బంపర్ డ్రా తగల్లేదు. కనకయ్య ఒక్కడే కాదు.. ఆయనలా కష్టాలు పడ్డ మల్లయ్య, లక్ష్మవ్వ, ఆనందం ఇలా 140 మంది రైతులు ఆనందంగా ఉన్నారు. ఇంతకీ వారు ఏం చేశారు.. ఏం సాధించారు..



మాది గుమ్లాపూర్. మాకున్న మూడెకరాల్లో ఎప్పుడూ పత్తి, వరి వేసేవాళ్లం ఒకే రకమైన పంటతో దిగుబడి తగ్గింది. గిట్టుబాటు ధర లేక అప్పులయ్యాయి. సమీకృత సాగు గురించి అధికారులు వివరంగా చెప్పారు. పత్తిలో అంతర పంటగా కంది వేశాం. పత్తి పెద్దగా రాలేదు.. కానీ కంది పది క్వింటాళ్లు వచ్చేలా ఉంది. రెండు బర్రెలు కొన్నాం. పాలు లీటర్ రూ.70 పలుకుతుండడంతో రోజూ రూ.700 వస్తయ్. వంకాయలు అమ్మడం ద్వారా ఇంకో రూ.300 వస్తున్నయ్. కోళ్ల ద్వారా కూడా ఆదాయం వస్తోంది. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.15 వేలు మిగులుతున్నాయ్. అప్పుల బాధ కూడా తగ్గింది.

- మండల లక్ష్మి, రాములు

రాములు మారిండు.. కనకయ్య నవ్విండు.. ఆనందం అంటుండు

పంట పండిందన్నా!

ఇది సమీకృత విజయం

వేన్నీళ్లకు చన్నీళ్లు కలిస్తేనే హాయి. అసలుపై కొసరు ఇస్తేనే సంతృప్తి. ఈ సూత్రాన్నే సాగుబడిలో దిగుబడి మంత్రంగా ఎంచుకున్నారు కొందరు రైతులు. గుమ్లాపూర్, మల్లన్నపల్లి, చొప్పదండి, రుక్మాపూర్.. కరీంనగర్ జిల్లాలోని గ్రామాలివి. ఒకప్పుడు ఈ గ్రామల్లోని రైతులుకు పంటలు పండించడం ఒకటే తెలుసు. పత్తి వేశారు.. పంటను పురుగు తొలిస్తే.. విలవిల్లాడిపోయారు. మిర్చి వేశారు.. కాయ రాకపోతే కాయకష్టం చేసుకునే కూలీల్లా మారారు. అప్పులు చేశారు.. తీర్చలేక బావురుమన్నారు. పంట నష్టాలు.. కౌలు భారం.. అప్పుల తిప్పలు.. కొందరు ఊళ్లు వదిలిపెట్టి వలస వెళ్లారు. ఇంకొందరు పొట్టచేతపట్టుకొని ఎడారి దేశాల బాట పట్టారు. అక్కడికి పోయినా వీరి రాత మారలేదు. చేతిలో చిల్లి గవ్వా మిగల్లేదు. రుణ భారం తగ్గనూ లేదు. అప్పుల ఊబి నుంచి బయటపడాలనే వారి ఆరాటానికి సమీకృత వ్యవసాయం రూపంలో సరైన మార్గదర్శనం దొరికింది. ఒక్కొక్కరుగా.. అందరూ ఇప్పుడు లాభాల బాట పట్టారు.

పత్తి పోతేనేం.. కంది ఉందిగా..

సమీకృత వ్యవసాయం ఇప్పటిది కాదు. తాతల కాలంలోనే రైతులంతా ఈ పద్ధతినే అనుసరించేవారు. నాడు పొలాల్లో అన్ని రకాల పంటలు సాగు చేసేవారు. పొలం గట్ల మీద వేసిన కూరగాయలు అవసరానికి ఆసరాగా నిలిచేవి. ఇంట్లో ఉన్న పాడి చేతి ఖర్చులకు చిల్లర అందించేది. ఇప్పుడు అదే పద్ధతి నాలుగు గ్రామాల రైతుల జీవితాలను మార్చేసింది. ఎకరా, రెండెకరాల భూములున్న రైతులు సైతం బహుళ సాగుతో బాగుపడ్డారు. పత్తి అంతర పంటగా కంది వేశారు. పత్తి ధర పడిపోయినప్పుడు.. కంది ఆదుకుంది. పొలంలోని కొద్ది భాగంలో వంగ, టమోట, బెండ వంటి కూరగాయలు, ఆకుకూరలు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పూల మొక్కలు పెట్టారు. పోయినచోటే వెతుక్కున్నారు. పాడి పశువులు, గొర్రెల పెంపకంతో ఆదాయ వనరులు పెంచుకుంటున్నారు.

ఉద్యోగం వదిలి..

పీజీ చేశాను. వ్యవసాయం దండగ అనుకొని ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పదేళ్లు పని చేశాను. నెలాఖరుకు జీతం మిగిలితే ఒట్టు. మళ్లీ భూమినే నమ్ముకున్నా. ఉద్యోగం వదిలిపెట్టి.. పొలం బాట పట్టాను. సమీకృత సాగులో భాగంగా మూడు ఆవులు కొన్నాను. నాలుగెకరాల్లో రకరకాల పంటలు వేశాను. పాలు, కోడి గుడ్లు, కూరగాయల విక్రయంతో మంచి ఆదాయం వస్తోంది. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.18 వేలు మిగులుతున్నాయి.

– పడిశెట్టి ఆనందం

లాభాల పంట

నాలుగు గ్రామాల పరిధిలోని 140 మంది రైతులు బహుళసాగుతో మంచి ఫలితాలు పొందుతున్నారు. దోమకాటుతో వరి దిగుబడి తగ్గినా దిగాలు పడలేదు. పత్తి ధర తేలిపోయినా.. వారి ముఖాలు పాలిపోలేదు. పాలు, కూరగాయలు అమ్మడం ద్వారా వచ్చే ఆదాయం రైతులను అప్పులపాలు కాకుండా చేసింది. ఒక్కోరైతు పాల ద్వారా నెలకు రూ.15 వేలకుపైగా ఆదాయాన్ని పొందుతున్నారు. కూరగాయలు అమ్మి రూ.10 వేల వరకూ సంపాదిస్తున్నారు. అన్ని ఖర్చులు పోనూ నెలకు నికరంగా రూ.15 వేలు కళ్లజూస్తున్నారు. అంతరపంటగా వేసిన కంది ఇప్పుడు వీరికి అదనపు ఆదాయం అందించనుంది. ఎకరాకు ఎంత లేదన్నా రూ.30 వేల వరకూ వచ్చే అవకాశం ఉంది.



సరైన మార్గదర్శి

మార్పు కోరుకుంటున్న అన్నదాతలకు సరైన మార్గదర్శిగా నిలిచింది జాతీయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్). 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా సమీకృత వ్యవసాయాన్ని (యూపీఎన్‌ఆర్‌ఎం-అంబ్రెల్లా ప్రోగ్రామ్ ఇన్ నాచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్) ఈ రైతులకు వర్తింపజేసింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు-చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి పశువులు, గొర్రెలు కొనుగోళ్లకు రూ.1.67 కోట్లను రుణాలుగా ఇప్పించింది. రూ.33 లక్షలు గ్రాంట్‌గా విడుదల చేసింది. వాటితో కూరగాయలు, పూల మొక్కల విత్తనాలు, ఒక్కో రైతుకు ఎనిమిది చొప్పున రాజశ్రీ కోళ్లను ఉచితంగా అందజేశారు. పశువులు/గొర్రెలకు వ్యాధులు సోకకుండా చూసుకోవడం... వాటికి సకాలంలో వేయాల్సిన టీకాలు.. అవసరమైన మందుల అందజేతకు గోపాలమిత్రలను నియమించింది. బహుళ సాగును ఎలా విజయవంతం చేసుకోవాలో జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ రైతులకు అవగాహన కల్పించింది. నాబార్డ్-పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులను చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు తీసుకెళ్లి సమీకృత సాగుతో అక్కడి రైతులు సాధిస్తున్న ఫలితాలను ప్రత్యక్షంగా చూపించారు. ఫలితం గతితప్పిన రైతుల బతుకులు ఒక స్థితికి చేరుకున్నాయి. ఆదాయం పెరిగింది. అప్పులూ తీరుస్తున్నారు.

–ధూళిపాళ్ల విజయ్‌కుమార్, ఈనాడు, కరీంనగర్



మనకో ఈఫిల్

యానాం... తెలుగు గడ్డతో అనుసంధానమై ఉన్న ఈ కేంద్రపాలిత ప్రాంతం ఒకప్పుడు ఫ్రెంచి ఆధీనంలో ఉండేది...

ఇప్పటికీ ఫ్రెంచ్ వాసనలు అక్కడక్కడా తగిలే ఈ ప్రదేశంలో పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను పోలిన యానాం ఒబిలిస్క్ టవర్ ప్రత్యేకంగా నిలుస్తోంది. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ నిర్మాణం గిరియాంపేట గ్రామంలో 18 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని ఎత్తు 100.6 మీటర్లు(333 అడుగులు). భూ ఉపరితలం నుంచి 52.3మీటర్ల ఎత్తు వరకు సిమెంట్ కాంక్రీట్ నిర్మాణం, ఆపైన స్ట్రక్చరల్ స్టీల్‌తో కట్టడం నిర్మించారు. వృత్తాకారం కట్టడంలో 21.6 మీటర్ల ఎత్తున రెస్టారెంట్, దానిపై అంతస్తులో 36.6మీటర్ల ఎత్తులో చుట్టూ ఉన్న ప్రదేశాలు, గోదావరి అందాలు వీక్షించేలా గ్యాలరీ నిర్మించారు. రిక్టర్ స్కేల్ మీద 8 మ్యాగ్నిట్యూడ్ భూకంపాలను తట్టుకొనే రీతిలో ఎన్‌సీసీ సంస్థ నిర్మించింది. 250 కి.మీల వేగంతో వచ్చే తుపాను గాలుల్ని కూడా ఇది తట్టుకుంటుంది. ఈ టవర్ పునాదులకే 700 టన్నుల ఇనుము, 50వేల బస్తాలు సిమెంటు వినియోగించారు. టవర్ చుట్టూ చక్కటి ఉద్యానవనాలు, ఫౌంటైన్ల అభివృద్ధికి రూ.22 కోట్లతో ప్రణాళికలు తయారు చేశారు.

– శివ శేషుబాబు, న్యూస్‌టుడే, యానాం

నిక్సన్ అండ్ కో వారి శకుంతల ఎక్స్‌ప్రెస్



నోరుతిరగని బుడ్డోడికి కూడా.. బుల్లెట్ ట్రైన్ అంటే ఏంటో తెలుసు! కానీ ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న 'శకుంతల ఎక్స్‌ప్రెస్'.. గురించి మాత్రం మనలో చాలామందికి తెలియదు! పేరేంటి విచిత్రంగా ఉందే అనుకుంటున్నారా? పేరే కాదు ఇంకా బోలెడు ప్రత్యేకతలున్నాయి ఈ రైలుకి....

గంటకు ఇరవై కిలోమీటర్ల వేగంతో పరుగులు పెడుతుంది.. ఛ ఆ వేగాన్ని పరుగు అని కూడా అంటారా? నడుస్తుంది అంటే బాగుంటుందేమో అంటారా. పోనీ అలాగే అనుకుందాం. ఎక్కడ ఆగమంటే అక్కడ ఆగుతుంది. వీటిన్నింటికీ మించి అది ప్రైవేట్ సంస్థ నడిపే ట్రైను. అదేంటి! రైళ్ల జాతీయకరణ ఎప్పుడో అపోయింది కదా అనే సందేహం మీకు రావొచ్చు. ఆ మాట నిజమే. కానీ పొరపాటున ప్రభుత్వం ఈ రైల్వే లైనుని మర్చిపోయిన ఫలితమే ఇన్ని ప్రత్యేకతలతో మనకి పాత బంగారం ఇలా మిగిలింది.

అలాని కేవలం యాంటిక్ ట్రైన్‌గా మాత్రమే మిగిలిపోయింది అనుకుంటే పొరపాటు. ఇప్పటికీ ఎంతోమంది పేదలని ఈ రైలు అతి తక్కువ టిక్కెట్ ప్రయాణంతో ఆదుకుంటోంది. ఇంతకీ ఈ శకుంతల ఎక్స్‌ప్రెస్ ఎక్కడ నడుస్తుందో మీకు చెప్పనేలేదు కదూ! ఈ రైలు మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని అచల్‌పూర్ నుంచి యావత్‌మల్ మధ్యలో నడుస్తుంది. ఈ రెంటిమధ్య 190 కిలోమీటర్లు. వేగంమాత్రం గంటకు 20 కిలోమీటర్లని మించదు. 1910 సంవత్సరం. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంలో ఉన్న కిల్లిక్ నిక్సన్, సీపీఆర్‌సీ అనే సంస్థలు సంయుక్తంగా ఈ రైల్వేలైన్‌ని నిర్మించాయి. విదర్భ నుంచి పత్తిని తీసుకురావడం ఈ రైలు లక్ష్యం. అలా



తీసుకొచ్చిన పత్తి ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్‌కు ఎగుమతి అయ్యేది. తర్వాత ప్రయాణికుల ప్రయోజనార్థం కోసం మారింది. మనకి స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా శకుంతల ఎక్స్‌ప్రెస్ నడిచే ఈ రైల్వే లైను ప్రైవేట్ సంస్థల చేతిలో ఉండిపోవడానికి కారణం.. ప్రభుత్వం దీనిని జాతీయకరణం చేయడం మరిచిపోవడమే అంటున్నారు అధికారులు. ఇప్పటికీ ఈ రైల్వేలైనుని బ్రిటిష్ సంస్థ కిల్లిక్‌నిక్సన్ నడిపిస్తోంది. 1921లో వాడిన స్టీమ్ ఇంజిన్‌నే 1994 వరకూ వాడారు. ఆ తర్వాత దానిని డీజిల్ ఇంజిన్‌గా మార్చారు. అంతకు ముందు వరకూ కూడా ప్రయాణికులు ఎక్కడ ఆపమంటే అక్కడ ఆపేవారు. ప్రస్తుతం ఆ సదుపాయం లేదనుకోండి. సెంట్రల్‌రైల్వే ఈ రైల్వే లైన్‌ని కాంట్రాక్ట్ తీసుకుంది. దానిని స్వతంత్రం వచ్చిన తర్వాత ఆరుసార్లు కాంట్రాక్ట్‌ని పొడిగించింది. అంతేకాదు సెంట్రల్ రైల్వే బ్రిటిష్ సంస్థకి ఇప్పటికీ కొంత రాయల్టీ రుసుముని కడుతోంది. మొన్నీమధ్య నిధులు రావడంతో ఇప్పటి వరకూ న్యారోగేజ్ నుంచి బ్రాడ్‌గేజ్‌కి మారడం విశేషం. ఇంతకీ ఈ రైలు ఎవరు ఎక్కుతారు తెలుసా? పేదలు. మామూలుగా ఈ రైలు ఎక్కువగా తిరిగే ముర్తుజాపూర్ నుంచి అచల్‌పూర్‌కి బోలెడు బస్సులున్నాయి. వాటి ధరతో పోలిస్తే ఈ రైలు ధర తక్కువ కావడంతో పేదలంతా ఈ రైలే ఎక్కడానికి ఇష్టపడతారట.

ఈనాడు సినిమా




2018 వచ్చేసింది!
ఎన్నో కలల్ని.. మరెన్నో ఆశల్ని రంగరించి
కొత్త ఉత్సాహాల రంగులు అద్ది
గమ్యాల గుమ్మాలకు ఆకాంక్షల తోరణాలు కట్టి
విజయాల హారతులు ఇవ్వడానికి..
చిద్విలాసాల ప్రయాణానికి శ్రీకారం చుట్టడానికి..
2018 వచ్చేసింది..
గతేడాది మాసిపోయిన క్యాలెండర్ కావొచ్చు.
కానీ దాటొచ్చిన రోజులన్నీ అనుభవాల గురుతులే.
చెరిగిపోయి, చెదిరిపోని చరిత్రే.
అదే స్ఫూర్తి... అదే దీప్తి!
తప్పుల్ని సరిదిద్దుకుంటూ, కొత్త పాఠాలు
నేర్చుకుంటూ, ఉల్లాసాల ఊయల
ఊగడానికి అంతా సిద్ధం.
మన తారలూ డైరీలోని తొలి పేజీని అందంగా
ముస్తాబు చేయడానికి, ఈ ఏడాది మరిన్ని
విజయాలు అందుకోవడానికి సై అంటున్నారు.
వాళ్ల కేలండర్ ఎలా ఉండబోతోంది?
ఈ ఏడాది లక్ష్యాలేంటి? చేస్తున్న
సినిమాలేంటి? అవన్నీ ఆరా తీస్తే...



సినిమా... రాజకీయం

కొత్త ఏడాది బాక్సాఫీసు హంగామా పవన్ కల్యాణ్ సినిమాతోనే మొదలుకాబోతోంది. జనవరి 10న 'అజ్ఞాతవాసి' వచ్చేస్తోంది. ఆ తరవాత పవన్ నటించే సినిమా ఏంటన్న విషయంలో ఇంకా ఓ క్లారిటీ రాలేదు. అయితే.. మైత్రీ మూవీస్‌లో పవన్ ఓ సినిమా చేయాల్సివుంది. ఏఎం రత్నం సంస్థలోనూ పవన్ సినిమా ఉంటుంది. వీటిలో ఏది ముందు మొదలవుతుందన్నది ఇంకా తెలీదు. 'జనసేన' పార్టీని బలోపేతం చేయడానికి పవన్ శ్రమిస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకున్న పవన్.. ఈ ఏడాదంతా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. దాంతోపాటు వీలైనన్ని చిత్రాల్ని అభిమానులకు అందించాలని ప్రయత్నిస్తున్నారు.



సందడంతా బాలయ్యదే

డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచే నందమూరి బాలకృష్ణ సందడి మొదలైపోయింది. ఆయన కథానాయకుడిగా నటించిన 'జై సింహా'లోని ఓ గీతాన్ని ఆదివారం అర్ధరాత్రి విడుదల చేశారు. ఈనెల 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఆ తరవాత 'ఎన్టీఆర్' బయోపిక్‌తో బాలకృష్ణ బిజీ అయిపోతారు. ఇప్పటికే కొన్ని సన్నివేశాల్నీ తెరకెక్కించారు. ఈనెల 18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీజర్‌ని విడుదల చేసే అవకాశం ఉంది. బోయపాటి శ్రీనుతో చేయబోయే చిత్రమూ ఈ ఏడాదే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది.

'క్వీన్' తమన్నా

కొత్త ఏడాది కోసం పక్కాగా 'స్కెచ్' వేసింది తమన్నా. హిందీ 'క్వీన్'కి రీమేక్‌గా తెలుగులో తెరకెక్కుతున్న 'క్వీన్'తో పాటు, కల్యాణ్‌రామ్‌తో కలిసి నటిస్తున్న చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కునాల్‌కోహ్లి దర్శకత్వం వహిస్తున్న తెలుగు చిత్రం కూడా త్వరలోనే విడుదల కాబోతోంది. హిందీలోనూ 'ఖామోషీ'తో సందడి చేయబోతున్న తమన్నా... తమిళంలో విక్రమ్‌తో కలిసి నటించిన 'స్కెచ్'తో తెలుగులోనూ అలరించబోతోంది. గతేడాది 'బాహుబలి: ది కన్‌క్లూజన్'తో పాటు, 'జై లవకుశ'లో ప్రత్యేకగీతం మాత్రమే చేసింది. కానీ ఈ ఏడాది అందాల 'క్వీన్' నుంచి ఎక్కువ సినిమాలు విడుదల కాబోతున్నాయి. "పని చేయడంలోనే ఆనందాన్ని వెదుక్కొంటుంటా. ఖాళీగా ఉండాలనే ఆలోచన నాకెప్పుడూ రాదు. మంచి కథలొస్తే ఇక వెనుదిరిగి చూసుకోను. సినిమా సెట్టే నాకు ఓ పండగ వాతావరణాన్ని తలపిస్తుంటుంద"ని చెబుతోంది తమన్నా.

పదండి ముందుకు... పదండి తోసుకు



మల్టీ 'స్టారర్'



ఈ ఏడాది అంతా వెంకటేష్‌దే. ఆయన జోరు అలా ఉంది. 2017లో ఆయన 'గురు' ఒక్కటే చేశారు. ఈ ఏడాది మాత్రం ఆయన తన జోరు చూపించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మల్టీస్టారర్ చిత్రాలకు వెంకీ ప్రసిద్ధి. ఈ ఏడాది ఆయన్నుంచి ఆ తరహా సినిమాలే రాబోతున్నాయి. 'అజ్ఞాతవాసి'లో అతిథి పాత్రలో కనిపించబోతున్న వెంకీ... తేజ దర్శకత్వం వహించే సినిమాలో నటిస్తున్నారు. త్రివిక్రమ్ - వెంకీ కాంబో కూడా సెట్ అయిపోయింది. ఇవే కాకుండా నాగచైతన్యతో కలిసి ఓ సినిమాలో నటించే అవకాశాలున్నాయి. వెంకీ -రానాలు కలిసి ఓ వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారని సమాచారం. ఓ యువ కథానాయకుడితో కలిసి ఓ సినిమాలో వెంకీ నటించనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

అదే ఉత్సాహంతో...



యాభై సినిమాల మైలురాయిని చేరుకొంది కాబట్టి కాజల్‌కి 2017 గుర్తుండిపోతుంది. 'ఖైదీ నంబర్ 150', 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాలతో తెలుగులోనూ, 'మెర్సల్', 'వివేగం' చిత్రాలతో తమిళంలోనూ విజయాల్ని అందుకొన్న ఆమె అదే ఉత్సాహంతో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే 'ఎమ్.ఎల్.ఎ', 'అ' చిత్రాల్లో నటించిన కాజల్, వాటి విడుదల కోసం ఎదురు చూస్తోంది. తదుపరి మరిన్ని కొత్త చిత్రాలపై దృష్టిపెట్టబోతోంది. ఇటు యువ కథానాయకులతోనూ, అటు సీనియర్లతోనూ కలిసి నటించగలిగే అతి కొద్దిమంది కథానాయికల్లో కాజల్ ఒకరు. తమిళంలో 'క్వీన్'కి రీమేక్‌గా తెరకెక్కుతున్న 'పారిస్ పారిస్' చిత్రంలో నటిస్తున్న ఆమె, ఈ సంవత్సరం తెలుగు, తమిళ చిత్రాలతో బిజీగా గడపబోతున్నారు.

రెండు చిత్రాలు వరుసగా...

గత ఏడాది కథానాయకుడిగా.. నిర్మాతగా బిజీగా గడిపారు నాగార్జున. తనయులిద్దరితోనూ ఒక్కో సినిమాని నిర్మించి విజయాల్ని సొంతం చేసుకొన్నారు. 'ఓం నమో వేంకటేశాయ', 'రాజుగారి గది 2' చిత్రాలతో కథానాయకుడిగా మంచి ఫలితాల్ని అందుకొన్నారు. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. అలాగే శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నానితో కలిసి ఓ సినిమాలో నటించేందుకూ నాగ్ అంగీకారం తెలిపారు. అది కూడా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయి. తన తనయులకి మంచి విజయాల్ని అందించాలనే లక్ష్యంతో కనిపించిన ఆయన, అది నెరవేరింది కాబట్టి ఇక తన సినిమాలపై దృష్టిపెట్టే అవకాశాలున్నాయి.

పెళ్లి కబురు ఉందా?



'బాహుబలి 2'తో 2017ని సువర్ణాక్షరాలతో లిఖించాడు ప్రభాస్. 'బాహుబలి 2' విడుదల తరవాత కొంత కాలం విరామం తీసుకొని ఆ తరవాత 'సాహో'పై దృష్టి నిలిపాడు. ఈ ఏడాదే 'సాహో' ప్రేక్షకుల ముందుకు వస్తుంది. 'జిల్' దర్శకుడు రాధాకృష్ణ కుమార్ చెప్పిన కథకు ప్రభాస్ ఎప్పుడో ఓకే చెప్పేశాడు. 2018లో ఇది పట్టాలెక్కబోతోంది. ప్రభాస్ కోసం చాలామంది దర్శకులు కథలు సిద్ధం చేసుకున్నారు. అందులో ఒకట్రెండు ప్రాజెక్టులకు ప్రభాస్ ఈ సంవత్సరం పచ్చజెండా ఊపే అవకాశాలున్నాయి. '2017లో ప్రభాస్ పెళ్లి ఖాయం' అని కృష్ణంరాజు చెప్పారు. కానీ ఆ కబుర్లేం వినలేదు. 2018లో అయినా ప్రభాస్‌ని పెళ్లి కొడుకులా చూడాలన్నది అభిమానుల ఆశ.

స్పీడు పెంచాల్సిందే



అల్లు అర్జున్ నుంచి 2017లో 'డీజే' ఒక్కటే వచ్చింది. అందుకే కొత్తేడాది దూకుడు పెంచాలని భావిస్తున్నాడు బన్నీ. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ఈ వేసవికి విడుదల అవుతోంది. జనవరి తొలి రోజున ఈ చిత్రానికి సంబంధించిన 'ఫస్ట్ ఇంపాక్ట్' విడుదల చేయబోతున్నారు. దాంతో పాటు 2018లో మరో చిత్రాన్నీ ముగించాలని భావిస్తున్నాడు. ఇందుకు సంబంధించి తన దర్శక నిర్మాతలతో బన్నీ సంప్రదింపులు జరుపుతున్నాడు. లింగుస్వామితో తెరకెక్కించే చిత్రం త్వరలోనే పట్టాలెక్కుతుంది. ఈ సినిమాతో బన్నీ తమిళంలోనూ నేరుగా అడుగుపెట్టబోతున్నాడు. విక్రమ్ కె.కుమార్‌తో బన్నీ ఓ సినిమా చేసే అవకాశాలున్నాయి.

ఈ ఏడాదీ ఒక్కటే



మహేష్‌బాబు నుంచి 2017లో 'స్పైడర్' ఒక్కటే వచ్చింది. 2018లోనూ ఆయన్నుంచి ఒకే సినిమా వస్తోంది. అదే.. 'భరత్ అను నేను'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. నిజానికి సంక్రాంతికే 'భరత్..' ప్రేక్షకుల ముందుకు రావాలి. కానీ... అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. ఈ చిత్రంలో మహేష్‌బాబుని ముఖ్యమంత్రిగా చూడొచ్చు. దీని తరవాత వంశీపైడిపల్లి సినిమాతో బిజీ అయిపోతారు మహేష్. 2018 ప్రారంభంలోనే ఈ చిత్రం పట్టాలెక్కే అవకాశం ఉంది.

పని మొదలెట్టాలి!

గతేడాది ఎన్టీఆర్‌కి 'జై లవకుశ'తో ఓ మరపురాని విజయం దక్కింది. మూడుపాత్రల్లో, మరీ ముఖ్యంగా జైగా ఎన్టీఆర్ తన నట విశ్వరూపం చూపించాడు. 'బిగ్ బాస్' షోతో కూడా అభిమానుల్ని అలరించాడు. 'లవకుశ' తరవాత ఎన్టీఆర్ బాగా రిలాక్స్ అయిపోయాడు. త్రివిక్రమ్‌తో సినిమాకి ఇంకా సమయం ఉండడంతో కుటుంబంతో విహార యాత్రలు చేస్తున్నాడు. ఫిబ్రవరి, మార్చిలలో ఎన్టీఆర్ - త్రివిక్రమ్‌ల చిత్రం పట్టాలెక్కబోతోంది. రాజమౌళి మల్టీస్టారర్ కూడా చేతిలో ఉంది. 'బిగ్ బాస్' రెండో సీజన్‌కీ త్వరలోనే శ్రీకారం చుట్టే అవకాశాలున్నాయి.



అడుగులు ఎటువైపో



నాలుగు చిత్రాలతో 2017ని ఘనంగా ముగించింది రకుల్‌ప్రీత్ సింగ్. 'స్పైడర్', 'రారండోయ్ వేడుక చూద్దాం', 'జయ జానకి నాయక', 'ఖాకీ' చిత్రాల్ని తన ఖాతాలో వేసుకొని... ఎప్పట్లాగే జోరును కొనసాగించింది. హిందీలోనూ 'అయ్యారీ' అనే చిత్రంలో నటించింది. ఆ చిత్రం జనవరి 26న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఒక సినిమా పూర్తయ్యేసరికి, ఇంకో రెండు సినిమాలకి సంతకం చేస్తుంటుంది రకుల్. కానీ ఈమధ్య ఆమె కొత్తగా ఒప్పుకొన్న చిత్రాలేవీ లేవు. హిందీ చిత్రం ఫలితాన్ని చూసుకొని, ఆ తర్వాత అక్కడనుంచి వచ్చే అవకాశాల్నిబట్టి తెలుగులో సినిమాలకి సంతకం చేస్తుందేమో అని టాలీవుడ్ వర్గాలు మాట్లాడుకొంటున్నాయి. మరో పక్క రవితేజ, రామ్‌చరణ్‌ల సినిమాల్లో ఆమె నటించడానికి ఒప్పుకొన్నారనీ ప్రచారం సాగుతోంది. మరి రకుల్ అడుగులు ఎలా పడబోతున్నాయో చూడాలి.

ఐదు సినిమాలతో...



విరామం కూడా తీసుకోకుండా సినిమాల్లో నటిస్తూనే పెళ్లి చేసుకొన్న సమంత... కొత్త ఏడాదిలో మరింత బిజీగా గడపబోతోంది. ఆమె నటించిన ఐదు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. తెలుగులో 'రంగస్థలం', 'మహానటి' చిత్రాలతో సందడి చేయబోతోంది. తమిళంలో మూడు చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి. భర్త నాగచైతన్య, మరిది అఖిల్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి గోవాలో కొత్త ఏడాది సంబరాలు జరుపుకొంటున్న ఆమె అక్కడి నుంచి తిరిగొచ్చిన వెంటనే సినిమాలతో బిజీ కానున్నారు. కొంతకాలంగా ప్రాధాన్యమున్న పాత్రలతోనే ప్రయాణం చేస్తున్న సమంత, తెలుగులోనూ మంచి పాత్రలొస్తే ఈ ఏడాది సంతకం చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలతోనే ఆమె డైరీ సగం పూర్తయింది. మిగిలిన డైరీలో ఎలాంటి చిత్రాలు చేరబోతున్నాయో చూడాలి.


రెండు పడవల ప్రయాణం



గత సంవత్సరం రామ్ చరణ్ నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు. 'ఖైదీ నంబర్ 150'లోని ఓ గీతంలో చిరుతో కలిసి స్టెప్పులేశాడంతే. ఆ చిత్రంతో నిర్మాతగా మారాడు. ఈ ఏడాదంతా 'రంగస్థలం' చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు. మార్చిలో 'రంగస్థలం' ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అంతకు ముందే... బోయపాటి శ్రీనుతో సినిమా మొదలవుతుంది. వరుసగా మూడు విజయాలు అందుకుని హ్యాట్రిక్ సాధించారు బోయపాటి. అందుకే వీరిద్దరి కలయికలో చిత్రం ఎలా ఉంటుందా? అని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జనవరి 19న బోయపాటితో సినిమా పట్టాలెక్కుతుంది. మరోవైపు నిర్మాతగా రెండు పడవల ప్రయాణం చేస్తున్నాడు చరణ్. 'సైరా నరసింహారెడ్డి'కి తనే నిర్మాత. రాజమౌళి దర్శకత్వంలో చరణ్, ఎన్టీఆర్‌లు కలిసి నటించనున్నారు. ఈ మల్టీస్టారర్‌కి సంబంధించిన సంగతులు కూడా ఈ ఏడాది ప్రారంభంలోనే తెలిసే అవకాశాలున్నాయి.

రంగవల్లిక

11 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకూ






భారతి,
కాజ

మూడువైపులా ముగ్గు వేసి
ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.

17 చుక్కలు,
3 వరుసలు,
3 వచ్చేవరకూ





పూర్ణిమ
ధవళేశ్వరం

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
email: vasundhara@eenadu.net

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.



కొత్త సంవత్సరమనగానే ప్రతి ఒక్కరూ రాత్రి పూట పార్టీలు చేసుకోకపోవచ్చు. అందరూ సరికొత్త తీర్మానాల్లో తలమునకలు కాకపోవచ్చు. ఇవేవీ చేయకపోయినా అందరిలోనూ ఏదో ఆశ మాత్రం ఉంటూనే ఉంటుంది. మంచి మార్పో, వృద్ధో, బాధ నుంచి విముక్తో.. ఇలా ఆ అభిలాష దేనికి చెందిందైనా కావొచ్చు. వాటిని మీకోసం సాధించిపెట్టగల అతిపెద్ద సాధనం.. మీ మనసు! దాని ప్రలోభాలూ, దానికి ఆరోగ్యాన్నిచ్చే విషయాలని అర్థం చేసుకోగలిగితే మీ లక్ష్యాల సాధనకి అద్భుతమైన ఉపకరణంగా మారుతుంది.
ఈ ఏడాది మీ మనసుతో అలా అద్భుతాలు చేయడానికి ఇవి ఉపయోగపడతాయి..

ఈ ఏడుకి... ఆరు!

ప్రగతి మెట్లు

మేధస్సు

మేధస్సు ఓసారి చుట్టూ చూడండి. మీకు కనిపించే ప్రతి ఆధునిక ఆవిష్కరణా, ప్రగతి వెనక ఉండేది.. 80 శాతం మేధో విజయమే! తెలివితేటలు మనిషి స్థితిగతుల్ని క్షణకాలంలో మార్చేయగలవు. అందుకే మీరు విద్యార్థినైనా, ఉద్యోగైనా, గృహిణైనా.. ప్రతి అంశాన్నీ లోతుగా తెలుసుకోవడం అలవాటు చేసుకోండి. సమాజంలోని ప్రతి కొత్త పరిణామాన్నీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ప్రతిరోజూ కనీసం అర్ధగంటైనా పుస్తకాలకీ, దినపత్రికల పఠనానికి కేటాయించండి. 365 రోజులూ మీరు ఇది చేయగలిగితే.. ఆ తర్వాత మీలో వచ్చిన మార్పుని చూసి మీరే అబ్బురపడతారు.

నిజాయతీ

చిన్న సమస్య నుంచి బయటపడటానికి కూడా అబద్ధాలాడటం వద్దు. మీరు ఎదుర్కొన్న సమస్య అందరికీ ఎదురయ్యేదే కావొచ్చు. కాకపోయినా సరే అలా జరిగిందని చెబితే ఏమనుకుంటారో.. అలుసుగా చూస్తారేమో అనుకోవద్దు. కచ్చితంగా చూడరు. పైగా మీ బలహీనతలపై పోరాడటానికి సాయం చేస్తారు. మీ నిజాయతీని మెచ్చుకుంటారు. నేటి కార్పొరేట్ సంస్థలు ఇలాంటి వారికే పెద్ద పీట వేస్తున్నాయి. అంతకన్నా మీలో లేనివి.. లేదా భవిష్యత్తులో సాధించాలని భావిస్తున్నవాటిని ఇప్పుడే అందుకున్నట్టు చెప్పకండి. ఆ సామర్థ్యం ఎదుటివాళ్లకి అవసరమైనప్పుడు మానవ సంబంధాలూ దెబ్బతింటాయి. సామర్థ్యం, నైపుణ్యాలతోపాటూ నిజాయతీని సాధన చేయండి. విజయీభవ!!

అలవాట్లు

మన మనసు వెళ్లే మార్గాలకి అలవాట్లు.. రహదారుల్లాంటివి. అవి మంచివైతేనే మనం చక్కటి గమ్యాన్ని చేరుకుంటాం. గత సంవత్సరం మీరు అలవాటుచేసుకోవాలనుకుని మానేసిన వాటి చిట్టా రాయండి. ఒక పనిని తీసుకుని ఒక్కరోజూ వదలకుండా మూడువారాలపాటు(21 రోజులు) చేయండి. నాలుగోవారం నుంచి అది చాలా సులభంగా మీకు అలవాటైపోతుంది. 'మీ దైనందిన జీవితంలో వ్యాయామానికీ తప్పనిసరిగా స్థానమివ్వండి. మనసు గురించి మాట్లాడుకునేటప్పుడు వ్యాయామం ఎందుకు.. అని అనుకుంటారేమో. వ్యాయామం దేహానికిచ్చే దృఢత్వం మనసునీ అంతే గట్టిగా ఉంచుతుంది. వ్యాయామం ఒక్కటే కాదు మన భంగిమ కూడా మనసుని నియంత్రిస్తుంది. నడుము వంగినట్టు కాకుండా నిటారుగా నిల్చోవడం, కూర్చోవడం వంటివి మీకు గాంభీర్యాన్ని ఇవ్వడమే కాదు.. ఉద్వేగాలని తక్షణం అదుపుచేస్తాయి..' అని చెబుతున్నారు పూర్ణిమ నాగరాజా.



ప్రలోభాలు..

ఉద్వేగాలు



కోపం, అసూయా, ఈర్ష్యా, దుఃఖం, భయం.. ఓ రకంగా మన ఎదుగుదలకి ఉపయోగపడేవే! కానీ శ్రుతిమించితే.. ఓ దీర్ఘకాలిక వ్యాధిలా జీవితాంతం పీడిస్తాయి. కాస్త కష్టమైనా సరే.. ఈ కొత్త ఏడాదిలో మీ మనసుని నియంత్రించుకోవడంపైనే ఎక్కువ దృష్టిపెట్టండి. అందులో మీరు విజయం సాధించకపోయినా ఫర్వాలేదు.. ఆ ప్రయత్నమే మీకెంతో ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. ఇంటా, బయటా ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఎదుటివారికి మనం చేదోడు వాదోడుగా ఉంటామని అందరూ అనుకోవాలికానీ.. 'తనకి చెబితే తట్టుకోలేదు. రాద్ధాంతం చేస్తుంది..' అనే పరిస్థితి తెచ్చుకోవద్దు. 'మనం సాధారణంగా ఆనంద, ఉద్వేగాలు అంటుంటాం. అంటే.. ఉద్వేగాలని ఆనందం నుంచి వేరుగా చూస్తుంటాం. కానీ పాశ్చాత్యదేశాల్లో సంతోషాన్నీ ఉద్వేగంలో భాగంగానే చూస్తారు. మిగతా ఉద్వేగాల్లానే అతి సంతోషాన్నీ అదుపు చేయాలంటారు. ఎందుకంటే.. మనం కోపం, దుఃఖం, భయం వంటివి ఏర్పడినప్పుడే కాదు.. ఆనందం మితిమీరినప్పుడూ అంతే తప్పులు చేస్తుంటాం కాబట్టి. అందువల్ల దానిపైనా నియంత్రణ అవసరం' అని చెబుతున్నారు ప్రముఖ సైకియాట్రిస్టు పూర్ణిమా నాగరాజా.

పేరూ ప్రఖ్యాతి

మీరు కాలేజీ బ్యూటీ అనిపించుకోవాలని కోరుకోవచ్చు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఐదంకెల జీతం సాధించాలనుకోవచ్చు. ప్రతి ఏటా వరసగా 'ది బెస్ట్ ఎంప్లాయర్' కావాలని కలలుకనొచ్చు. వాటిని సాధించడం ద్వారా ఓ మానసిక సంతృప్తీ, ఆ గెలుపుతోబాటూ వచ్చే ప్రయోజనాలు మీ లక్ష్యమైతే తప్పులేదు. కానీ మీ గురి కేవలం కీర్తి ప్రతిష్ఠలే అయితే.. మీ శ్రమ మొత్తం వృధా అవుతున్నట్టే. అతి త్వరలో అభాసుపాలు కాబోతున్నట్టే. మీరు సాధించింది ఎంతటి విజయమైనా పదే పదే చెప్పుకోవద్దు. మీరు మాట్లాడేకొద్దీ మీ విజయం మీకే పలచనవుతుందని తెలుసుకోండి. అది మిమ్మల్నీ పెళుసుగా మారుస్తుంది. మీ విజయం నిజంగా అంతపెద్దదైతే మీ పక్కవాళ్లే మీకన్నా ఎక్కువ సార్లు గుర్తుచేసుకుంటారు. ఎప్పుడూ మీరు కాదు.. మీ పనే మాట్లాడాలనే విషయం గుర్తుంచుకోండి.

అధికారం.. అహం!

చంటిపిల్లలకి చాక్లెట్ పరిచయం చేయడంలాంటిదే ఇది. ఒక్కసారి రుచిచూశాక మళ్లీమళ్లీ కావాలని మారాం చేస్తుంటుంది. నేటితరం అమ్మాయిలం చిన్న వయసుల్లోనే కార్పొరేట్ నిచ్చెనలో పైకెక్కుతున్నాం. ఒక్కసారిగా అధికారాన్ని చవిచూస్తున్నాం. చాక్లెట్‌లాగే చాలా కొద్దిమొత్తంలో ఇది మనకు ఆత్మస్థైర్యాన్నిస్తుంది. ఎదుటివాళ్లు మనల్ని చులకన చేయకుండా కాస్తుంది. కానీ శ్రుతిమించితే.. ఇది మనల్నే మింగేస్తుంది. కాబట్టి ఆ అహంపై ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచండి. 'మనకిచ్చిన అధికారం కూడా కేవలం సంస్థ మనకిచ్చిన బాధ్యతని సక్రమంగా పూర్తిచేయడానికి తప్ప.. దాని కారణంగా మనం.. ఓ భారీ బెలూన్‌లా మారడానికి కాదు. ఓ చిన్న సంఘటన చాలు అది పేలిపోవడానికి. కాబట్టి జాగ్రత్త!' అంటూ హెచ్చరిస్తున్నారు ప్రముఖ ఆర్గనైజేషనల్ సైకాలజిస్టు కవితా గూడపాటి.

ఆస్తి నాదంటే.. పేరు తప్పు అంటున్నారు!

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

నా వయసు ముప్పై సంవత్సరాలు. నా చిన్నతనంలోనే మా తాతయ్య ఎకరం పొలం రిజిస్టర్ చేయించారు. కానీ ఆ సమయంలో రిజిస్ట్రేషన్ చేసిన నా పేరులోని ముందు రెండక్షరాలు స్కూల్లో చేర్పించినప్పుడు పొరబాటున చేర్చలేదు. దాంతో అప్పటి నుంచి అధికారికంగా విద్యార్హత పత్రాలూ, ఆధార్, పాన్ వంటివన్నీ అధికారికంగా ఆ పేరుతోనే కొనసాగుతున్నాయి. ఈ మధ్యే రెవెన్యూ అధికారి దగ్గరకి వెళ్లినప్పుడు ఆ పొలంగల వ్యక్తిని నేను కాదని వాదిస్తున్నారు. ఆ ఆస్తికి వారసురాలిని నేనే అని నిరూపించుకోవాలంటే ఎలాంటి డాక్యుమెంట్లను జతచేయాలి?

- ఓ సోదరి

మీరు ముందు మీ తాతగారు వీలునామాలో రాసిన పేరు మీ బర్త్ రిజిస్టర్‌లో ఉందా లేదా అన్నది పరిశీలించండి. మీ తాతగారి వారసురాలు మీ అమ్మ అయితే ఆమెకి లేదా నాన్నకి సంబంధించిన కుటుంబ వారసత్వ ధ్రువపత్రాన్ని జత పరచండి. మీ అమ్మతో ఒక అఫిడవిట్ తయారు చేయించి దానిలో మీ కుటుంబానికి సంబంధించిన వివరాలన్నీ పొందుపరచండి. దానిలో మీపేరు పాఠశాల రిజిస్టర్‌లో ఎందుకు మార్చవలసి వచ్చిందో, అలా మార్చిన తరువాత మీకు సంబంధించిన స్కూల్ సర్టిఫికెట్‌లు ఏమున్నాయో అన్నింటినీ జతచేయండి. దానిలో మీ తల్లిదండ్రుల పేరు స్పష్టం చేస్తూనే మీ పేరున ఉన్న పొలం ఎప్పుడు రిజిస్టర్ చేశారో చెప్పాలి. అలా రిజిస్టర్ చేసిన వ్యక్తి మీకు తాత అవుతారనే విషయాన్ని కూడా తెలుపుతూ సంబంధిత రెవెన్యూ అధికారికి ఒక దరఖాస్తు పెట్టండి. ఆ అధికారిని మీ తరఫున పట్టా ఇవ్వమని కోరండి. ఒకవేళ అధికారి అందుకు అభ్యంతరం చెప్పి కోర్టు ఉత్తర్వులు కోరితే మీరు "ఛేంజ్ ఆఫ్ నేమ్ ఇన్ ఒరిజినల్ రికార్డ్"కి కలెక్టర్ దగ్గర పిటిషన్ దాఖలు చేయవలసి ఉంటుంది. కలెక్టర్ ఆఫీస్‌లో ఛేంజ్ ఆఫ్ నేమ్‌కి ఒక ప్రొఫార్మా ఉంటుంది. దాన్ని పూర్తిచేసి తగిన రుసుము చెల్లించాలి. అభ్యంతరాలు ఏమీ లేవనుకుంటే గెజిట్ పబ్లికేషన్‌కి పంపుతారు. ఒకవేళ మీరు పేరు మార్చుకోవడానికి ఇష్టపడకపోతే కోర్టులో డిక్లరేషన్ ఆఫ్ ఓనర్‌షిప్ అండ్ టైటిల్‌కి ఒక సూట్ వేసుకోవచ్చు. అప్పుడు మీరు హక్కుదారు అని నిరూపించుకునే ఆధారాలన్నీ పొందుపరచాలి. దానికి అడ్డుచెప్పేవారిని ప్రతివాదులుగా చేర్చవలసి ఉంటుంది. దీనికి కాస్త సమయం పడుతుంది. కాబట్టి ఆర్డీవో దగ్గర మీరు పెట్టిన దరఖాస్తు గురించి వివరిస్తూ మీకు వ్యతిరేకంగా ఆర్డర్ పాస్ చేసిన విషయంపై మీరు కలెక్టర్ దగ్గర అప్పీల్ వేసుకోవచ్చు. కలెక్టర్ కూడా అలానే వ్యతిరేకంగా ఆర్డర్ పాస్ చేస్తే దానిని సవాలు చేస్తూ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేయవచ్చు. కలెక్టర్ ఆర్డర్ సరిగ్గా ఉందా లేదా అని చూసి హైకోర్టు తీర్పు ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి ముందుగా ఆర్డీవో దగ్గర ప్రయత్నించండి.

మహీంద్ర సీఈఓ ఎందుకు ఫోను చేశారంటే...

బెంగళూరుకు వెళ్లొస్తానని చెప్పిన భర్త ఐదేళ్లు దాటినా తిరిగి రాలేదు. ఓ వైపు వయసుమళ్లిన అమ్మానాన్నలూ, ఒక్కగానొక్క కొడుకు.. పూటగడవని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో శిల్ప తీసుకున్న ఓ నిర్ణయం ఆ కుటుంబాన్ని సమస్యల సుడిగుండం నుంచి బయటపడేసింది. ఫుడ్‌ట్రక్‌ని ప్రారంభించి కుటుంబానికి ఆసరాగా నిలిచింది. ఆమె ఆత్మవిశ్వాసానికి మహీంద్ర సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర .. వ్యాపారం మరింత విజయవంతంగా సాగేందుకు అవసరమైన పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చారు. అసలు ఎవరీ శిల్ప? ఆమె కష్టం ఆనంద్ మహీంద్రను ఎందుకు అంతగా కదిలించింది? అవి ఆమె మాటల్లోనే..



మా కుటుంబం పన్నెండేళ్ల కిందటిదాకా హాసన్ జిల్లా పాళ్యలో ఉండేది. అమ్మానాన్నలకు నేనూ, తమ్ముడు. చదివింది పదో తరగతే. అప్పుడే నాకు ఎముకలకు సంబంధించిన అనారోగ్యం ఉన్నట్లు తెలిసింది. మాకు మూడెకరాల పొలం ఉన్నా దానిపై వచ్చే ఆదాయం మాకు ఓ పూటగడవటానికి కూడా సరిపోయేది కాదు. దాంతో అమ్మావాళ్లు అప్పులు చేసి తమ్ముడిని చదివిస్తూనే.. నాకు చికిత్స చేయించేవారు. కొన్నాళ్లకు నేను ఓ ప్రైవేటు కంపెనీలో చేరా. ఆ సమయంలో శేఖర్ నా జీవితంలోకి ప్రవేశించాడు. మా పరిచయం కొన్నాళ్లకు పెళ్లికి దారితీసింది. అమ్మా నాన్నలకు ఇష్టం లేకున్నా ఎదిరించి వివాహం చేసుకున్నా. ఆయన మంగళూరులో ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో పనిచేసేవారు. నాలుగేళ్లు ఏ సమస్యా లేదు. ఓ బాబు. ఇంతలో ఊహించని పరిణామం. పనిమీద బెంగుళూరుకు వెళ్లివస్తానని చెప్పిన మావారు ఎన్నిరోజులైనా తిరిగిరాలేదు. ఆయన కోసం ఎన్నో రోజులు ఎదురుచూశా. చాలా చోట్లతిరిగినా ఫలితం లేదు. ఇష్టం లేని వివాహం చేసుకున్నామని.. చివరకు భర్త తరఫు బంధువులు సైతం మమ్మల్ని పట్టించుకోవడం మానేశారు. ఒక్కసారిగా సమస్యలు చుట్టుముట్టేశాయి. దానికితోడు కుటుంబభారం నాపై పడింది. వయసు మళ్లిన అమ్మా నాన్నలతో పాటు చేతికొచ్చిన తమ్ముడు, ఐదేళ్ల కొడుకు. చివరకు కుటుంబాన్ని పోషించుకోవడానికి నేను, మా తమ్ముడు ఓ చిన్న ప్రైవేటు కంపెనీల్లో పనికి కుదురుకున్నాం. కానీ ఎంత కష్టపడినా ఇంటి అద్దె, ఖర్చులకు డబ్బు సరిపోయేది కాదు. డీటీపీ ఆపరేటర్‌గానూ చేయడం మొదలుపెట్టా. కానీ ఒక్కోసారి మణికట్టు ఏమాత్రం కదల్చలేని సమస్యతో కీబోర్డుపై చేతులు పెట్టలేకపోయేదాన్ని. దాదాపు మూడు నెలలు పనికి వెళ్లలేకపోయా. అలానే కష్టపడుతూ ఆరేళ్లు లాక్కొచ్చా. చివరకు బాగా ఆలోచించి సొంతంగా ఏదయినా చేస్తేనే కానీ.. ఈ సమస్యలు తీరవని అర్థమైంది.

రుచికరం, పోషకభరితం... నాకు వంటలు బాగా వచ్చు. ఆ ఆసక్తితోనే హోటల్ పెట్టాలనుకున్నా. కానీ లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టాలి. పైగా విపరీతమైన పోటీ. పోనీ తోపుడు బండి పెట్టాలన్నా కనీసం రెండు, మూడు లక్షల రూపాయలు కావాలి. మా వారు నా చేతి ఖర్చులకని ఇచ్చిన సొమ్ము ఎప్పుడో మా పిల్లాడి చదువుల కోసమని ఎఫ్‌డీ చేశా. నేను ఎఫ్‌డీ చేసిన లక్షతో పాటు కొంత మొత్తం వాహన రుణం తీసుకొని మొత్తం రూ. 8 లక్షలతో మహీంద్రా బొలేరో వాహనం కొని 2015లో ఈ ఫుడ్‌ట్రక్‌ని ప్రారంభించా. మా చుట్టుపక్కల ఎక్కడా దొరకని వైవిధ్య వంటకాలు అందిస్తే వ్యాపారంలో తప్పక విజయం సాధిస్తానన్న నమ్మకంతో 'హళ్లి మనె రోటీస్' (పల్లె ఇంటి రొట్టెలు) పేరుతో వాటినే చేయడం మొదలుపెట్టా. రాగి, జొన్న రొట్టెలు ప్రత్యేకంగా చేస్తాం. నేను దీన్ని పెట్టిన కొత్తల్లో మా వీధిలో నాలుగు మాత్రమే సంచార హోటళ్లు ఉంటే ఇప్పుడు పదికి పైగా ఉన్నాయి. కానీ మేము అందించే రుచికరమైన ఆహారం కోసం వినియోగదారులు ఎక్కువగా ఇక్కడికే వస్తుంటారు. ప్రతినెలా వచ్చే ఆదాయంలో రూ.12 వేలు రుణం చెల్లించగా.. మిగిలిన డబ్బు కుటుంబం అవసరాలకు వాడుతున్నా.

ఆ ఫోను రుణం కోసమేమో అనుకున్నా... 'ఉయ్ ఆర్ కాలింగ్ ఫ్రమ్ మహీంద్ర కంపెనీ..' అంటూ రెండు రోజుల క్రితం ఎవరో నాకు ఫోను చేశారు. బహుశా నేను తీసుకున్న వాహన రుణానికి సంబంధించిన వారే అనుకున్నా.. కానీ అది మహీంద్ర కంపెనీ సీఈఓదని తరువాత తెలిసింది. మా వద్దకు తరచూ వచ్చే హర్షిత అనే ఓ పాత్రికేయురాలు రాసిన బ్లాగింగ్ వార్తను ఎవరో మహీంద్ర సంస్థ సీఈవోకు ట్విట్టర్ ద్వారా జతచేసి ఓ వ్యాఖ్యానాన్ని పంపారట. మీరు కేవలం రుణాలు ఇవ్వడమే కాదు ఇటువంటి వారికి సహాయాన్ని అందిస్తే బావుంటుందన్నది ఆ ట్వీట్ సారాంశం. మహీంద్ర సంస్థ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర ఈ ట్వీట్‌కు స్పందించి ఆ కంపెనీ సీఈవోతో నాకు ఫోను చేయించారని తెలిసి ఆశ్చర్యపోయా. కానీ నాకు ఇంగ్లీషు సరిగా రాకపోవడం వల్ల ఆ మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయా. కానీ ఆ సంస్థ నా వ్యాపారంలో ఇంకాస్త పెట్టుబడి పెట్టాలనుకుంటున్నట్టు చివరకు అర్థమైంది. ఇది జరిగిన తరువాత నుంచి మాకు చాలా బ్యాంకులు, వ్యక్తుల నుంచి సైతం మేము మీకు సహాయం చేస్తామంటూ ఫోన్లు వస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే ఇన్నాళ్లు మేము పడిన కష్టానికి మంచి రోజులు వస్తున్నాయనిపించింది.



- ముకుంద, ఈనాడు డిజిటల్, బెంగళూరు

వేడుకల వేళ... మెరవాలిలా



కొత్త సంవత్సరం అంటే పార్టీలూ, వేడుకలూ మామూలే. అయితే చలికాలంలో చర్మం నిర్జీవంగా మారుతుంది కాబట్టి అలంకరణ వేసుకోవడం కాస్త ఇబ్బంది. మీ సమస్య కూడా ఇదే అయితే ఇలా చేసి చూడండి.

- చలికాలంలో ఎక్కువ మంది లిక్విడ్ ఫౌండేషన్ వేసుకోవడానికి మొగ్గుచూపుతారు. అయితే క్రీమ్ తరహా ఎంచుకుంటే మంచిది. ముఖ్యంగా పొడిచర్మతత్వం ఉన్న వారు ఈ విషయంలో జాగ్రత్తపడాలి.
- చర్మం తెల్లగా పాలిపోయినట్లు కనబడుతుందని కొంతమంది తరచూ ఏదో ఒకటి రాస్తుంటారు. అలా చేస్తే సమస్య మరింత ఎక్కువవుతుంది. అలాకాకుండా చర్మం పగిలిన చోట నాణ్యమైన మాయిశ్చరైజర్‌ను రాసుకుని ఆ తరువాత అలంకరణ వేసుకోవాలి.
- చలికాలంలో లిప్‌స్టిక్ ఎక్కువగా వాడితే పెదాలు ఇంకా పొడిబారే ప్రమాదం ఉంది. అందుకే సాధ్యమైనంత వరకు కాస్త ముదురు రంగున్న లిప్‌బామ్ వాడండి.
- చర్మం మరీ పొడిగా మారితే ఫౌండేషన్ మీద ఎక్కువగా పౌడర్ అద్దకండి. ఒక వేళ ముక్కూ, నుదురు ప్రాంతాల్లో జిడ్డుగా ఉంటుందనిపిస్తే అక్కడ కాస్త పౌడర్ అద్దండి చాలు..!!
- ఈ కాలంలో చర్మాన్ని తేమగా ఉంచేలా చూసుకుని అలంకరణ ఎంత తక్కువగా వేసుకుంటే అంత మంచిది.

పట్టుకో... కొత్త ట్రెండ్!



కొత్త సంవత్సరం.. సరికొత్త ఉత్సాహం! కొత్త ఆశలు.. సరికొత్త లక్ష్యాలు! వాటిని సాధించడానికి... సోషల్ మీడియాలో శపథం చేయండి! మొబైల్‌పై ఒట్టు పెట్టుకోండి! అన్ని రంగాల్లో ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తోంది. మనుషులు, మరమనుషులు కలీగ్స్‌గా కలిసి పనిచేయాల్సిన కాలం దగ్గరపడింది. ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోకపోతే కంపెనీలు మిమ్మల్ని ఆదిమానవుల జాబితాలో జమకట్టేస్తాయి. నిజాయతీగా మీ నైపుణ్యాలను లెక్కకట్టండి. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మార్చుకుంటూ కొత్త వర్క్‌ఫోర్స్‌లో మీ స్థానాన్ని కాపాడుకోండి!

డిగ్రీ పూర్తి చేసుకొని ఇంకొద్ది రోజుల్లో ఉద్యోగంలో సెటిల వ్వాలని ప్రయత్నాలు ప్రారంభించారా... అయితే ప్రస్తుత డెవలప్‌మెంట్స్ కొన్నింటి గురించి మీరు తెలుసుకోవాలి. వాటి ప్రభావం వెంటనే ఉండకపోయినా, రాబోయే రోజుల్లో, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 2018లో అవి మీ టాలెంట్‌కి టెస్ట్‌లు పెట్టబోతున్నాయి.

◆ ముందుగా చెప్పుకోవాల్సిన డెవలప్‌మెంట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. 2017లో ఈ టెక్నాలజీ జాబ్ మార్కెట్‌పై ప్రభావాన్ని చూపడం మొదలు పెట్టింది. రైల్వేస్టేషన్లలో ఆటోమేటిక్ వెండింగ్ మిషన్లు, సినిమా హాళ్లలో, ఫుడ్‌కోర్టుల్లో ఆర్డర్లు అందుకునే కియోస్క్‌లు దీనికి సంబంధించినవే. కొత్త సంవత్సరంలో ఇలాంటివి ఇంకెన్నో చూడబోతున్నాం.

◆ మొబైల్ ఇప్పటికే ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించింది. ఇప్పుడు ఆ మొబైల్ నుంచే జాబ్ అప్లికేషన్స్ పంపడం ప్రారంభమైంది. సరికొత్త టెక్నాలజీ సాధనాలను అభ్యర్థులు ఎంతవరకు ఉపయోగిస్తున్నారో తెలుసుకోడానికి కంపెనీలు మొబైల్ జాబ్ అప్లికేషన్ విధానాలను ప్రవేశపెడుతున్నాయి.

◆ శ్రమసాంద్ర రంగాల్లోకీ టెక్నాలజీ వేగంగా ప్రవేశిస్తోంది. ముఖ్యంగా ఆరోగ్య రంగంలోకి. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా హెల్త్‌కేర్ టెక్నాలజీ వినియోగం బాగా ఎక్కువైంది. రకరకాల రోగ నిర్ధారణ పరీక్షలు, రిపోర్ట్ జనరేషన్లలో యంత్రాల వాడకం అధికమైంది. అప్పటికప్పుడు మెదడు ఉపయోగించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేని చోట యంత్రాలను ఉపయోగిస్తున్నారు. వీటి నిర్వహణ నైపుణ్యాలు ఉన్నవారికి ఉద్యోగాలు ఎక్కువవుతున్నాయి.

◆ ఇంతకుముందు వరకు ఉద్యోగానికి అప్లికేషన్ పెడితే దాని పరిస్థితేంటో తెలిసేది కాదు. కానీ 2018లో నియామక ప్రక్రియలో మరింత పారదర్శకతను ఉద్యోగార్థులు ఆశించవచ్చు. అప్లికేషన్ పెట్టడం మొదలు వివిధ దశల్లో దాని స్టేటస్ ఏమిటో రియల్‌టైమ్‌లో తెలుసుకునే విధానాలు కొత్త సంవత్సరంలో జోరందుకోబోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ప్రధాన సాధనం సోషల్ మీడియా

ఉద్యోగాల, ఉద్యోగుల అన్వేషణకు ఇప్పుడు సోషల్ మీడియా ప్రధాన సాధనంగా మారింది. కంపెనీలు ఉద్యోగాల ప్రకటనలను న్యూస్ పేపర్లలో ఇవ్వడం తగ్గించేశాయి. అభ్యర్థులు జాబ్ నోటిఫికేషన్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. నియామక సంస్థలు కూడా తమకు తగిన సామర్థ్యాలు ఉన్న ఉద్యోగుల కోసం లింక్డ్‌ఇన్, ఇతర ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సైట్లను వెతుకుతున్నాయి. మిలెనియల్స్ (1980-2000 మధ్య పుట్టిన వాళ్లు) సమాచారం ఇప్పుడు ఎక్కువగా సోషల్ మీడియాలోనే లభ్యమవుతోంది. దాని నుంచి నాణ్యమైన నైపుణ్యం ఉన్నవారిని తేలిగ్గా ఎంపిక చేసుకుంటున్నారు.

మీ మార్కెటింగ్ మీదే!

సంస్థలు అడిగినప్పుడు ఆ అర్హతలు మీకున్నాయని చెప్పుకునే రోజులు పోయాయి. మీకు మీరే మార్కెటింగ్ చేసుకునే ట్రెండ్ రిక్రూట్‌మెంట్‌లో మొదలైంది. 2018 చివరినాటికి ఇది మరింత ఊపందుకోబోతోంది. కమ్యూనికేషన్, కంటెంట్ రైటింగ్, ప్రోగ్రామింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ తదితర మీ నైపుణ్యాలను బ్రాండింగ్ చేసుకోవడం ఇప్పుడు సాధారణ సంప్రదాయ టాలెంట్ ప్రదర్శనలో భాగంగా మారాయి.

ఫైరింగ్... హైరింగ్!


అభ్యర్థుల్లో అసలైన సామర్థ్యాలను వెలికి తీయడానికి సంస్థలు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయి. కావాల్సిన నైపుణ్యాలు ఉన్నవారిని వెతికి మరీ హైర్ చేసుకుంటున్నాయి. ఇంకా కొత్త స్కిల్స్ నేర్చుకోవడంలో ఎవరైనా బద్ధకిస్తే వారిని ఫైర్ చేస్తున్నాయి. తగిన నైపుణ్యాలతో వస్తే మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. ఉద్యోగంలో చేరిపోయాం ఇక చాలు అని స్థిమితపడితే మీరు ఫైరింగ్ లిస్ట్‌లో చేరిపోతారు.

కొత్త ఉద్యోగాల్లో 9 శాతం మంది!

ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తోంది. మార్కెట్ అవసరాలకు దీటుగా ఉత్పత్తి సామర్థ్యాన్ని, మార్కెటింగ్ పరిధిని పెంచుకోడానికి సంస్థలు టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి. ఫిక్కీ-నాస్కామ్ నివేదిక ప్రకారం 2022 నాటికి భారతీయ ఉద్యోగుల్లో 9 శాతం మంది కొత్త ఉద్యోగాల్లో ఉంటారు. అంటే ఇప్పుడు ఉన్నవి కాకుండా కొత్తరకం ఉద్యోగాలు రానున్నాయన్నమాట. కొత్త నైపుణ్యాలను నేర్చుకుని సిద్ధంగా ఉన్నవారికి అధిక వేతనాలు లభించే అవకాశం కూడా ఉంది.

రిక్రూట్‌మెంట్‌లోనూ టెక్నాలజీ!

ఇటీవలి కాలం వరకు అవసరమైతే రాత పరీక్ష, తర్వాత ఒక చిన్న ఇంటర్వ్యూ. అంతే ఉద్యోగం ఇవ్వాలో లేదో తేల్చేసేవారు. కానీ ఇప్పుడు పద్ధతి మారింది. కొత్త స్కిల్స్ నేర్చుకున్న వాళ్లకు, సరికొత్త నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలనే ఉత్సాహం ఉన్నవారికే ఆఫర్ లెటర్లు అందుతున్నాయి. అందుకోసం రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. కొంత క్లిష్టంగా సాగే ఈ ప్రక్రియలో సైకోమెట్రిక్ టెస్ట్‌లు, పర్సనాలిటీ పరీక్షలు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లు, కేస్ స్టడీస్, రిటెన్ రిపోర్ట్‌లు, ప్రజెంటేషన్ తదితరాలను వినియోగిస్తున్నారు. ఈ ట్రెండ్ 2018లో మరింత పెరగనుంది. టెక్నికల్ గ్రాడ్యుయేట్లు వీటిని తేలిగ్గా అందిపుచ్చుకోవచ్చు. ఇతర డిగ్రీల అభ్యర్థులు కూడా కొంత టెక్నికల్ నైపుణ్యాన్ని సంపాదించడం అవసరం.



జాబ్ మార్కెట్‌తో పాటుగా!

రాబోయే రోజుల్లో టెక్నాలజీ ప్రభావం ప్రతి ఒక్కరిపై తప్పనిసరిగా ఉంటుంది. ఉద్యోగం చేస్తూ నేర్చుకోవచ్చు అనేది ఇక ముందు చెల్లదు. అప్పటికి లేదా భవిష్యత్తు అవసరాలకు తగిన స్కిల్స్ మీ దగ్గర ఉంటేనే రిక్రూటింగ్ ఏజెన్సీలు మీ గురించి ఆలోచిస్తాయి. ఉదాహరణకు కార్లు, ట్రక్కుల డ్రైవర్ల నియామకాలు ఇక ముందు జరగకపోవచ్చు. రిటైల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టికెట్ సెల్లింగ్ తదితర ఉద్యోగాల భర్తీ భవిష్యత్తులో ఉండదేమో. కానీ ఏ టెక్నాలజీ ప్రభావం ఎలా ఉన్నా, కొత్త స్కిల్స్ నేర్చుకోవడంలో అభ్యర్థులు ఎప్పుడూ ముందుండాలి. జాబ్ మార్కెట్ ట్రెండ్స్‌ని ముందే గుర్తించి జాగ్రత్త పడితేనే పోటీలో నిలబడగలుగుతారు. అందుకే కొత్త సంవత్సరం... కొత్త నిర్ణయాల్లో భాగంగా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలని సంకల్పించండి. 2018ని నైపుణ్యనామ సంవత్సరంగా మార్చుకోండి.

హ్యాపీ న్యూ ఇయర్!

న్యూస్ రిపోర్టర్ అయ్యేదెలా?



■ డిగ్రీ పూర్తిచేశాను. వార్తా విలేఖరి (న్యూస్ రిపోర్టర్) కావాలనుంది. ఈ కోర్సును అందించే సంస్థలు, అర్హతల వివరాలను తెలియజేయండి. దూరవిద్య ద్వారా చేయడం సాధ్యమేనా? – ఎల్. జీవన్, హన్మకొండ

జ: న్యూస్ రిపోర్టర్‌గా స్థిరపడాలనుకునేవారు జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో కోర్సు చేస్తే మేలు. విలేఖరి కావాలనుకునేవారు సామాజిక సమస్యలపట్ల అవగాహన, వర్తమాన వ్యవహారాలను తెలుసుకోవడంపట్ల ఆసక్తి, భావాన్ని నేర్పుతో ప్రేక్షకులకు అర్థమయ్యే రీతిలో అందించే నైపుణ్యం ఉండాలి. భాష, పదాలపై పట్టు పెంచుకోవాలి.



రిపోర్టింగ్ వివిధ విభాగాలైన క్రైమ్, ఇన్వెస్టిగేటివ్ రిసెర్చ్, బిజినెస్, అంతర్జాతీయ, ప్రాంతీయ, క్రీడా వంటి విభాగాల్లో చేయవచ్చు. దూరవిద్యలో ఇగ్నో 'మాస్టర్స్ ఇన్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్', ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 'ఎంఏ- జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్' కోర్సులను అందిస్తున్నాయి. వీటిని చదవడానికి డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

● **ప్రొ. బి. రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ ట్రాన్స్‌కో

పోస్టు: అసిస్టెంట్ ఇంజినీర్, సబ్ ఇంజినీర్, జూనియర్ లైన్‌మన్
ఖాళీలు: 1604
అర్హత: పదోతరగతి/ ఐటీఐ/ డిప్లొమా/ ఇంజినీరింగ్ డిగ్రీ. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
చివరితేదీ: పోస్టులను అనుసరించి
వెబ్‌సైట్: http://tstransco.cgg.gov.in/

ఎఫ్‌సీఐ గుజరాత్ రీజియన్

పోస్టు: వాచ్‌మన్ (క్లాస్ 4)
ఖాళీలు: 107
అర్హత: ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత
ఎంపిక: రాతపరీక్ష, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ద్వారా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
చివరితేదీ: 29.01.2018
వెబ్‌సైట్: http://fcijobportalgujarat.com/

ఫెలోషిప్స్ అండ్ స్కాలర్‌షిప్స్

టిఫర్ వీఎస్ఆర్‌పీ - 2018

ప్రాజెక్టు: విజిటింగ్ స్టూడెంట్స్ రిసెర్చ్ ప్రోగ్రామ్
కాల వ్యవధి: 2018 మే 7 నుంచి జులై 4 వరకు
స్టైపెండ్: నెలకు రూ.7000
అర్హత: ప్రస్తుతం చదువుతున్న డిగ్రీ లేదా పీజీ అభ్యర్థులు
ఎంపిక: అకడమిక్ మెరిట్, రైటప్, రిఫరీ నివేదికల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **చివరితేదీ:** 28.02.2018
వెబ్‌సైట్: http://www.tifr.res.in/

డీబీటీ - జేఆర్ఎఫ్ 2018

ఫెలోషిప్: జూనియర్ రిసెర్చ్ ఫెలో
అర్హత: బయోటెక్నాలజీ సబ్జెక్టుతో బీఈ/ బీటెక్/ ఎంఎస్సీ/ ఎంటెక్/ ఎంవీఎస్సీ.
వయసు: 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్ (బీఈటీ) 2018 ద్వారా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
ప్రవేశపరీక్ష తేదీ: 18.03.2018
చివరితేదీ: 05.02.2018 **వెబ్‌సైట్:** http://bcil.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

కొలువుల మేలుకొలుపు!

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాలను ఆశిస్తున్న అభ్యర్థులకు 2018 శుభవార్తలు తేనుంది. ఉమ్మడి రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన ఒత్తిడులను ఎదుర్కొని నియామక సంస్థలు రెండు రాష్ట్రాల్లోనూ గాడినపడి నియామకాల ప్రక్రియకు తుది రూపును ఇస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవటానికి అభ్యర్థులు అన్నిరకాలుగా సంసిద్ధం కావాలి!

గ్రూప్స్, డీఎస్సీ, వీఆర్ఓ, వీఆర్ఏ మొదలైన పోస్టులే కాకుండా ఇంజినీరింగ్, శాంతి భద్రతలు, మానవ వనరుల శాఖల నుంచి భారీ సంఖ్యలోనే నియామక ప్రకటనలు వెలువడే అవకాశముంది. ఆశలను నెరవేర్చుకునే క్రమంలో ఆచరణ ఉండాలి. వెలువడిన ప్రతి నోటిఫికేషన్‌కూ స్పందించాల్సిన అవసరం లేదు. మొదట అభిరుచికి ప్రాధాన్యమిచ్చి ఏయే ఉద్యోగాలను సంతోషంగా నిర్వహించగలరో అభ్యర్థి నిర్ణయించుకోవాలి. అందుకు తగిన అర్హతలు తనకు ఉన్నాయో లేదో అని నిర్ణయించుకోవడం తదుపరి చర్య. ఖాళీల సంఖ్య, లభ్యమయ్యే సమయం తరువాత పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు. వీటన్నిటినీ పరిగణించిన తరువాత ఒకటి, రెండు నోటిఫికేషన్లను లక్ష్యంగా ఎంచుకోవాలి. సిలబస్ పరిశీలన, పాత ప్రశ్నపత్రాల అధ్యయనం తరువాతి చర్యలు. సిలబస్‌లోని అనుకూల, ప్రతికూల అంశాలపై దృష్టిపెట్టి ఒక అంచనాకి రావడం...ఆపై చేయాల్సినవి. లభిస్తున్న సమయంలో సిలబస్‌పై పట్టు సాధించగలరా అనేది మరో కీలక నిర్ణయాత్మక అంశం. ఎదురయ్యే సవాళ్లను అంచనా వేయడం లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంకో ముఖ్యాంశం. మెటీరియల్, ఆర్థిక మద్దతు, ఆరోగ్యం, లభించే సమయం లాంటి సవాళ్లపై స్పష్టమైన అవగాహన ఉంటే లక్ష్యాన్ని సాధించడంలో మరో అడుగు పడినట్లే.



కొడాలి భవానీ శంకర్

లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో రెండు పద్ధతులు

1. పెద్ద లక్ష్యాన్ని ఎంచుకోవడం, సాధించడం

ఉదాహరణకు- ఒక అభ్యర్థి డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కావాలి అనుకోవడం. లక్ష్యం పెద్దదైనప్పుడు శ్రమ అధికం, సవాళ్లు కూడా అధికమే. లక్ష్యం చేరలేకపోతే ఎదురయ్యే ప్రతికూలతలు కూడా తీవ్రంగానే ఉంటాయి. అయితే సరైన ప్రణాళిక, శక్తియుక్తులను సరిగా వినియోగించడం చేస్తే గ్రూప్-1 స్థాయి ఉద్యోగాలను మొదటి ప్రయత్నంలో సాధించడం కూడా కష్టమేమీ కాదు.

2. చిన్న లక్ష్యంతో ప్రారంభం - పెద్ద ఫలితం

నిరుద్యోగులకు ముందుగా ఒక ఉద్యోగం అవసరం. ఆర్థిక సమస్యలు కూడా ఉంటే చిన్నదో, పెద్దదో ఒక ఉద్యోగం మరీ అవసరం. ఇలాంటి పరిస్థితులు ఉన్నవారు ముందుగా తేలికగా ఏ ఉద్యోగం చేయవచ్చో కచ్చితంగా నిర్ణయించుకుని ముందస్తుగా దాన్ని సాధించిన తరువాత గ్రూప్-2, 1 ఉద్యోగాలపై దృష్టిని సారించాలి. ఉదాహరణకు- ముందుగా టీచర్/ పంచాయతీ కార్యదర్శి, గ్రూప్-4 ఉద్యోగాలకు పోటీపడి క్రమంగా ఎదుగుతూ ఉండటం. కానీ నోటిఫికేషన్లు క్రమం తప్పకుండా వెలువడే పరిస్థితి లేకపోవడం ఈ వ్యూహానికి ప్రతికూలమని చెప్పవచ్చు.

లోపాలు గుర్తించాలి

ఇప్పటికే 2-3 ప్రయత్నాలు చేసి విఫలమైనవారు



సమీక్షించుకోవల్సిన సమయమిది. 'లోపాలను గుర్తించడం' అనే ప్రక్రియతో సన్నద్ధతను ప్రారంభించాలి.

■ సామర్థ్యానికి తగిన ఉద్యోగాలను ఎంపిక చేసుకోకపోవడం ■ సరైన గైడెన్స్ లేకపోవడం ■ చదివిన మెటీరియల్‌లో లోపాలు ■ విపరీతమైన పోటీ ఉంటుందని పునాదులు లేని అభ్యసనం చేయడం

■ అకడమిక్ ధోరణులనే పోటీపరీక్షల్లో అనుసరించడం ■ సాటి అభ్యర్థుల ప్రభావంతో సరికాని మార్గాల్లో అభ్యసించడం లాంటి లోపాలు ఉండవచ్చు. వీటన్నింటినీ సమీక్షించుకుని శక్తులను సమర్థంగా పునర్వినియోగించే ప్రణాళిక రూపకల్పన జరగాలి.

అభ్యర్థుల అనుభవాలనుబట్టి గ్రూప్ పరీక్షల్లో తరచూ చేసే తప్పిదాలు..

గ్రూప్–1: ■ రాత అభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం. ■ భావవ్యక్తీకరణ పద్ధతులను సరిగా అనుసరించకపోవడం. ■ పాఠ్యగ్రంథాల్లో ఉండే సమాచారాన్ని యథాతథంగా ఉపయోగించడం. ■ కొన్ని సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యమిచ్చి, ఎక్కువ సమయాన్ని కేటాయించి మిగతావాటిని నిర్లక్ష్యం చేయడం.

■ పాఠాలు, ప్రశ్నలను సరైన రీతిలో ఎంపిక చేసుకోకపోవడం. ■ కోచింగ్ సెంటర్ల ప్రభావం వల్ల మూసధోరణిలో సమాధానాలను ఇవ్వడం.

గ్రూప్–2: ■ బిట్స్ రూపంలో చదవడం ■ అవగాహన, విశ్లేషణలకు తక్కువ సమయం కేటాయించడం. ■ ఒకటి, రెండు పుస్తకాలను ప్రామాణికంగా భావించి గుడ్డిగా అనుసరించడం. ■ గణాంకాలకు అధిక ప్రాధాన్యమివ్వడం. ■ ఎకానమీ సబ్జెక్టుకు ఎక్కువ సమయం కేటాయించడం. ■ జనరల్ స్టడీస్‌ను పైపైన చదవడం. ■ సోషల్ మీడియా ప్రభావంతో ఒకే గాటిన చదవడంతోపాటు సమయాన్ని వృథా చేసుకోవడం. ■ మార్కెట్‌లో అసంఖ్యాకంగా పుస్తకాలు లభ్యమవుతుండటంతో ఏది ప్రామాణికమో నిర్ణయించుకోలేకపోవడం.

పెరిగే అసహనం!

గ్రూప్స్‌లాంటి పరీక్షల్లో అభ్యర్థుల మూర్తిమత్వ లక్షణాలు కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా అభ్యర్థుల్లో 'సహనం' చాలా ప్రధానం. రకరకాల సబ్జెక్టులు చదవాల్సి రావడంతో అసహనం పెరుగుతూ ఉంటుంది. ఇష్టమున్నా లేకపోయినా అన్నిరకాల సబ్జెక్టులూ చదవాల్సిందే. ఒకరకంగా అభ్యర్థులకు ఇది సవాలే. అలా అని సబ్జెక్టులు చదివే క్రమంలో అర్థం కాని విషయాలు తీవ్ర అసహనానికి కారణం కావచ్చు. అందువల్ల సహనాన్ని పెంచుకోవాల్సిన అవసరం చాలా ఉంది. గంటల తరబడి చదవాల్సి రావడం, పైగా మొదటి ప్రయత్నంలో చాలా సందేహాలుండటం వల్ల తీవ్ర ఒత్తిడికి గురై 'నిరాశ' ఏర్పడుతుంది. నిరాశ వల్ల పోటీపరీక్షల పరుగులో దాదాపు 70-80 % మంది మొదటి రెండు నెలల్లోనే వైదొలుగుతారు. అలాంటి పరిస్థితి ఏర్పడకూడదనుకుంటే ఎప్పటికప్పుడు స్వీయప్రేరణతో నిరాశను దగ్గరికి రానీయకుండా ఆశావహ దృక్పథంతో ఉండటం మరో తప్పనిసరి లక్షణం. సానుకూల ఫలితాలనిచ్చే పరిసరాలను ఏర్పాటు చేసుకోవడం కూడా తప్పనిసరి. పోటీపడే ఇతర సహచర అభ్యర్థులు కూడా ఇలాంటి ఆశావహ ధోరణిని కలిగివుంటే అది అందరికీ మేలు చేస్తుంది. ఎప్పటికప్పుడు పరిస్థితులను వాస్తవ విశ్లేషణ చేసుకుంటూ తగిన మద్దతు ఇవ్వగలిగిన పోటీదార్లను పక్కన చేర్చుకోవడం కూడా అనుకూల ఫలితానికి తోడ్పడుతుంది. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడులకూ, మానసిక రుగ్మతలకూ గురవుతున్నారో మొన్నటి ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ఘటనలు తెలియజేస్తున్నాయి. పరీక్షల వాయిదా, లీక్‌లు.. ఇలాంటి సమాచారం క్షణక్షణం అభ్యర్థులను కుంగదీశాయి. 'ఏకాగ్రత' లోపించి సరిగా చదవలేకపోయారు. మానసికంగా కుంగిపోయారు. ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు సానుకూల పరిసరాల ఏర్పాటు; సమయం సద్వినియోగమయ్యేలా సబ్జెక్టుల అధ్యయనం అనివార్యం.



ఉద్యోగం	ఏపీపీఎస్సీ/ ఇతర నియామక సంస్థలు	టీఎస్‌పీఎస్సీ/ ఇతర నియామక సంస్థలు
గ్రూప్-1	130కి పైగా	100కి పైగా
గ్రూప్-2	700కి పైగా	900కి పైగా
వీఆర్ఓ, వీఆర్ఏ	3000 దాదాపు	2500 దాదాపు
పంచాయతీ కార్యదర్శులు	3000 దాదాపు	2500 దాదాపు
గ్రూప్-4	900 దాదాపు	1500 దాదాపు
డీఎస్సీ	12,370	8792

గమనిక: కచ్చితమైన ఖాళీల సంఖ్య ప్రభుత్వ ప్రకటనల ద్వారా తెలుస్తుంది.

ఈనాడు బిజినెస్

వివిధ అంతర్జాతీయ సంస్థల అంచనాలు

సూచీ	అంచనా	సంస్థ
సెన్సెక్స్	35700	మోర్గాన్ స్టాన్లీ
సెన్సెక్స్	37500	బీఎన్‌పీ పారిబస్
సెన్సెక్స్	32000	బ్యాంక్ ఆఫ్ అమెరికా
నిఫ్టీ	11880	నొమురా
నిఫ్టీ	11600	గోల్డ్‌మన్ శాక్స్

నిపుణుల మాట

అనిశ్చితి లేనంత వరకూ..



దేశంలో స్థూల, సూక్ష్మ స్థాయిల్లో అవసరమైన పునర్వ్యవస్థీకరణ జరుగుతోంది. ఇప్పటి వరకూ భారత్ ఆర్థిక వ్యవస్థ ఇటువంటి భారీ మార్పులను చూడలేదు. ఈ పరిణామాలు వచ్చే దశాబ్ద కాలంలో మేలుచేస్తాయి. భారత చరిత్రలోనే ఇది సువర్ణాధ్యాయం. భౌగోళిక, రాజకీయ అనిశ్చితి పరిస్థితులు తలెత్తనంత వరకూ మదుపర్లు ఫైనాన్షియల్ మార్కెట్లలో మదుపును కొనసాగించొచ్చు. భవిష్యత్తులో బాగా పెరిగేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లలో మదుపు చేసి కొంత కాలం మర్చిపోతే.. అవి ఎంతో ఆకర్షణీయమైన ప్రతిఫలాలు ఇచ్చే అవకాశం ఉంది. గృహ నిర్మాణం, గృహ నిర్మాణానికి అవసరమైన వాటిని తయారు చేసి విక్రయించే కంపెనీల షేర్లు లాభాలు పంచొచ్చు. వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్న అన్ని విభాగాలకు చెందిన కంపెనీల పనితీరు భవిష్యత్తులో బాగా ఉండొచ్చు. రుణాలు లేని, తక్కువ రుణాలున్న మౌలిక సదుపాయాల కంపెనీలు కూడా బాగా ఉండే వీలుంది. రక్షణ రంగానికి సంబంధించిన కంపెనీల షేర్లలో మదుపు చేసే అంశాన్ని మదుపర్లు పరిశీలించవచ్చు. అప్పుడప్పుడు కొద్దిపాటి దిద్దుబాట్లు మినహా మొత్తం మీద 2018 మార్కెట్‌కు బాగానే ఉండొచ్చు.

-డాక్టర్ ఆర్.ఎం.సి.వి. ప్రసాద్ రావు, ఎండీ, ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్

ఒడుదొడుకుల ప్రయాణం!



కొత్త సంవత్సరంలో మార్కెట్ ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ప్రపంచ మార్కెట్లతోపాటు దేశీయ మార్కెట్ కూడా పెరిగింది. గత పదేళ్లలో పెట్టిన పెట్టుబడులకు సమానంగా ఒక్క 2017లోనే అన్ని పెట్టుబడులు మ్యూచువల్ ఫండ్‌లు మార్కెట్‌లో పెట్టాయి. దీని వల్ల విదేశీ సంస్థాగత మదుపర్లు విక్రయించినా.. మార్కెట్ పడలేదు. అంతర్జాతీయంగా బ్రిటన్, అమెరికాలో వడ్డీరేట్లను పెంచడం మొదలు పెట్టాయి. రానున్న కాలంలో యూరప్ దేశాలు వడ్డీ రేట్లను పెంచే వీలుంది. భారత్‌లో 2018 చివర్లో రేట్లు పెరగడానికి అవకాశం ఉంది. కమోడిటిటీల ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతోంది. వీటి ప్రభావం మార్కెట్‌పై ఉండొచ్చు. 2017లో జరిగిన ఎన్నికల్లో ఫలితాలు మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చాయి. అదే ధోరణి 2018లో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఉండొచ్చు. ఉండకపోవచ్చు. 2019లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. అందువల్ల 2017 స్థాయిలో మార్కెట్ ప్రతిఫలం ఉండొచపోవచ్చు. 2017లో దేశీయ సూచీలు 27 శాతం పెరిగాయి. 2018లో మార్కెట్ పెరిగినా ఈ స్థాయిలో ఉండకపోవచ్చు.

- సతీశ్ కంతేటి, జెన్‌మనీ

2018 స్టాక్ మార్కెట్ సెలవులు

సెలవు	తేదీ	వారం
గణతంత్ర దినోత్సవం	జనవరి 26	శుక్ర
మహాశివరాత్రి	ఫిబ్రవరి 13	మంగళ
హోలీ	మార్చి 2	శుక్ర
మహావీర్ జయంతి	మార్చి 29	గురు
గుడ్ ఫ్రైడే	మార్చి 30	శుక్ర
మహారాష్ట్ర దినోత్సవం	మే 1	మంగళ
స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15	బుధ
బక్రీద్	ఆగస్టు 22	బుధ
వినాయక చవితి	సెప్టెంబరు 13	గురు
మొహరం	సెప్టెంబరు 20	గురు
గాంధీ జయంతి	అక్టోబరు 2	మంగళ
దసరా	అక్టోబరు 18	గురు
దీపావళి	నవంబరు 7	బుధ
దీపావళి బలిప్రతిపద	నవంబరు 8	గురు
గురునానక్ జయంతి	నవంబరు 23	శుక్ర
క్రిస్మస్	డిసెంబరు 25	మంగళ

నవంబరు 7న దీపావళి లక్ష్మీ పూజ సందర్భంగా మూరత్ ట్రేడింగ్ జరుగుతుంది.

పదపదమనీ.. వేటకు





తన బాధ్యతలను 2018 చేతిలో పెట్టి వెళ్లిపోయింది 2017. భారత ఆర్థిక, కార్పొరేట్ రంగాలకు సంబంధించినంతవరకు గత సంవత్సరం ఘనమే. మరి వర్తమానం అంతకంటే అద్భుతంగా ఉండాలన్న ఒకే ఒక ఆశ. ఆర్థిక, కార్పొరేట్, పారిశ్రామిక రంగాలు పరుగులు తీయాలన్నా.. స్టాక్ మార్కెట్ సూచీలు దూకుడు కొనసాగించాలన్నా.. ప్రోత్సాహకర వాతావరణం అత్యవసరం. సంస్కరణల పర్వంలో మోదీ సర్కారు ఏమాత్రం వెనక్కి తగ్గదన్నది నిర్వివాదాంశం. కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ 2017 మాదిరిగానే.. కొత్త సంవత్సరంలోనూ అన్ని విభాగాలు మంచి పనితీరు ప్రదర్శిస్తాయని ఆశిద్దాం. ఇదే జరిగితే మరో ఘనమైన వత్సరాన్ని స్టాక్ మార్కెట్ కళ్లజూస్తుంది. అందుకే ఓ మదుపరీ.. ఒకవేళ గత సంవత్సరపు స్టాక్ మార్కెట్ బస్సు మిస్సయితే ఈసారైనా పదపదమనీ... వేటకు... పిలుస్తోంది 2018... మొదలుపెట్టు ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

రోల్స్‌రాయిస్ ఫాంటమ్ 8

విలాసవంత కార్లు రూపొందించే రోల్స్‌రాయిల్స్ ఫాంటమ్ శ్రేణిలో 8వ తరం కారును ఆగస్టులో విడుదల చేసే అవకాశం ఉంది. దీని ధర రూ.7-9 కోట్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. కొనుగోలుదార్ల అభిరుచికి అనుగుణంగా లోపల ఏర్పాట్లు మార్చుకునే వీలున్న ఈ సౌకర్యవంతమైన కారు 8 స్పీడ్ ఆటోమేటిక్ విభాగంలో లభించనుంది.

పసిడికి మంచి రోజులే..!

అయిదేళ్లుగా పసిడి ధరల్లో పెరుగుదల పెద్దగా లేదు. అంతర్జాతీయ విపణిలో మేలిమి బంగారం ఔన్సు (31.10 గ్రాములు) 1300 డాలర్లకు గత వారంలోనే చేరింది. ఫలితంగా దేశీయంగా 10 గ్రాములు రూ.30,500కు చేరింది. కొత్త ఏడాదిలో వివాహాది శుభకార్యాల ముహూర్తాలు అధికంగా ఉండటం, బ్యాంక్ డిపాజిట్ల నుంచి సొమ్ము పసిడి వైపు వస్తుండటం వల్ల దేశీయంగా 10 గ్రాములు రూ.32,500కు చేరవచ్చనే అంచనాలున్నాయి.



ఇక.. దేశీయ సెల్‌ఫోన్లే

రూ.1.50 లక్షల కోట్లకు చేరిన సెల్‌ఫోన్ విక్రయాల్లో, దేశీయ తయారీ వాటా గణనీయంగా పెరగొచ్చు. సెల్‌ఫోన్లపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) 10 శాతం చేశాక, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం పెరిగింది. దిగుమతులపైనా 10 శాతం కస్టమ్స్ సుంకమే కావడం, దేశీయ తయారీ వల్ల అదనపు ప్రయోజనం లేకపోవడం ఇందుకు కారణం. విదేశీ దిగుమతులపై సుంకాన్ని 15 శాతానికి పెంచడంతో, మళ్లీ దేశీయ తయారీ పెరుగుతోంది. దీన్ని 20 శాతానికి పెంచితే దేశీయంగా మొబైల్ తయారీ తప్పకుండా పెరుగుతుందనే ఆశాభావాన్ని పరిశ్రమ వ్యక్తం చేస్తోంది.



వివిధ బ్రోకరేజీ సంస్థల సిఫారసులు

కంపెనీ	ప్రస్తుత షేరు ధర(రూ.లో)	లక్ష్యం (రూ.లో)	బ్రోకరేజీ సంస్థ
గోద్రేజ్ ఆగ్రోవెట్	579	648	యాక్సిస్ డైరెక్ట్
ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్	1205	1505	యాక్సిస్ డైరెక్ట్
ఎండ్యురెన్స్ టెక్నాలజీస్	1363	1550	యాక్సిస్ డైరెక్ట్
ఎల్అండ్‌టీ	1258	1,450	ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్
గతి	136	158	ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్
టెక్ మహీంద్రా	504	569	ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్
బ్యాంక్ ఆఫ్ బరోడా	161	208	జియోజిత్ ఫైనాన్షియల్
కెన్‌ఫిన్ హోమ్స్	473	612	జియోజిత్ ఫైనాన్షియల్
ఎన్‌బీసీసీ	247	294	జియోజిత్ ఫైనాన్షియల్
యెస్ బ్యాంక్	315	480	కార్వీ
టాటా స్పాంజ్	988	1140	కార్వీ
నాట్కో ఫార్మా	962	1310	కార్వీ
జమ్నా ఆటో	81	95	ఆనంద్ రాఠీ ఫైనాన్షియల్
డాబర్ ఇండియా	350	400	ఆనంద్ రాఠీ ఫైనాన్షియల్
దీపక్ నైట్రేట్	232	264	ఆనంద్ రాఠీ ఫైనాన్షియల్
భారత్ ఎలక్ట్రానిక్స్	182	217	రెలిగేర్ సెక్యూరిటీస్
ఏషియన్ గ్రానిటో	576	642	రెలిగేర్ సెక్యూరిటీస్
నీల్‌కమల్	1837	2,097	రెలిగేర్ సెక్యూరిటీస్
అపోలో టైర్స్	268	305	రిలయన్స్ సెక్యూరిటీస్
కజారియా సిరామిక్స్	729	851	రిలయన్స్ సెక్యూరిటీస్

కొత్త ఏడాదిలో..

యూపీఎల్ లక్ష్యం: రూ.887
యూపీఎల్ అత్యుత్తమ ఆర్అండ్‌డీ సామర్థ్యాలతో ఏటా కొత్త ఉత్పత్తులనూ తెస్తోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల దన్నుతో 18- 19.8% ఎబిటా మార్జిన్‌ను నమోదుచేసింది. ఈ నేపథ్యంలో రూ.887 లక్ష్యంతో కొనుగోలు చేయొచ్చని జియోజిత్ సిఫారసు చేస్తోంది.

హిందాల్కో ఇండస్ట్రీస్ లక్ష్యం: రూ.287
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో హిందాల్కో ఇండస్ట్రీస్ ఎబిటా ఆకర్షణీయంగా 21 % పెరిగింది. లాభదాయకతలో స్థిరత్వం, పటిష్ఠమైన బ్యాలెన్స్ షీట్ తదితరాల కారణంగా షేరును రూ.287 లక్ష్యంతో కొనుగోలుకు జియోజిత్ సిఫారసు చేస్తోంది.

ఇండియన్ బ్యాంక్ లక్ష్యం: రూ.488
మార్చి కల్లా రుణాల వృద్ధి 15 శాతానికి పైగా పెరగొచ్చని అంచనా. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తిని కూడా 6% లోపునకు పరిమితం చేయాలన్నది లక్ష్యం. ఈ నేపథ్యంలో షేరును రూ.488 లక్ష్యంతో కొనుగోలు చేయమని ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్ సూచిస్తోంది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్ లక్ష్యం: రూ.667
ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ మార్కెట్ వాటా 18.3 శాతానికి పెరిగింది. ఇ-కామర్స్ విభాగం ప్రకటనల ఆదాయంలోనూ వృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రూ.667 లక్ష్యంతో ఈ షేరు కొనొచ్చని ఎస్ఎమ్‌సీ సిఫారసు చేస్తోంది.

ఎస్‌బీఐ లైఫ్ లక్ష్యం: రూ.850
బీమా వ్యాపార విస్తరణకు ఉన్న పుష్కల అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఈ సంస్థ ముందు వరుసలో నిలుస్తోంది. అత్యధిక మంది ఖాతాదారులు, అపార నెట్‌వర్క్ దీనిబలం. ఈ నేపథ్యంలో రూ.850 లక్ష్యంతో షేరును కొనుగోలు చేయమని యాక్సిస్ సెక్యూరిటీస్ చెబుతోంది.

భారత్ ఫోర్జ్ లక్ష్యం: రూ.810
సామర్థ్యం పెంపునకు భారత్ ఫోర్జ్ రూ.700 కోట్లను కేటాయించనుంది. హైబ్రిడ్, విద్యుత్ వాహనాల విడిభాగాల తయారీకి ఈ అదనపు సామర్థ్యాన్ని కంపెనీ వినియోగించుకోనుంది. వీటన్నింటి దృష్ట్యా వచ్చే ఏడాది షేరు రూ.810 వరకు వెళ్లే అవకాశం ఉందని జియోజిత్ అంచనా వేస్తోంది.

పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ లక్ష్యం: రూ.217
మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ కార్యకలాపాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.11,148 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. రానున్న త్రైమాసికాల్లో పెద్ద ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేసే అవకాశం కనిపిస్తోంది. అందువల్ల రూ.217 లక్ష్యంతో కంపెనీ షేరును కొనొచ్చని జియోజిత్ సూచిస్తోంది.

స్వరాజ్ ఇంజిన్స్ లక్ష్యం: రూ.2384
మహీంద్రా స్వరాజ్ ట్రాక్టర్లకు ఇంజిన్లను స్వరాజ్ ఇంజిన్స్ తయారుచేస్తుంది. ఎస్ఎమ్ఎల్ ఇసుజు వాహనాలకు కూడా అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఇంజిన్లను సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో కంపెనీ షేరు ఏడాది వ్యవధిలో రూ.2,384 వరకు పెరిగే అవకాశం ఉందని ఎస్ఎమ్‌సీ భావిస్తోంది.

ఇంజినీర్స్ ఇండియా లక్ష్యం: రూ.239
2017 సెప్టెంబరు చివరినాటికి కంపెనీ వద్ద రూ.8881 విలువైన ఆర్డర్లు ఉన్నాయి. గంగా శుద్ధికరణకు తలపెట్టిన నమామి గంగా పథకం లాంటి మౌలిక సదుపాయ ప్రాజెక్టుల్లోనూ కంపెనీ అడుగుపెట్టబోతోంది. అందువల్ల రూ.239 లక్ష్యంతో షేరును కొనొచ్చని ఎస్ఎమ్‌సీ సూచిస్తోంది.

ఎస్కార్ట్స్ లక్ష్యం: రూ.829
ట్రాక్టర్లలో సాంకేతికత నవీకరణ, కొత్త ఉత్పత్తుల విడుదల ద్వారా 2017-18 తొలి అర్ధభాగంలో అమ్మకాలను 20% ఎస్కార్ట్స్ పెంచుకుంది. వ్యవసాయ సామగ్రికి ప్రభుత్వ ప్రోత్సాహం కంపెనీకి కలిసొచ్చే మరో అంశం. వీటిని పరిగణనలోకి తీసుకొని రూ.829 లక్ష్యంతో షేరును కొనొచ్చని జియోజిత్ సిఫారసు చేస్తోంది.


6

బడ్జెట్ ప్రజారంజకమైతే



2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టబోయే చివరి పూర్తి బడ్జెట్ కావడంతో ప్రజాకర్షణపై కేంద్రం దృష్టి సారించొచ్చు. గుజరాత్ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకొని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వొచ్చు. అందుబాటు గృహ నిర్మాణం, రహదారి, విద్యుత్ ప్రాజెక్టులు సహా మౌలిక రంగ వృద్ధికి అధిక నిధులు కేటాయించే అవకాశం ఉంది. దీనికి తోడు ఎన్నికల నేపథ్యంలో ప్రజల మెప్పు పొందేందుకు కేంద్రం ప్రయత్నిస్తే అది మార్కెట్‌కు సానుకూలమే.

ఎన్ని'కలల' పైనే



ఈ ఏడాది కర్ణాటక, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల ఎన్నికల రూపంలో సెమీఫైనల్ పోరును భాజపా ఎదుర్కోబోతోంది. వీటిల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవడం భాజపాకు అవసరం. అదే సమయంలో కర్ణాటకలో కాంగ్రెస్ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవడమూ ముఖ్యమే. ఒకవేళ ఈ నాలుగు రాష్ట్రాల్లో ఫలితాలు భాజపాకు అనుకూలంగా రాకుంటే... మార్కెట్‌పై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడుతుందన్నది విశ్లేషకుల మాట.

జీఎస్‌టీ సద్దుమణిగేనా

జీఎస్‌టీ అమల్లోకి వచ్చి 6 నెలలు పూర్తయినా చిక్కుముడులు వీడలేదు. ఓ వైపు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తోంది. పన్ను రేట్ల సవరణ, చట్టంలో మార్పు చేర్పులు, నిబంధనల వాయిదాల ద్వారా పరిస్థితిని చక్కదిద్దుతోంది. ఇన్ని చేసినా ప్రజలకు పన్ను రేట్ల ప్రయోజనం పూర్తిగా స్థాయిలో చేరడం లేదు. యాంటీ ప్రాఫిటరింగ్ వ్యవస్థ కార్యకలాపాలు ప్రారంభమైతేనైనా ఈ పరిస్థితిలో మార్పు వస్తుందేమో. జీఎస్‌టీకి సంబంధించి ఈ సవాళ్లన్నీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తేనే మదుపర్ల విశ్వాసం మరింత పెరుగుతుంది.

ఆర్థిక ఫలితాలు ఏ దిశగా..

పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ లాంటి సవాళ్లు ఎదురైనప్పటికీ మొత్తం మీద గతేడాది కంపెనీల ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగానే ఉన్నాయి. జీఎస్‌టీ ప్రతికూలతలు తగ్గుతుండటంతో కొత్త ఏడాది లోనూ ఈ ధోరణి కొనసాగొచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఊహిస్తున్నట్లుగానే బడ్జెట్లో గ్రామీణ ప్రాంతాలు, మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తే.. ఈ రంగాలతో సంబంధమున్న కంపెనీలు మరింత రాణిస్తాయి. అయితే రూపాయి, ముడి చమురు, అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా నిర్ణయాలు ఆయా రంగాలపై ప్రభావం చూపిస్తాయి.

చమురు 'ధరల' సెగ



కొత్త ఏడాదిలో దేశ ద్రవ్యోల్బణాన్ని అంతర్జాతీయ ముడి చమురు ధరలు శాసించే అవకాశం కనిపిస్తోంది. చమురు ఉత్పత్తిని తగ్గించేందుకు కుదుర్చుకున్న ఒప్పంద గడువును ఒపెక్ దేశాలు పొడిగించడంతో మున్ముందు చమురు ధరలు పెరగొచ్చు. ఇది ఇబ్బందికరమే. గతేడాది ప్రారంభంలో 55 డాలర్ల వద్ద ఉన్న బ్యారెల్ ముడి చమురు ధర.. ప్రస్తుతం 66 డాలర్ల వద్ద కదలాడుతోంది. అయితే అమెరికా షెల్ ఉత్పత్తిని పెంచితే ధరల పెరుగుదల పరిమితంకావచ్చు.

కొరి'యాతన' సశేషమా



ప్రపంచ మార్కెట్లను ఉత్తరకొరియా భయాలు వదిలేలాలేవు. అమెరికా బ్లాక్‌మెయిల్ మానేవరకు అణుపరీక్షలు కొనసాగిస్తామని ఉత్తరకొరియా తాజాగా వ్యాఖ్యానించడం ఇందుకు కారణం. కిందటేడాది కొరియా ఉద్రిక్తతల ప్రభావం ఒకటి రెండు సందర్భాలు తప్ప మన మార్కెట్‌పై ఎక్కువగా కనిపించలేదు. అయితే కొరియా కవ్వింపు చర్యలకు అమెరికా కళ్లెం వేయాలని భావిస్తే ఉద్రిక్తతలు తీవ్రరూపం దాలుస్తాయి. ఇదే జరిగితే ప్రపంచ మార్కెట్లు భారీ కుదుపునకు లోనుకావచ్చు.



గంటలు.. గడియారాలు.. అవే!
కానీ కాలం వేగంగా మారిపోతోంది!!
గంటకు అన్నే నిమిషాలు, అన్నే సెకన్లు..
కానీ క్షణక్షణానికీ జీవితం మారిపోతోంది!!

పైన చూస్తే డ్రోన్లు.. కింద చూస్తే డ్రైవర్లు లేని కార్లు..
ట్యూబుల్లో సర్రున దూసుకుపోయే రైళ్లు..
హలో అంటే సలాం కొట్టే డిజిటల్ పీఏలూ..
అడుగడుగునా అడ్డుపడే రోబోలు..
కొరత లేనంత కృత్రిమ రక్తం.. వ్యాయామం అక్కర్లేని మాత్రలు..
క్లాస్‌రూముల్లేని చదువులు.. వెలవెలపోయే డిగ్రీలు..
నేల చాలని నగరాలు.. మిద్దెల మీదే సేద్యాలు..

ఉఫ్‌ఫ్‌ఫ్....

గుక్కతిప్పుకోనివ్వనంత వేగంగా.. కళ్లు చెదిరిపోయేంత బలంగా.. కాలం ముందెన్నడూ లేనంత కొత్తగా మారిపోతోంది. కంప్యూటర్ విప్లవాలు మానవ జీవితాన్ని అన్ని వైపులా ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.. అన్ని రంగాలనూ అనూహ్యంగా మలుపులు తిప్పుతున్నాయి. ఈ కొత్త సంవత్సర ఘడియల్లో ముమ్మందు మన జీవితాలు ఎన్ని రకాలుగా.. పరవళ్లుతొక్కబోతున్నాయో.. చూద్దాం రండి!!

రేపటి మన చిత్రమ్




కొత్త కోలాహలం

జింగ్-జిన్-జి(జేజేజే)



మానవ చరిత్రలోనే అత్యంత భారీ నగర నిర్మాణాన్ని చైనా ఈ ఏడాదే పూర్తిచేస్తోంది. బీజింగ్, తియాంజిన్, హుబేయ్‌ల చుట్టుపక్కలున్న 7 నగరాలను కలిపేస్తూ, 13 కోట్ల మంది నివసించేలా ఏర్పాటవుతున్న ఈ 'జింగ్-జిన్-జి' బృహన్నగరం విస్తీర్ణం 1,32,000 చ.కి.మీ.

కొత్త కు.ని.



పురుషుల కోసం కుటుంబ నియంత్రణ బిళ్లలు, క్రీములు ఈ 2018లోనే మార్కెట్లోకి రానున్నాయి. స్త్రీలకు–రిమోట్‌తో పనిచేసే కు.ని. ఇంప్లాంట్ వస్తోంది. చర్మం కింద పెట్టే ఈ చిప్ నుంచి లివనోర్‌జెస్ట్రాల్ హార్మోను 16 ఏళ్లపాటు స్వల్పంగా విడుదల అవుతుంటుంది. వద్దనుకుంటే ఎప్పుడైనా రిమోట్‌తో ఆపేయొచ్చు.

లండన్ సబ్‌వే



లండన్‌లో కొత్తగా నిర్మిస్తున్న 118 కి.మీ. సబ్‌వే మార్గం 'క్రాస్ రైల్' ఈ 2018లోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. గ్రేటర్ లండన్, బెర్క్‌షైర్, బకింగ్‌హామ్‌షైర్, ఎసెక్స్‌లను కలుపుతూ, 40 కొత్త స్టేషన్లతో నిర్మిస్తున్న ఈ లైన్ నిర్మాణ వ్యయం 1500 కోట్ల పౌండ్లు.

వైఫై



ప్రపంచ జనాభాలో ప్రతి 20 మందికి ఒక వైఫై హాట్‌స్పాట్ సిద్ధమైపోతోంది. ప్రపంచంలో ఇప్పుడున్న 5 కోట్ల వైఫై హాట్‌స్పాట్లు ఈ ఏడాది ఏకంగా 34 కోట్లకు పెరుగుతాయి.

ఫిఫా



నాలుగేళ్లకోసారి ప్రపంచం మొత్తాన్నీ ఉరకలెత్తించే అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫిఫా వరల్డ్ కప్ ఈ 2018లో కనువిందు చేయబోతోంది. ఈ సారి దీనికి రష్యా వేదిక అవుతోంది.

ఒక్కసారి ఊహించుకోండి. మీరు విమానంలో కూర్చున్నారు! అందులో పైలెట్ లేరు. ఆ మాట కొస్తే ఎయిర్‌హోస్టెస్‌లూ లేరు. సమయానికి కాఫీటీల వడ్డనలన్నీ అయిపోతున్నాయి. ప్రయాణం ఎంత ఎత్తులో సాగుతోంది, భూమిపై ఉష్ణోగ్రత ఎంత ఉంది.. తదితర వివరాలన్నీ సిబ్బంది కాకుండా.. విమానంలోని కంప్యూటర్లే చెప్పేస్తున్నాయి. ఎలాంటి అవాంతరాల్లేకుండా విమానం కిందికి దిగింది. మీ సామాన్లు వాటంతట అవే చేరాల్సిన చోటికి చేరిపోతున్నాయి. మీరు బుక్ చేసిన వెంటనే.. ప్రయాణికుల పికప్ ప్రాంతానికి ఓ డ్రైవర్ రహిత కారు వచ్చి.. మీకు సాదరంగా స్వాగతం పలికింది. ఎలాంటి కుదుపూ



రవాణా

గాల్లో తేలినట్టుందే..!

- సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాల జోరు
- అడుగడుగునా డ్రోన్లు

లేకుండా మీ గమ్యానికి తీసుకువెళ్లిపోయింది. ఇదంతా ఏదో సినిమా అనుకునేరు.. ఓ 7-8 ఏళ్లలోనే ప్రపంచ రవాణా రంగంలో చోటుచేసుకోబోతున్న విప్లవాత్మక పురోగతి ఇది. చోదకులు లేకుండా తనకు తానుగా ప్రయాణించే (సెల్ఫ్ డ్రైవింగ్) కార్లు, ట్రక్కులు, విమానాలు వాస్తవరూపంలోకి వచ్చేస్తున్నాయి. ఈ 2018లోనే ఈ దిశగా పెద్ద ముందడుగులు పడబోతున్నాయి. దిగ్గజ కంపెనీలన్నీ ఇప్పుడీ స్వయంచాలిత వాహనాలపై(ఆటోమేటిక్ వెహికిల్స్-ఏవీ) భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ ఏవీలు ముందుగా క్యాబ్‌లు, వాణిజ్య వాహన రంగాల్లోకి వేగంగా చొచ్చుకొచ్చేస్తున్నాయి. మరో రెండేళ్లలో.. అంటే 2020 నుంచే ఇవి వాణిజ్యపరంగా అందరికీ అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. 2040-45 నాటికి సాధారణ వాహనాలన్నీ కనుమరుగు కావడం ఖాయం. డ్రోన్లతో వస్తువులు, సరుకుల పంపిణీ ఇప్పుడిప్పుడే మొదలవుతోంది, ఈ డ్రోన్లు మరిన్ని రంగాలను ఆక్రమించటం తథ్యం.

కొంత తేలిక, కొంత కష్టం

ఏవీలతో మానవ తప్పిద ప్రమాదాలుండవు. ఇవి వాహనానికి వాహనానికి మధ్య తగినంత ఎడం పాటిస్తాయి. అయితే దీనివల్ల ఇరుకు రోడ్ల మీద ప్రయాణం కష్టం. ప్రయాణ సమయం బాగా తగ్గుతుంది. సెన్సర్లు, వైఫై, జీపీఎస్‌లాంటివన్నీ అనుసంధానమై ఉంటాయి కాబట్టి ఈ వాహనాల ఖరీదెక్కువే. మరీ ముఖ్యంగా వీటివల్ల లక్షల మంది వాహన చోదకులు ఉపాధిని కోల్పోతారు. ఇప్పుడున్న బస్సులు, కార్లు, సబ్‌వేలు, మెట్రో రైళ్లు.. ప్రజా రవాణా వ్యవస్థల ఆదాయాలు గణనీయంగా తగ్గి, అవి మనుగడ కోల్పోవచ్చు.

డిజిటల్ చదువులు

- వర్చువల్ తరగతి గదులు
- 'బ్లెండెడ్ స్కూల్' వ్యాప్తిలోకి
- డిగ్రీలకు కాలం చెల్లు



డిగ్రీలకన్నా ఉద్యోగాల్లో నైపుణ్యాలకే' ప్రాధాన్యం, వాటికే డిమాండు ఎక్కువ కాబట్టి... విద్యా సంస్థలు ఆయా అంశాలపైనే దృష్టి పెట్టనున్నాయి.

విద్య

విద్యలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. వర్చువల్ రియాలిటీ తరగతి గదులు, కృత్రిమ మేథతో రూపొందించిన పాఠ్య ప్రణాళికలు కీలకంగా మారతాయి. డిగ్రీలకు కాలం చెల్లిపోతుంది. భవిష్యత్ అవసరాల్ని దృష్టిలో ఉంచుకుని.. బోధన, పఠనంలో గుణాత్మక మార్పులు వస్తాయి. తరగతి గదిని డిజిటల్ పరికరాల్తో అనుసంధానించడం తప్పనిసరి. క్లాసుల్లో కొంత భౌతికంగా బోధించటం, మరికొంత డిజిటల్‌ను ఆశ్రయించటం.. ఈ రెండూ కలగలిసిన 'బ్లెండెడ్ స్కూల్' అనే సరికొత్త భావన విస్తృతంగా వ్యాప్తిలోకి రాబోతోంది. ఇక ఉపాధ్యాయులకు విజ్ఞానంపై గుత్తాధిపత్యం ఉండదు. ఆ పనిని సెర్చ్ ఇంజన్లు, ఉచిత ఆన్‌లైన్ కోర్సులే చేసిపెట్టేస్తుంటాయి.

జనరేషన్–ఎక్స్ కోసం బోధన

2000-2020 మధ్య పుట్టిన వాళ్లని జనరేషన్-ఎక్స్ అంటున్నారు. 2020 నాటికి వీళ్లే 200 కోట్లకు చేరుకుంటారు. వీళ్లు మనసును దేనిమీదైనా కేవలం 8 సెకన్లు మాత్రమే లగ్నం చేస్తారని అంచనా. భారీ డేటాను గుర్తుంచుకునే, సంక్లిష్ట సమస్యలను ఛేదించే సామర్థ్యం వీరికి తక్కువ. మనసు భిన్న అంశాల వైపు మళ్లిపోతుంటుంది. కాబట్టి వీళ్లకి సంప్రదాయ బోధనా పద్ధతులు పనికిరావు, వీరికోసం అధునాతన విధానాలు తప్పవు. ఉపాధి అవకాశాలూ మారిపోతున్నాయి కాబట్టి జీవితాంతం అభ్యాసం అనివార్యం.

డిగ్రీలకు విలువుండదు

విశ్వవిద్యాలయ, కాలేజీ డిగ్రీలు విలువ కోల్పోనున్నాయి. డిగ్రీలకన్నా ఉద్యోగాల్లో అభ్యర్థుల 'నైపుణ్యాలకే' ప్రాధాన్యం, వాటికే డిమాండు ఎక్కువ కాబట్టి... విద్యాసంస్థలు కూడా ఆయా అంశాల బోధనపైనే మరింత దృష్టిపెట్టనున్నాయి. బోధన, పఠనం, ప్రాజెక్టులు, పరీక్షల వంటివాటన్నింటినీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించే స్టార్టప్‌లు పెరుగుతాయి. విద్యకు అయ్యే ఖర్చు కూడా విపరీతంగా పెరగనుందని అంచనా. మెషీన్ ఆటోమేషన్ కారణంగా.. ఇప్పుడున్న ఉద్యోగాల్లో 47% అంతరించిపోతాయన్న వాదన ఉంది. ఉద్యోగ, కార్మిక మార్కెట్‌ను నెమ్మదిగా రోబోలూ, కంప్యూటర్లూ ఆక్రమించుకుంటున్నాయి. అసలు కొన్నిచోట్ల వృత్తి నిపుణులే లేకుండా పూర్తి యంత్రాలే కనిపించొచ్చు. దీనివల్ల ఫలానా వృత్తి జీవితకాలం ఉపాధి కల్పిస్తుందన్న హామీలేం ఉండవు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని.. కాలం చెల్లిన బోధనా పద్ధతులకు స్వస్తిపలికి, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు సిద్ధం కావటం అనివార్యం!

జనరేషన్–ఎక్స్ పిల్లలే 2020 నాటికి 200 కోట్లకు చేరుకుంటారు. వీళ్లు మనసును దేనిమీదైనా కేవలం 8 సెకన్లు మాత్రమే లగ్నం చేస్తారని అంచనా.

రాజకీయాల్నీ శాసిస్తాయ్

నగరాలు

- అత్యధిక సంపద సృష్టి ఇక్కడే

ఇకపై ప్రపంచ దేశాల భవిష్యత్తును నగరాలే నిర్ణయించబోతున్నాయి! ప్రపంచవ్యాప్తంగా నగరాల ప్రభావం అనూహ్యంగా పెరిగిపోతోంది. ముఖ్యంగా మన ఎన్నికలను, రాజకీయాలను, పార్టీల-నేతల తలరాతల్ని నగరాలే లిఖించబోతున్నాయి. ప్రపంచంలో అత్యధిక సంపద సృష్టి నగరాల్లోనే జరగబోతోంది. అంతేకాదు, వివిధ దేశాల మధ్య పెట్టుబడులను, ప్రజల, ఆలోచనల ప్రవాహాలను నిర్ణయించేది కూడా ఇకపై నగరాలే. మౌలిక సదుపాయాలు, జీవనోపాధి అవకాశాలు, సౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో పల్లెలు కదలిపోతూ.. పట్టణీకరణ విస్తృతమైపోతోంది. 2018లో ఈ పట్టణీకరణ, వలసల చరిత్ర కొత్తపుంతలు పోబోతోంది. ఈ పట్టణీకరణ వ్యాప్తి, ఒత్తిడిని తట్టుకునేందుకు చైనాలాంటి కొన్ని దేశాలు ఏకంగా కొత్త నగరాల్నే నిర్మించి, ఈ 2018లోనే వాటిని ప్రారంభించబోతున్నాయి. మరికొన్ని దేశాలు ప్రస్తుత నగరాల్నే విస్తరించే ప్రణాళికల్లో ఉన్నాయి.

వచ్చే 30-40 ఏళ్లలో పట్టణీకరణను ఊహిస్తే విస్తుబోయే అంచనాలు మన కళ్లముందు కదలాడతాయి. ఇప్పటికే ప్రపంచంలోని ప్రతి 10 మందిలో ఐదుగురు నగరాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి ప్రతి 10 మందిలో 9 మంది నగరాల్లోనే ఉంటారని అంచనా.

- 2050 నాటికి ఆసియా, ఆఫ్రికాల్లో దాదాపు 90 శాతం జనాభా నగరాలు, వాటి శివార్లలోనే ఉంటుంది. ఈ వృద్ధి అంచనాల్లో భారత్, చైనా, నైజీరియాల వాటా దాదాపు 37 శాతం ఉంటుంది.

2045 నాటికి ప్రపంచ పట్టణ జనాభా 600 కోట్లు దాటుతుందని అంచనా.

మెగా సిటీలు

2014 నాటికి ప్రపంచవ్యాప్తంగా 28 మెగాసిటీలు (కోటి జనాభా) ఉండగా.. 2030కి 41కి పెరగొచ్చని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఎక్కువగా ఆసియా నగరాలే ఉంటాయి.

గ్రాఫిక్స్: బాలు


మైక్రోచిప్‌కు మహా సలాం!

కంప్యూటర్లు మన జీవితాల్ని పూర్తిగా ఆక్రమించేశాయి. ఇక వీటిని మనం ఎంత తెలివిగా వాడతామన్న దాని మీదే మన భవిత ఆధారపడి ఉంటుంది. మైక్రోచిప్‌ల రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులతో కంప్యూటర్లూ.. దాంతోపాటే మన జీవితం.. సమూలంగా మారిపోతున్నాయి.

- మౌస్‌లు మాయం
- యూఎస్‌బీలు పోవటం ఖాయం
- మనకో 'డిజిటల్ సహాయకులు' సిద్ధం

కంప్యూటర్లకు గుండె కాయ మైక్రోచిప్‌లు. ఇప్పటి వరకూ వీటిని సిలికాన్‌తో చేస్తున్నారుగానీ.. ఇక దాని స్థాయి సరిపోయేలా లేదు. కాబట్టి గ్రాఫైట్‌తో చేసిన కార్బన్ నానోట్యూబులు వచ్చేస్తున్నాయి, ఇవి నేటి అత్యాధునిక కంప్యూటర్ వేగాన్ని 5 రెట్లు పెంచేయబోతున్నాయి. ఆ తర్వాత కాంతివేగంతో పనిచేసే ఫోటాన్లతో ఆప్టికల్ కంప్యూటింగ్.. తెరపైకి వస్తోంది. మరోవైపు అసలీ ట్రాన్సిస్టర్‌లను పూర్తిగా పక్కనబెట్టేసి అచ్చం మనిషి మెదడులాగే పనిచేసే 'మెమ్రిస్టర్స్' రాబోతున్నాయి. ఇవి మైక్రోచిప్‌ల కంటే ఇంకా ఇంకా సూక్ష్మంగా ఉండొచ్చు.. వీటితో మనం లైటు తీసి వేసినట్టే కంప్యూటర్లనూ ఆన్ చేసి, ఆఫ్ చెయ్యొచ్చు. ఇవి కోట్ల రెట్ల సమాచారాన్ని తేలికగా నిక్షిప్తం చేసేసుకుంటాయి. ఇక బిట్ల స్థాయి దాటిపోయి క్యూబిట్లతో పనిచేసే క్వాంటమ్ కంప్యూటర్లు ఎలాగూ కోట్ల గణితాలను, గణాంకాలను క్షణాల్లో చేసెయ్యటానికి సిద్ధమవుతూనే ఉన్నాయి. వీటన్నింటి ఫలితంగా కంప్యూటర్ల వేగం, వాటి తీరు, స్టోరేజీ వంటివన్నీ సమూలంగా మారిపోతాయి.

- **స్టోరేజీ విప్లవం:** ప్రతివ్యక్తికీ ఫోటోలు, డాక్యుమెంట్ల రూపంలో బోలెడంత డిజిటల్ సమాచారం తయారై, నిల్వ అవసరం పెరుగుతోంది. ఇప్పటికే టెరాబైట్ల కొద్దీ సమాచారాన్ని నిల్వ చేసే యూఎస్‌బీలున్నాయిగానీ క్లౌడ్ కంప్యూటింగ్ పెరిగిపోతున్న నేపథ్యంలో వచ్చే రెండుమూడేళ్లలో అస్సలు ఈ యూఎస్‌బీల అవసరమే ఉండదు. స్టోరేజీ అంతా నెట్ అనుసంధానంగా క్లౌడ్‌లోనే ఉంటుంది కాబట్టి మన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్ వంటివన్నీ ప్రత్యేకించి స్టోరేజీ అనేదే లేకుండా వచ్చేస్తాయి.



కంప్యూటర్లు

- **వేగం:** క్లౌడ్‌తో అనుసంధానమై, మనం ఏ భాషలో మాట్లాడినా క్షణాల్లో అనువాదం చేసి వినిపించేసే స్మార్ట్ ఇయర్‌ప్లగ్స్ వచ్చేస్తున్నాయి. ఇల్లు, ఇంట్లో ప్రతి వస్తువూ నెట్‌తో అనుసంధానమయ్యే ఉంటుంది. (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) ఫ్రిజ్జులోకి మనం కొనాల్సిన వస్తువులేమిటో ఫ్రిజ్జే మనకు జాబితా పంపేస్తుంది. సూపర్ మార్కెట్లో బిల్లింగ్ క్యూలూ ఉండవు. వస్తువు తీసుకుని బయటకు వచ్చేస్తుండగానే బిల్లు డబ్బులు మన ఖాతా నుంచి వెళ్లిపోతాయి. బయట సెల్ఫ్ డ్రైవింగ్ కార్ డిక్కీలూ, డోర్లూ తెరుచుకుని సిద్ధంగా ఉంటుంది. మరోవైపు క్వాంటమ్ కంప్యూటర్లు మన 'స్ట్రాంగ్ పాస్‌వర్డ్'లను కూడా క్షణాల్లో కనిబెట్టెయ్యొచ్చు. హ్యాకింగ్ తేలికైపోయి సైబర్ యుద్ధాలూ రేగొచ్చు. దీంతో చాలా కంపెనీలు ఇంటర్నెట్‌కు దూరంగా ఉంటూ.. మళ్లీ మాన్యువల్ వ్యవహారాలకు మళ్లిపోవాల్సి వస్తుందా.?? చెప్పలేం!!

మనం ఏ డిజిటల్ సమాచారాన్ని వ్యక్తిగతంగా దాచుకోవాల్సిన అవసరం ఉండదు కాబట్టి చివరికి ఇంటర్నెట్ అనేది కనీస మానవ హక్కుగా కల్పించాల్సిన అవసరం వచ్చేస్తుంది.

- **మారుతున్న రూపం:** టచ్‌స్క్రీన్‌లు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇక డెస్క్‌టాప్ మౌస్‌లు మాయమైపోబోతున్నాయి. చేతితో తాకటం కూడా పోయి.. 'ఓపెన్ ఎయిర్ గెశ్చర్ కంట్రోల్' వచ్చేస్తోంది. దాని ముందు చేతులు, వేళ్లు కదిపితే చాలు.. పని చేసేస్తుంది. ఇదే మరికాస్త విస్తరించి టీవీలూ, ఫ్రిజ్జుల వంటివాటన్నింటినీ మన నోటి మాటతో పని చేయించే రోజు వచ్చేస్తోంది. మనకంటూ ఒక 'వర్చువల్ అసిస్టెంట్' సిద్ధంగా ఉండే రోజు దగ్గర్లో ఉంది. 2030 నాటికి నోరు తెరవాల్సిన పని లేకుండా 'బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' సాయంతో ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారానే మనిషీ మనిషీ ఆలోచనలు, అనుభవాలు, జ్ఞాపకాలు పంచుకోవటం సాధ్యమేనన్నది ఇప్పటి భావన.

కొత్త రక్తం

- కృత్రిమ రక్తం తయార్
- వస్తోంది వ్యాయామ మాత్ర
- క్యాన్సర్‌పై యుద్ధానికి టీకా

వైద్యం

అద్భుతాలనకూడదుగానీ.. మన వైద్య, ఆరోగ్య రంగంలో ఒకటిరెండు ఏళ్లలో ఆశ్చర్యకరమైన మార్పులు మాత్రం తథ్యం! వైద్య పరిశోధనలపై ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు తక్కువే అయినా.. వివిధ శాస్త్ర, సాంకేతిక విభాగాల్లో జరుగుతున్న పరిశోధనలు చూస్తే త్వరలో మనం ఇప్పటి వరకూ చూడని సరికొత్త సంగతులు వినటం ఖాయమని అర్థమవుతోంది.

దానాలకు చెల్లు: మన ఆధునిక వైద్య పరిశోధనా రంగం ఎంత అభివృద్ధి చెందినా ఇన్నేళ్లుగా మనకు 'రక్తం' అన్నది పెద్ద సమస్యగానే ఉంటోంది. త్వరలోనే దీనికి విరుగుడుగా 'కృత్రిమ రక్తం' రాబోతోంది. దీన్నే 'సింథటిక్ బ్లడ్' అని కూడా అంటున్నారు. ఇది వస్తే ప్రయోగశాలల్లోనే భారీ ఎత్తున మనకు కావాల్సిన గ్రూపు రక్తాన్ని తయారుచెయ్యొచ్చు. ఫ్రిజ్జులాంటి వాటిలో పెట్టాల్సిన అవసరం లేకుండానే దాన్ని రెండేళ్ల వరకూ నిల్వ కూడా చేసుకోవచ్చు. అంబులెన్సుల్లో, ఆసుపత్రుల్లో, అత్యవసర ప్రదేశాల్లో సిద్ధంగా పెట్టొచ్చు. ఇంకా చాలా చెయ్యొచ్చు.

క్యాన్సర్‌ను టీకాతో జయిస్తాం: నానా రకాల అంటువ్యాధులను మనం జయించినా ఈ ఆధునిక కాలంలో క్యాన్సర్ పెను ముప్పుగానే ఉంటోంది. ప్రస్తుత చికిత్సా విధానాలన్నీ కూడా క్యాన్సర్‌ను తగ్గించటం మాట అటుంచి ముందు బోలెడన్ని దుష్ప్రభావాలతో భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ఇన్ని ఇబ్బందుల్లేకుండా క్యాన్సర్‌ను తేలికగా తుదముట్టించి, ఓడించే టీకాలు సిద్ధమవుతున్నాయన్నది తాజా సమాచారం. ముఖ్యంగా మనల్ని ముప్పతిప్పలు పెడుతున్న హెచ్ఐవీ, హెర్పిస్ వంటి వైరస్‌లకే జన్యు ఇంజినీరింగ్ ద్వారా మార్పులు చేసి.. వాటినే క్యాన్సర్ కణాల మీదికి అస్త్రాల్లా వదలటం ఈ విధానం ప్రత్యేకత. తర్వాత క్యాన్సర్ కణాలపై మనలోని రోగనిరోధక వ్యవస్థే దాడి చేసేలా తర్ఫీదునివ్వటమనే 'ఇమ్యూనో థెరపీ' పైనా పెద్దఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. అటు టీకాలూ, ఇటు ఇమ్యూన్‌థెరపీ.. రెండూ త్వరలోనే సిద్ధం కానున్నాయి. వీటితో క్యాన్సర్‌పై విజయం ఖాయం.



పుట్టగానే భవిష్యత్తు: అసలు బిడ్డ పుట్టగానేనే (కావాలంటే అంతకు పూర్వమే) ఒక బొట్టు రక్తం తీసుకుని, దాన్ని విశ్లేషించటం ద్వారా బిడ్డ ఆరోగ్య స్థితి ఎలా ఉండబోతోంది, జన్యుపరంగా ఏయే సమస్యలకు గురయ్యే అవకాశం ఉందో గుర్తించి అప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకునే అవకాశం రాబోతోంది. రోగులకు సంబంధించిన జన్యువులను విశ్లేషించి.. వారికి సమర్థంగా పనిచేసే మందులు ఇవ్వటం (పర్సనలైజ్డ్ హెల్త్‌కేర్) పోయి, మరింత కచ్చితత్వంతో మందులిచ్చే (ప్రిసిషన్ హెల్త్‌కేర్) రోజు వస్తోంది. దీని ద్వారా.. జబ్బు రాకముందే దానికి మందులు ఇచ్చేయొచ్చు.

వ్యాయామ మాత్ర: ముఖ్యంగా మనం ఒళ్లు ఏమాత్రం వంచాల్సిన అవసరం లేకుండానే ఒక్క మాత్ర వేసుకుని.. మొత్తం వ్యాయామం ఫలితాలన్నీ పొందే వీలుందా? 'ఎక్సర్‌సైజ్ ఇన్ ఎ పిల్' అని పిలుస్తున్న ఈ మాత్రల పరిశోధనలన్నీ త్వరలోనే ఒక కొలిక్కి రాబోతున్నాయి. వ్యాయామం చేసినప్పుడు మన శరీరంలో ఎలాంటి ఎంజైములు విడుదల అవుతాయో, జీవక్రియలు ఎలా ప్రభావితమవుతాయో.. అవన్నీ అచ్చం అలాగే జరిగేలా ఈ మాత్రలను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మిలీనియం బిడ్డలొస్తున్నారు!

- కొంగొత్త అవకాశాల వైపు అడుగులు
- పాలనలో యువతదే కీలకం
- వృద్ధతరం భారం!

యువతరం

జనాభా విస్ఫోటం ప్రపంచ యవనికపై కొత్త సమీకరణాల్ని సృష్టిస్తోంది. 2000, ఆ తర్వాత పుట్టిన సహస్రాబ్ది బిడ్డలు (జనరేషన్-ఎక్స్) ఉరకలేసే యువరక్తంతో చక్రం తిప్పేందుకు ముందుకు రాబోతున్నారు. వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో ఈ నవతరమే అన్ని స్థాయుల్లో నాయకత్వాలను అందిపుచ్చుకోనుంది. 2020ల మధ్యనాటికి ఈ తరం రాజకీయ పగ్గాలు చేపట్టి... ప్రభుత్వాల రూపురేఖల్నీ నిర్ణయిస్తుందని భావిస్తున్నారు. వీళ్లు సంప్రదాయ విధానాలు పక్కనబెట్టి పురోగమన ఆర్థిక దృక్కోణంతో కొత్త ఎజెండాలను పైకి తీసుకురావటం తథ్యం.



నవతరం ఎజెండాలో...

ఎన్నికలకు ప్రభుత్వమే నిధులు ఖర్చుపెట్టడం, బహుళ రాజకీయ వ్యవస్థ ఏర్పాటు, పన్నుల వసూళ్లలో లొసగుల్ని అరికట్టడం, ప్రభుత్వ కార్యకలాపాల డిజిటలీకరణ, వివక్షల్ని తొలగించడం.. ఇత్యాది కీలక చర్యలు ఉండొచ్చు. సంపదలో విపరీత అంతరాలు, సాంకేతిక విప్లవం సృష్టించే సవాళ్లు, పర్యావరణ అస్థిరతల ముంగిట నిలిచిన ప్రపంచానికి ఈ నవతరం నాయకత్వం వహించాల్సి ఉంటుంది. మొబైల్ తదితర సాంకేతిక విప్లవ కాలంలో ఎదిగిన వీరికి ఈ సవాళ్లను ఎదుర్కొనడం పెద్దగా సమస్య కాకపోవచ్చు. ఆటోమేషన్ పుంజుకుని... పరిశ్రమల్లో భారీగా ఉద్యోగాల కోత తప్పకపోవచ్చు. 2030ల మధ్య నాటికి నిరుద్యోగిత పతాక స్థాయికి చేరుకుంటుంది కాబట్టి... కనీస ఆదాయం సూత్రాన్ని పాటించక తప్పదు.

వృద్ధతరం.. ఏమిటి వ్యూహం?

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా వృద్ధ జనాభా పెరుగుతోంది. ఈ మలితరాన్ని ప్రభుత్వాలు భారంగా భావించే రోజులు వచ్చేశాయి. ఎక్కువ కాలం జీవించారన్న ఆనందం ఒక కోణమయితే.. సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు వీరు విసిరే సవాలు తీవ్రంగా ఉండబోతోంది. 1945ల కన్నా ముందు జన్మించిన వారిని 'సివిక్స్' అంటున్నారు. జీవితకాల ఉపాధిని, చౌకైన స్థిరాస్తిని, పూర్తి పెన్షన్‌ను అనుభవించిన తరం ఇది. ఇక 1946-64 మధ్య పుట్టిన వారిని 'బేబీ బూమర్స్' అంటారు. మారిన సామాజిక పరిస్థితుల్లో పెరిగిన తరం ఇది, ముందటి తరంతో పోలిస్తే వీళ్ల సంపదను ఎక్కువగా పోగేశారు, మెరుగైన జీవనం గడిపారు. 2020ల మధ్యనాటికి ఈ సివిక్స్ తరం 90ల్లోకి, బేబీ బూమర్స్ 70ల్లోకి అడుగుపెడతారు. వీరికి సామాజిక భద్రత, పెన్షన్లు, వైద్య సౌకర్యాలు ప్రభుత్వాలకు పెను సవాలు. ప్రభుత్వాలు అదనపు ఆర్థిక భారాన్ని భరించాల్సి ఉంటుంది.

భయపెడుతున్న అంతరాలు

- కొద్దిమంది చేతుల్లోనే ప్రపంచ సంపద
- పేద ఆర్థిక వ్యవస్థలు కుదేలు



ఆర్థికం

అన్ని రంగాలనూ చుట్టేస్తున్న ఆటోమేషన్, పారిశ్రామిక విప్లవ ప్రభంజనం, సగటు ఆయుర్దాయం పెరుగుదల, పన్ను సంస్కరణలు.. ఇవన్నీ కలిసి ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయబోతున్నాయి. అయితే సంపదలన్నీ కొందరి చేతుల్లోనే పోగుపడుతూ.. ఆర్థిక అంతరాలు ప్రమాదకర స్థాయికి చేరుకోబోతున్నాయి. ఈ అసమతౌల్యం ప్రపంచ ఆర్థిక అస్థిరతకు దారి తీయబోతోందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. 2014లో కేవలం 80 మంది కుబేరులు, కోటీశ్వరుల వద్దనున్న సంపద.. మొత్తం ప్రపంచంలోని దాదాపు 360 కోట్ల మంది ఆస్తితో సరిసమానంగా ఉంది! 2018 దాటి.. 2019 మధ్య నాటికల్లా ప్రపంచంలోని సగం మంది వ్యక్తిగత సంపదపై ఈ కుబేరులే పట్టు సాధిస్తారని అంచనాలు చెబుతున్నాయి. స్వేచ్ఛా వాణిజ్యం వృద్ధి, ఔట్ సోర్సింగ్ విస్తరణ, ఆటోమేషన్, హక్కుల కోసం పోరాడే కార్మిక సంఘాలు కనుమరుగవుతుండడం, నైపుణ్య వృత్తులు పెరిగిపోవడం, చుక్కలనంటుతున్న ద్రవ్యోల్బణం కనీస వేతనాల్ని హరించేస్తుండడం, పన్నులు ధనికులకు అనుకూలంగా మారడం, కార్మికులకు స్థిరవృత్తి లేని పరిస్థితులు.. ఇత్యాదివి సంపద అసమతౌల్యాన్ని మరింతగా పెంచుతున్నాయి. కొందరు వ్యక్తుల చేతుల్లోనే సంపద కేంద్రీకృతం కావడం వల్ల వస్తువుల కొనుగోలు, వినియోగ స్వరూపం సమూలంగా మారిపోతుంది. ఆహారం, చిల్లర వస్తువులు, సేవల్లాంటివి ఎక్కువమందికి అవసరమైనంతగా ఒక వ్యక్తికి అవసరం ఉండవు. కానీ ఎక్కువమంది వద్ద తక్కువ డబ్బే ఉంటుంది కాబట్టి వారి ఖర్చూ తక్కువగానే ఉంటుంది. దీనివల్ల సూక్ష్మస్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తాయి. ఆదాయం కనిష్ఠస్థాయికి చేరినపుడు మధ్యతరగతి ప్రజలు అప్పులు చేస్తారు. ఆర్థికవ్యవస్థ తిరోగమనం పట్టినపుడు వీరి జీవితాలు అల్లకల్లోలమవుతాయి. సంపద అసమతౌల్యం అవినీతిని పెంచిపోషిస్తుందని చరిత్ర చెబుతోంది. రాజకీయ నాయకులు ధనికులపైన, ధనికులు రాజకీయ నాయకులపైన ఆధారపడి.. దోపిడీ వ్యవస్థ బలపడుతుంది.

అందరికీ కనీస వేతనమే మందు

ఆటోమేషన్ విప్లవం వల్ల రాబోయే రెండు దశాబ్దాల్లో లక్షల మంది ఉపాధిని కోల్పోతారు. కృత్రిమ మేధో వ్యవస్థలు, రోబోలు విస్తరిస్తూ.. కార్మికుల మార్కెట్‌ను హరించేస్తాయి. ఇదో నిరుద్యోగ సునామీ! దీన్ని తట్టుకోవడం ఆర్థిక వ్యవస్థలకు కష్టం. కాబట్టి సార్వత్రిక కనీస వేతనం అనే సరికొత్త సంక్షేమ వ్యవస్థను సృష్టించడం అనివార్యం! ప్రతి వ్యక్తికీ బేషరతుగా నెలనెలా కొంత కనీస వేతనాన్ని అందించటమే దీని ఉద్దేశం. దీనివల్ల కనీస జీవన ప్రమాణాలకైనా హామీ ఇచ్చినట్లవుతుంది.

పేద, ధనిక దేశాల కష్టాలు

సాంకేతికత పరిజ్ఞానం.. కార్మిక వ్యవస్థను హరించేస్తుంది కాబట్టి.. ధనిక దేశాలకు పేద దేశాల నుంచి చౌక కార్మికుల అవసరం ఉండదు. అందువల్ల ఆఫ్రికా, ఆసియా దేశాల్లో నిరుద్యోగులు పెరుగుతారు. వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే మౌలిక సదుపాయల్ని పేద దేశాలు వృద్ధి చేసుకోలేవు కాబట్టి ఈ ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతాయి. విద్యుత్ వాహనాలు రాజ్యమేలుతాయి కాబట్టి చమురు ధరలు పతనమై... చమురు ఆధార దేశాలు నష్టపోతాయి.

కొత్త కోలాహలం

హైపర్ లూప్ రైల్వే



కళ్లు చెదరే వేగంతో ప్రయాణించే 'హైపర్ లూప్' రైల్వే ఈ 2018లోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఎలాన్ మస్క్ సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ వినూత్న రైలు భూమ్యాకర్షణ లేని గొట్టంలో అత్యంత వేగంగా పరుగు తీస్తుంది.

పోలియో



ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాలుగా సాగుతున్న పోలియో నిర్మూలన కృషి ఫలించి.. ప్రపంచం ఈ ఏడాదే 'పోలియో రహితం' కాబోతోంది. 2016లో కేవలం 37 కేసులే నమోదయ్యాయి. తర్వాత మళ్లీ లేవు.

జనాభా




ప్రపంచ జనాభా ఈ ఏడాది 7,59,71,75,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో జనాభా పెరుగుదల గణనీయంగా ఉంటుంది. ఆసియా జనాభా పెరుగుదలలో మన దేశం వాటా 35% ఉండొచ్చని అంచనా.

విద్యుత్ వాహనాలు



2018ని విద్యుత్ వాహనాల సంవత్సరం అనొచ్చు. ఎలెక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా మోటార్స్ ఈ 2018లో దాదాపు 5 లక్షల ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, విక్రయాలు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచం మొత్తమ్మీద 52 లక్షల ఎలక్ట్రిక్ వాహన విక్రయాలు జరగొచ్చని అంచనా.

డ్రాగన్‌వుడ్!



చైనా ఈ 2018లోనే ప్రపంచంలోనే అతిపెద్ద చలనచిత్ర మార్కెట్‌గా అవతరించనుందా? హాలీవుడ్‌లో చైనా పెట్టుబడులు పెరిగి .. హాలీవుడ్ మీద డ్రాగన్ పట్టు పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

3డీ కారు

త్రీడీ సాంకేతిక పరిజ్ఞానం 2018లో చాలా రంగాలకు విస్తరించబోతోంది. ఈ టెక్నాలజీలో రూపొందించిన తొలి కారు ఈ ఏడాదే రోడ్లపై పరుగులు పెట్టనుంది.



చక్రం తిరగబడుతోంది!

- పెట్రోల్, డీజిల్ కనుమరుగు
- శుద్ధ ఇంధనాలదే పరుగు
- సౌర, జీవ ఇంధనాలే కీలకం

ఇంధనం

ఇంధనంగా బొగ్గు హవా ఇప్పటికే తగ్గిపోతోంది.. చమురు కూడా అదే బాట పడుతోంది. ఈ సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడే రోజులు పూర్తిగా పోతున్నాయి. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, శుద్ధ ఇంధనాలపై ఆసక్తి, ప్రభుత్వాల చర్యల వల్ల 2018లోనూ, రానున్న మూడునాలుగు సంవత్సరాల్లోనూ ఇంధన రంగంలో సరికొత్త శకం ఆరంభం అవుతోంది. ముమ్మందు శిలాజ, కర్బన ఇంధనాలు కనుమరుగు కాక తప్పని పరిస్థితులు వచ్చేశాయి. బొగ్గు, చమురు శకం ముగింపుకొచ్చేస్తోంది. పునరుత్పాదక ఇంధనాలు, విద్యుత్తు, విచ్ఛిత్తి శక్తి ఇంధనాలు జోరందుకుంటాయి. ముఖ్యంగా సౌర, జీవ ఇంధనాలు కీలక భూమిక పోషించబోతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 2300 బొగ్గు ఆధార ఇంధన ప్లాంట్లు కాలుష్యంలో, కర్బన ఉద్గారాల్లో ముందుండటంతో చాలా దేశాలు వీటికి దూరం జరుగుతున్నాయి. కొన్ని దేశాలు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని కర్బన నిల్వ (సీసీఎస్) విధానాన్ని అవలంబిస్తున్నాయి. బొగ్గును మండించాక వెలువడే కర్బన ఉద్గారాలను దాదాపుగా పీల్చేసి కేవలం శుద్ధ వాయువుల్నే గాల్లోకి వదిలే పరిజ్ఞానం ఇది. కాకపోతే ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. అలాగే చమురు ఇంధనాలపై ఒత్తిడి ఎక్కువై.. ఇప్పటికేవాటి ధరలు ఆకాశాన్నంటాయి. ప్రాదేశిక రాజకీయాలు చమురు ఉత్పత్తుల్ని శాసిస్తుండడంతో చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తమైపోతున్నాయి. ఈ నేపథ్యంలో సరికొత్త, పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లటం అనివార్యం! ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.. ఇవింకా వేగం పుంజుకోవటం తథ్యం. ఈ పునరుత్పాదక ఇంధనాలపై ప్రభుత్వాల పెట్టుబడులు పెరుగుతాయి. ప్రపంచం శుద్ధ ఇంధనాల వైపు పరుగుతీస్తోంది. విద్యుత్ కార్లు, సౌర విద్యుత్తు ఫలకాలు మనల్ని 'కర్బన అనంతర శకం'లోకి తీసుకుపోనున్నాయి. వచ్చే 10-20 ఏళ్లలో విద్యుత్ వాహనాలదే కీలక చోదక పాత్ర. 2020 తర్వాత.. చమురుపై ఒత్తిడి తగ్గి.. పునరుత్పాదక ఇంధన వనరులు.. ముఖ్యంగా సౌర విద్యుత్తు, జీవ ఇంధనాలు(మిథనాల్, ఇథనాల్, ఆల్గేలాంటివి) కీలక పాత్ర పోషిస్తాయి. వీటి తయారీపై పెట్టుబడులు ఊపందుకుంటున్నాయి. కాబట్టి ఇంధన రంగంలో సరికొత్త విప్లవం ఖాయం.

- ఇక బొగ్గు ఆధార విద్యుత్ పరిశ్రమలపై పెట్టుబడులు తగ్గిపోతాయి. బ్రిటన్, ఫ్రాన్స్‌లలో 70 శాతం బొగ్గు ఆధార పరిశ్రమలు ఇప్పటికే మూతపడుతున్నాయి. ఐరోపా, దక్షిణాఫ్రికాలో బొగ్గు వినియోగం దాదాపు 9% మేర తగ్గిపోయింది.



మన దేశంలో చివరి బొగ్గు ప్లాంటు 2050లో మూతపడుతుందని అంచనా!

మిద్దెల మీదే సేద్యం

- డ్రోన్లతో పంటల పర్యవేక్షణ
- సాగు పనుల్లో రోబోలు
- తెరపైకి 'వర్టికల్ ఫామింగ్'

వ్యవసాయం

ప్రపంచ ఆహార అవసరాలు పెరిగిపోతున్నాయి. జనాభా విస్ఫోటం, పర్యావరణ విపత్తులతో.. ఆహార భద్రత పెద్ద సవాల్‌గా తయారవుతోంది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ వ్యవసాయ రంగం కొత్త పుంతలు పోతోంది. కాడెద్దుల రైతన్న తన పాత్ర మార్చుకుని.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ 'స్మార్ట్ ఫామింగ్' వైపు ప్రయాణించక తప్పదు. వ్యవసాయ రంగంపై పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో సేద్య యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం చౌక కాబోతోంది. డ్రోన్లు సేద్యంలోకి దిగుతున్నాయి. భూసారం, చీడపీడలు, నీటి పారుదల, ఎరువులు, పురుగుమందులు చల్లటం వంటి వాటన్నింటినీ డ్రోన్ల సాయంతో పర్యవేక్షించే వెసులుబాటు వచ్చేస్తోంది. ట్రాక్టర్లు ఇప్పటికే స్మార్ట్ ట్రాక్టర్లుగా కొత్త రూపం ఎత్తుతున్నాయి. గట్టున కూర్చుని రిమోట్‌తోనే మనం వీటిని నడిపించొచ్చు. పొలం దున్నటం, విత్తనాలు వేయడం, ఎరువులు చల్లడం, పంట నూర్పిడి వంటివన్నీ ఇవే చేసేస్తాయి. నేడు వ్యవసాయ కూలీలు చేస్తున్న కాయలు/పండ్లు కోయటం, పత్తి ఏరటం వంటి పనుల్ని చిన్నచిన్న రోబోలు చేసే రోజులొస్తున్నాయి.

సేద్యం పైపైకి

ముఖ్యంగా ఇప్పుడిప్పుడే పట్టణాల్లో మిద్దెల మీద మొదలైన తోటల పెంపకం.. కొత్త రూపం తీసుకోబోతోంది. భవంతుల మీద భారీ వ్యవసాయం ఆరంభం కాబోతోంది. దీన్నే 'వర్టికల్ ఫామింగ్' అంటున్నారు. ఎత్తైన భవనాల పైకప్పులు, బాల్కనీల్లో ప్రత్యేకంగా తయారు చేసిన బెడ్స్ మీద మొక్కల పెంపకం పెరగబోతోంది. పండించిన ఉత్పత్తుల్ని కన్వేయర్ బెల్టుల ద్వారా నేరుగా స్థానిక మార్కెట్లకు తరలిస్తారు. ఆ చుట్టుపక్కల వారందరి ఆహార అవసరాల్నీ ఇవే తీరుస్తాయి. అంతేకాదు.. ముమ్మందు మనుషుల ఆహారపుటలవాట్లు కూడా మారిపోనున్నాయి. మరింత సమ్మిళిత, పోషకాలు, రుచులు కలిగిన ఆహారం వైపు మొగ్గు పెరుగుతుంది. ప్రయోగశాలలో కృత్రిమంగా తయారైన మాంసం, కీటకాలు, సింథటిక్ ఆహారాలు, ద్రవరూప ఆహార పానీయాలు మన ఆహారంలో భాగం కావొచ్చు!

ఇవి చేయకతప్పదు

- 2035 నాటికి ఆహార ధరలు చుక్కలనంటి.. హింసాత్మక ఆందోళనలు జరగొచ్చు కాబట్టి... ప్రభుత్వాలు ఆహారంపై తాత్కాలిక రేషన్‌ను పాటించక తప్పని పరిస్థితులు రావొచ్చు.
- వాతావరణ మార్పుల్ని తట్టుకునే కొత్తరకం జన్యుమార్పిడి (జీఎంఓ) విత్తనాలపై ప్రభుత్వాలు పెట్టుబడులు పెట్టక తప్పదు.
- బియ్యం, గోధుమలు, సోయాలాంటి ఆహార ఉత్పత్తుల కొరత ఏర్పడితే.. జనం మాంసం వైపు మొగ్గుచూపుతారు. అప్పుడు పశువులపైనా ఒత్తిడి పెరుగుతుంది. దీన్ని అరికట్టడానికి ప్రభుత్వాలు నియంత్రణలు పాటించాల్సి ఉంటుంది.

కాలంపై మన సంతకం

నూతన సంవత్సర ప్రత్యేకం

ఎన్నికలు

మినీ సార్వత్రిక సంవత్సరం



2018లో కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం, మేఘాలయ, నాగాల్యాండ్, త్రిపురలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2019లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ రాష్ట్రాల, మరీ ముఖ్యంగా కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికలు కీలకం కానున్నాయి. ఇందులో ప్రస్తుతం ఒక్క కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. మిగతా మూడు రాష్ట్రాలు భాజపా పాలనలో ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లోని ఫలితాలు మరుసటి ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలపై ఎంతోకొంత ప్రభావం చూపించనున్నాయి. మొత్తంమీద 2018ని మినీ సార్వత్రిక సంవత్సరంగా పేర్కొనొచ్చు. ఈ ఫలితాలు రాబోయే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల సరళిని ఆవిష్కరించటమేకాదు.. భాజపా, కాంగ్రెస్, కొన్ని ప్రాంతీయ పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించనున్నాయి.

ఆర్థికంలో ప్రపంచ స్థానం..



పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో ఏర్పడిన స్వల్పకాలిక ప్రతిబంధకాలు దాటుకొని భారత్ 2018లో ప్రపంచంలోని అయిదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో స్థానం సంపాదించబోతోంది. ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్న ఫ్రాన్స్, 6వ స్థానంలో ఉన్న యూకే కిందకు దిగజారిపోనుండగా.. 7వ స్థానంలో ఉన్న భారత్ 5వ స్థానంలోకి రానుంది. మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ ఉంటాయి. లండన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ (సీఈబీఆర్) నివేదిక ఈ మేరకు స్పష్టంచేసింది.

భారతదేశం గత కొన్నేళ్లుగా అమలు చేస్తున్న ఆర్థిక సంస్కరణలతో మెరుగైన వార్షికాభివృద్ధి సాధిస్తున్నట్లు, తత్ఫలితంగా స్థూలజాతీయోత్పత్తిలో (జీడీపీ) ఏటా 6 శాతానికి పైగానే వృద్ధి నమోదు చేయటం వల్ల ఫ్రాన్స్, యూకేలను మించిపోనున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల భారతదేశం వృద్ధి రేటు విషయంలో తాత్కాలిక అవరోధాలు ఎదురైనప్పటికీ అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబోతోందని సీఈబీఆర్ నివేదిక స్పష్టంచేసింది.

2032 నాటికి ప్రపంచంలోని నాలుగు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మూడు ఆసియా దేశాలే ఉంటాయని.. అవి చైనా, భారత్, జపాన్ అని సీఈబీఆర్ పేర్కొంది.

మోదీ.. ప్రజ్ఞకు సవాల్



తిరుగులేని ఆధిక్యంతో 2014లో అధికారపీఠం కైవసం చేసుకున్న ప్రధాని మోదీ ఆ తర్వాత జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికల్లోనూ సత్తా చాటుతూ వస్తున్నారు. ఇటీవల గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా బొటాబొటీ మెజారిటీతో నెగ్గడంతో.. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ లాంటి పరిణామాలు ఆయన హవాను మసకబారుస్తాయా? అన్న అనుమానాలు రేగాయి. మరో 15 నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలకు ముందు సెమీఫైనల్లాంటి అసెంబ్లీ ఎన్నికలు 8 రాష్ట్రాల్లో జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో 2018లో ప్రధాని తీసుకునే ప్రతి నిర్ణయం సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపేదే. ముఖ్యంగా ప్రజాకర్షక పథకాలపై ఆయన దృష్టిపెట్టక తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓ వైపు పార్టీని సమర్థంగా ముందుకు తీసుకెళ్తూనే.. ప్రభుత్వంపై మరింత విశ్వసనీయత పెరిగే చర్యలపై ఆయన దృష్టిసారించాల్సి ఉంటుంది. 2018లో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ కూడా ప్రాధాన్యంతో కూడుకున్నదే కానుంది. ప్రతిపక్ష కాంగ్రెస్ బలపడకుండా చూసుకుంటూనే.. సొంత పార్టీ భాజపాను విజయపథంలోకి నడిపించాల్సిన కీలక బాధ్యత ఆయన భుజస్కంధాలపై ఉంటుంది. పాత మిత్రుల్ని కాపాడుకుంటూనే.. కొత్త మిత్రపక్షాలను ఆకర్షించే వ్యూహం అమలుచెయ్యొచ్చు. రాబోయే 15 నెలలు ఆయన కార్యదక్షతకు, వ్యూహచతురతకు సవాలుగా నిలవబోతున్నాయి.

నేత భవిత

రాహుల్.. అగ్ని పరీక్ష



2014లో ఘోర పరాజయం పాలవడమేకాకుండా ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ చేదు ఫలితాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను కీలక సమయంలో రాహుల్‌గాంధీ చేపట్టారు. రెండు దశాబ్దాలకు పైగా సోనియాగాంధీ చేతిలో ఉన్న పార్టీని ఇన్నాళ్లూ తల్లిచాటు బిడ్డగా ఉన్న రాహుల్ చేతిలో పెట్టడం కీలక పరిణామం. వరుస పరాజయాలతో దిగాలుపడ్డ కాంగ్రెస్ పార్టీకి ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల ఫలితాలు కాస్తంత ఊరటనివ్వడం అటు రాహుల్‌కు, ఇటు పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఇదే ఊపుతో 2018లో అసెంబ్లీ ఎన్నికల్ని, 2019లో సార్వత్రిక ఎన్నికల్ని ఎదుర్కోవాలనే సంకల్పంతో కాంగ్రెస్ ముందుకు వెళుతోంది. అయితే ఇందులో అనుసరించబోయే వ్యూహాలు రాహుల్ నాయకత్వ ప్రతిభకు పరీక్ష పెట్టనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుతూనే.. సార్వత్రికానికి సన్నద్ధమవుతూ సమర్థంగా ముందుకు సాగడం అంత సులువైనపనేంకాదు. పార్టీలో సీనియర్, యువ నాయకత్వం మధ్య సమన్వయం సాధించడం రాహుల్ నాయకత్వ పటిమకు సవాల్‌గా మారనుంది. దేశ ప్రజల అవసరాలు, సమస్యల్ని గుర్తించి.. పార్టీ విధానాలను ప్రకటించాల్సి ఉంటుంది. ఈ విధంగా 2018లో వేసే ప్రతి అడుగు.. ఆయనను కలల పీఠానికి దగ్గరో.. దూరమో.. చేసేదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రంలో...

అందిరానున్న ఫలాలు

తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు 2018 ఎంతో కీలక సంవత్సరం. 2019లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2018లో ఆయా పథకాల మీద చేసే కసరత్తే ప్రాధాన్యాన్ని సంతరించుకోనుంది. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరంలో అవి ఎలా ముందుకు సాగనున్నాయంటే..

కాళేశ్వరం తొలిఫలం..



- ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తొలి దశను 2018లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరిపై మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించి ఎల్లంపల్లికి నీటిని మళ్లించే పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. కానీ, మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.
- ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు వరకు నీటిని మళ్లించే పనులను 2017 డిసెంబరు కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నా.. కాలేదు. ఈ పనులు కూడా వచ్చే జూన్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.
- ప్రధానమైన రిజర్వాయర్లు, ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనుల్లో ఎక్కువ భాగం 2018లో పూర్తయితే, 2019 ఖరీఫ్ నాటికి కొంత అయినా కొత్త ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది.
- ఈ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.19 వేల కోట్లను ఖర్చు చేశారు.

నిరంతర వెలుగుల వెనుక సవాళ్లెన్నో..!

- రాష్ట్ర విద్యుత్ సంస్థలకి 2018 ప్రారంభం నుంచే అసలైన అగ్ని పరీక్ష ప్రారంభమవుతోంది. వ్యవసాయ బోర్లకు ఆదివారం అర్ధరాత్రి నుంచి నిరంతర (24 గంటల) విద్యుత్ సరఫరా చేసేందుకు ఈ సంస్థలు రంగం సిద్ధం చేశాయి. రాష్ట్రంలోని 21 లక్షల పంపుసెట్లు నిరంతరం నడిచేలా కరెంటు ఇవ్వడం ఈ రంగంలో సవాల్‌గా చెబుతున్నారు.
- వ్యవసాయానికి ఉచితంగా కరెంటు ఇవ్వడానికి ఈ ఏడాది రూ.4700 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.5400 కోట్ల వరకూ ఇస్తామని ఇప్పటికే హామీ ఇచ్చింది. కానీ, ఈ నిధులు సరిపోవని విద్యుత్ కొనుగోలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- వరసగా రెండేళ్లుగా ప్రభుత్వం కరెంటు ఛార్జీలను పెంచలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా పెంచొద్దని డిస్కంలు ఈఆర్‌సీని కోరాయి. అయితే, సేద్యానికి నిరంతర సరఫరాతో వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుతుందని ముందు జాగ్రత్తగా అదనంగా విద్యుత్ కొంటున్నారు. రోజూవారీ వినియోగాన్ని సమీక్షించుకుంటూ ఎప్పటికప్పుడు ఇంధన ఎక్స్ఛేంజీలో అధిక ధరకు కొనకతప్పదు. ఈ కొనుగోలుతో విద్యుత్ సరఫరా వ్యయం మరింత పెరగడం తథ్యం.

రైతుకు వ్యవ'సాయం'..

- 2018లో ఏటా రెండు పంటలకు ఎకరానికి రూ.8 వేలు (పంటకు రూ.4 వేల చొప్పున) పెట్టుబడి ఇచ్చే పథకానికి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది.
- రెండు సీజన్లలో కలిపి రాష్ట్రంలో అన్ని రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.45 కోట్ల ఎకరాల వరకూ ఉంది. ఎకరానికి రూ.8 వేల చొప్పున కచ్చితంగా ఇస్తే మొత్తం రూ.11 వేల కోట్లకుపైగా కేటాయించాలి. కానీ, ఇంత సొమ్ము ఇచ్చే అవకాశం లేదని అంచనా.
- మొత్తంమీద లబ్ధిదారులకు నేరుగా పెట్టుబడి సొమ్ము చేర్చడమనేది అధికారయంత్రాగానికి సవాల్‌గా మారనుంది. అమలు ప్రారంభమైతే క్షేత్రస్థాయి సమస్యలు తెలుస్తాయి.

భగీరథకు ప్రాధాన్యం..



- రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నల్లాల ద్వారా మంచినీటిని ఇవ్వకుంటే 2019 ఎన్నికల్లో ఓట్లు అడగబోమన్న ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో మిషన్ భగీరథ విషయంలో 2018 అత్యంత కీలకం కానుంది.
- ఎట్టిపరిస్థితుల్లోనూ 2018లో ఈ ప్రాజెక్టును పూర్తిచేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయనుంది. రూ.43 వేల కోట్ల అంచనా వ్యయంతో.. 2015లో ప్రారంభించిన ఈ పథకంలో ఇప్పటికే దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి.

ఉద్యోగ నామ సంవత్సరం..

- లక్ష ఉద్యోగాల భర్తీ హామీని తప్పక నెరవేరుస్తామన్న ప్రభుత్వ హామీ నేపథ్యంలో 2018 నియామకాలకు చాలా ముఖ్యం కానుంది.
- టీఎస్‌పీఎస్సీ ఇప్పటికి 100 ఉద్యోగ ప్రకటనలు వెలువరించింది. 81 ప్రత్యక్ష నియామక ప్రకటనల కింద 29,757 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేసింది. వీటిలో ఇప్పటి వరకు 6872 పోస్టులకు మాత్రమే నియామక జాబితాలు వెల్లడయ్యాయి.
- మరికొన్ని పోస్టులకు ప్రకటనలు వెలువరించి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇంకొన్ని పోస్టులకు నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. ఆయా పనులన్నింటినీ నియామక సంస్థలు సమర్థంగా పూర్తిచేస్తేనే ప్రభుత్వ హామీ నెరవేరే అవకాశం ఉంది.

– ఈనాడు, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుకు 2018 ఎంతో కీలకం కానుంది

మిషన్ భగీరథను 2018లో ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తిచేయాలనేది ప్రభుత్వ లక్ష్యం

జీఎస్టీ

పెద్దనోట్ల రద్దు

ఇక ఇవి సర్దుకుంటాయి...!



ప్రారంభ సమయంలో సామాన్యుడిపై తీవ్ర ప్రభావం చూపిన పెద్ద నోట్ల రద్దు, సంక్లిష్టమనిపించిన జీఎస్టీలు క్రమంగా ఎన్నికల ప్రభావిత అంశాల నుంచి పక్కకు జరుగుతున్నాయి. 2018లో జరిగే 8 రాష్ట్రాల ఎన్నికలు, ఆ తర్వాతి ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వాటి ప్రభావం అసలు కనిపించకపోవచ్చని అంచనా. ఇటీవలి కాలంలో జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షాలు ప్రధానంగా ఈ రెండు అంశాలనే ప్రస్తావించాయి. కానీ, రాబోయే ఎన్నికల సందర్భంగా అవి 'అప్రస్తుత' ప్రసంగాలే కానున్నాయి. ఈ రెండు చర్యల నుంచి ఆర్థిక వ్యవస్థ తేరుకోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు నిపుణులు. మరోవైపు ప్రాథమికంగా ఇవి ఇబ్బందులకు గురిచేసినా.. దీర్ఘకాలికంగా మంచే జరుగుతుందన్న భావన ప్రజల్లో పెరగడమూ ఓ కారణమేనని విశ్లేషకుల అంచనా. మొత్తంమీద రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికలు పెద్ద నోట్ల రద్దేతర, జీఎస్టీ యేతర అంశాలే ప్రాతిపదికగా జరగనున్నాయి.



- పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ) అమలుతో ఏర్పడిన ఆర్థిక అగాథం పూడుకొని.. జీడీపీ క్రమంగా మెరుగుకానుంది. అయితే ఈ వృద్ధి మెరుపువేగంతో కాకుండా.. నెమ్మదిగానే ఉంటుందన్నది ఆర్థికవేత్తల విశ్లేషణ.


భారత యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కీలకం.

వారిని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది పొడవునా పలు కీలక నిర్ణయాలు వెలువడొచ్చు.

2018లో తయారీ రంగం క్రమంగా కోలుకోనుంది. దీని వేగం పెరగటం మరింత కీలకం.

సాగు దిగుబడులు పెంచే చర్యలపై కేంద్రం దృష్టిసారించనుంది.

వారు సూర్యుడి వద్దకు.. మనం చంద్రుడి మీదకు



'పార్కర్ సోలార్ ప్రోబ్'

అంతరిక్ష పరిశోధనల్లో మహోత్తర ఘట్టాలకు కొత్త సంవత్సరం వేదిక కాబోతోంది. విశ్వం గుట్టు విప్పడంలో అగ్రదేశాలతో పోటీ పడుతున్న భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో).. 2018 మార్చిలో చంద్రుడి మీదకు చంద్రయాన్-2 వ్యోమనౌకను పంపనుంది. తద్వారా జాబిల్లి ఉపరితలం మీదకు తొలిసారిగా ల్యాండర్‌ను, రోవర్‌ను దించబోతోంది. భారత శాస్త్ర, సాంకేతిక ప్రస్థానంలో ఇదో అద్భుత మైలురాయి కానుంది.

- 'గూగుల్ ఎక్స్ ప్రైజ్ లూనార్ కంటెస్ట్'లో తుది రౌండ్‌కు చేరిన బెంగళూరు అంకుర పరిశ్రమ 'టీం ఇండస్' కూడా మార్చిలో చంద్రుడి మీదకు తొలి వాణిజ్య రోవర్‌ను పంపనుంది.
- అమెరికా అంతరిక్ష సంస్థ నాసా.. 2018 ఆగస్టులోగా 'పార్కర్ సోలార్ ప్రోబ్' పేరుతో ప్రపంచంలోనే తొలిసారిగా సూర్యుడి వద్దకు వ్యోమనౌకను పంపుతోంది. ఇది సూర్యుడికి 37 లక్షల మైళ్ల దూరంలో ఉండి పరిశోధనలు సాగిస్తుంది. 2500 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతను తట్టుకోవడానికి వ్యోమనౌకకు దట్టమైన కార్బన్-కాంపోజిట్ ఉష్ణ కవచాన్ని అమర్చారు.
- సౌర కుటుంబం అవతల జీవుల మనుగడకు అనువైన గ్రహాలను గుర్తించేందుకు నాసా.. ట్రాన్సిటింగ్ ఎక్సోప్లానెట్ సర్వే శాటిలైట్ (టెస్)ను 2018 జూన్‌లోగా పంపుతోంది. ఆకాశంలో 2 లక్షల ప్రకాశవంతమైన నక్షత్రాలను ఇది జల్లెడ పట్టనుంది.
- అంగారక గ్రహం మీదకు 'ఐన్‌సైట్' అనే ల్యాండర్‌ను నాసా పంపుతోంది. మానవులను ఆ గ్రహం మీదకు పంపడానికి అవసరమైన సమాచారాన్ని శోధిస్తుంది.
- బుధగ్రహం వద్దకు ఐరోపా అంతరిక్ష సంస్థ, జపాన్‌లు సంయుక్తంగా 'బెపి కొలంబో' వ్యోమనౌకను పంపనున్నాయి.
- చంద్రుడి మీదకు చాంగే-4 పేరుతో చైనా, సెలీన్-2 పేరుతో జపాన్.. రోవర్‌లను ప్రయోగించబోతున్నాయి.

చంద్రడిపై పంపనున్న రోవర్.. ఆ గ్రహం ఉపరితలం మీద కలియతిరుగుతూ పరిశోధనలు సాగించనుంది.

అంతరిక్షం



చంద్రయాన్-2

ఛాంపియన్

వస్తున్నాం మీకోసం..

ఈనాడు క్రీడావిభాగం

కొత్త ఏడాదిలో నిర్విరామ క్రీడా వినోదం

2018లో క్రీడాభిమానులకు పండగే పండగ!

ఫుట్‌బాల్ ప్రియుల్ని ఉర్రూతలూగించే ఫిఫా ప్రపంచకప్.. క్రికెట్ అభిమానుల్ని అలరించడానికి అండర్-19 వన్డే ప్రపంచకప్, మేటి జట్లతో టీమ్‌ఇండియా మహా యుద్ధాలు.. హాకీని ఇష్టపడేవారి కోసం భారత గడ్డపైనే ప్రపంచకప్.. బ్యాడ్మింటన్ ప్రేమికుల కోసం లెక్కలేనన్ని సూపర్ సిరీస్‌లు, ప్రపంచ ఛాంపియన్‌షిప్, సూపర్ సిరీస్ ఫైనల్స్.. ఇంకా ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లాంటి ప్రతిష్టాత్మక క్రీడా సంబరాలు. . అబ్బో ఇలా ఎన్నెన్ని విశేషాలో 2018లో. ఏడాదంతా విరామం లేకుండా క్రీడా ప్రియుల్ని అలరించడానికి కావాల్సినన్ని టోర్నీలున్నాయి. కొత్త ఏడాదిలో అపరిమిత వినోదానికి హామీ ఇస్తూ మీకోసం ముస్తాబవుతున్న ఆ టోర్నీలేంటో ఓసారి చూద్దామా!





ఫుట్‌బాల్ ప్రియులకు పండగే..

2018లో క్రీడా ప్రపంచానికి అతి పెద్ద వేడుక అంటే ఫుట్‌బాల్ ప్రపంచకప్పే. 200 దేశాలకు పైగా ఆడే ఫుట్‌బాల్ ఆటలో ప్రపంచకప్ అంటే ప్రపంచవ్యాప్తంగా సందడి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నాలుగేళ్లకోసారి వచ్చే ఈ టోర్నీపై వందల కోట్ల మంది దృష్టి ఉంటుంది. సాకర్ స్టార్ల అద్భుత విన్యాసాలు, మేటి జట్ల మధ్య హోరాహోరీ సమరాలతో మహా రంజుగా సాగుతుందీ మెగా టోర్నీ. రెండేళ్ల పాటు అర్హత టోర్నీల్లో ఎన్నెన్నో సవాళ్లను దాటి ప్రపంచకప్‌కు అర్హత సాధించే జట్లు కప్పు కోసం ప్రాణం పెట్టి ఆడతాయి. రొనాల్డో, మెస్సి, నెయ్‌మార్ లాంటి సూపర్ స్టార్ల విన్యాసాల కోసం అభిమానులు ఎంత ఉత్కంఠగా చెబుతారో చెప్పేదేముంది? జూన్-జులై మధ్య నెల రోజుల పాటు ప్రపంచం కళ్లన్నీ రష్యాలో ప్రపంచకప్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే స్టేడియాల మీదే ఉంటాయి.


- ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ (జూన్ 14–జులై15, రష్యాలో)



వారి కోసం..

ఒకరు కాదు ముగ్గురు స్టార్ టెన్నిస్ క్రీడాకారులు పునరాగమనం చేస్తున్నారు ఈ ఏడాది. బిడ్డకు జన్మనిచ్చి దాదాపుగా ఏడాది ఆటకు దూరమైన సెరెనా రికార్డు వేటకు సిద్ధమవుతుండగా.. పురుషుల విభాగంలో గాయాలతో గత కొంత కాలం టెన్నిస్‌కు దూరమైన జకోవిచ్, ఆండీ ముర్రేలు కూడా ఈ ఏడాది మళ్లీ కోర్టులో బరిలో దిగనున్నారు. మార్గరెట్ కోర్టు పేరిట ఉన్న ఆల్‌టైం అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డు (24)ను సమం చేయడంపై సెరెనా కన్నేయగా.. తాము లేని సమయంలో మళ్లీ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో పండగ చేసుకున్న రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్‌లను ఓడించి గాడిలో పడాలని చూస్తున్నారు జకోవిచ్, ముర్రే. ఇక మన విషయానికొస్తే.. మన ఆశలన్నీ ఎప్పటిలా సానియా, రోహన్ బోపన్నలపైనే. గాయం కారణంగా నిరుడు పెద్దగా రాణించని సానియా మళ్లీ గాడిలో పడుతుందేమో చూడాలి. నిరుడు ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న టైటిల్ మినహాయిస్తే మన వాళ్లు సాధించిందేం లేదు.

- ఆస్ట్రేలియన్ ఓపెన్ (జనవరి 15–28)
- ఫ్రెంచ్ ఓపెన్ (మే 27–జూన్ 10)
- వింబుల్డన్ (జులై 2–15)
- యూఎస్ ఓపెన్ (ఆగస్టు 27–సెప్టెంబరు 9)



అసలు పరీక్ష ఇప్పుడే..



2017లో తిరుగులేని హవా సాగించింది భారత క్రికెట్ జట్టు. సొంతగడ్డపై కోహ్లీసేనకు అసలు సిరీస్ ఓటమన్నదే లేదు. విదేశీ పర్యటనల్లో కూడా ఆధిపత్యం చలాయించింది. కాకపోతే ఈ ఏడాది భారత్ పర్యటించింది వెస్టిండీస్, శ్రీలంకల్లో మాత్రమే. ఐతే వచ్చే ఏడాది టీమ్‌ఇండియాకు కఠిన పరీక్షలు ఎదురు కానున్నాయి. ముందుగా దక్షిణాఫ్రికాలో భారత్‌కు పెను సవాల్ ఎదురు కాబోతోంది. ఆ తర్వాత ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాల్లో కూడా పర్యటించబోతోంది. రెండేళ్లుగా జైత్రయాత్ర సాగిస్తున్న కోహ్లీసేనకు 2018 చాలా కఠినంగా ఉండబోతోందనడంలో సందేహం లేదు. ఈ జట్టు అసలు సత్తా ఏంటనేది 2018 నిర్ణయిస్తుంది.

టీమ్‌ఇండియాకు విదేశీ సవాళ్లు

- దక్షిణాఫ్రికాలో 3 టెస్టులు, 6 వన్డేలు, 3 టీ20లు (జనవరి 5–ఫిబ్రవరి 24)
- ఇంగ్లాండ్‌లో 5 టెస్టులు, 3 వన్డేలు, 3 టీ20లు (జులై 3–సెప్టెంబరు 11)
- ఆస్ట్రేలియాలో నాలుగు టెస్టులు (నవంబరు–డిసెంబరు మధ్య)

సత్తాకు పరీక్ష..

క్రికెటేతర క్రీడాభిమానులకు ఈ ఏడాది పండుగే. క్రీడాకారుల సత్తాకు పరీక్షగా నిలిచే కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు జరిగేది ఈ సంవత్సరమే. నాలుగేళ్లకోసారి వచ్చే కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో గత ప్రదర్శనను మెరుగు చేసుకోవాలని పట్టుదలగా ఉంది భారత్. గతంతో పోల్చుకుంటే దేశంలో క్రీడా ప్రమాణాలు మెరుగైన నేపథ్యంలో ఈసారి అంచనాలు భారీగానే ఉన్నాయి. 2014 కామన్వెల్త్ క్రీడల్లో 15 స్వర్ణాలు సహా 64 పతకాలు గెలిచిన భారత్ ఐదో స్థానంలో నిలిచింది. ఇందులో ఎక్కువ శాతం బంగారు పతకాలు షూటింగ్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో వచ్చాయి. ఈసారి అథ్లెటిక్స్, బాక్సింగ్, హాకీతో పాటు ఇతర క్రీడల్లో కూడా సత్తా చాటే అవకాశమున్న నేపథ్యంలో భారత్ టాప్-3పై కన్నేసింది. ఇక 2014 ఆసియా క్రీడల్లో భారత్ 11 స్వర్ణాలు సహా 57 పతకాలు నెగ్గి ఎనిమిదో స్థానంలో నిలిచింది. పోటీ కఠినంగా ఉండే ఈ క్రీడల్లోనూ స్థానం మెరుగు చేసుకోవాలని చూస్తోంది భారత క్రీడా బృందం. మరి టోక్యో ఒలింపిక్స్ ముందు వచ్చిన ఈ మెగా క్రీడలను ఎంతమంది సద్వినియోగం చేసుకుంటారో..?

- కామన్వెల్త్ క్రీడలు (ఏప్రిల్ 4–15, ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో)
- ఆసియా క్రీడలు (ఆగస్టు 18–సెప్టెంబరు 2, ఇండోనేషియాలోని జకార్తాలో)


హాకీ వీరులు సాధిస్తారా?



2017లో భారత పురుషుల హాకీ జట్టు ఆసియా కప్ గెలవడంతో పాటు ప్రతిష్టాత్మక ప్రపంచ హాకీ లీగ్ ఫైనల్స్‌లో కాంస్యం సాధించింది. ఈ ఫామ్‌ను 2018లో ఎంతమేరకు కొనసాగిస్తారో చూడాలి. ఈ ఏడాది చివర్లో ప్రతిష్టాత్మక ప్రపంచకప్ రాబోతోంది. ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్నది భారతే కావడం కలిసొచ్చే అంశం. 2017లో అన్ని పెద్ద జట్లను దీటుగా ఎదుర్కొన్న భారత హాకీ జట్టు.. ఇదే ప్రదర్శనను కొనసాగిస్తే ప్రపంచకప్‌ను కూడా గెలిచేందుకు అవకాశముంటుంది.

- పురుషుల హాకీ ప్రపంచకప్ (నవంబరు 28–డిసెంబరు 16, భువనేశ్వర్‌లో)

కుర్రాళ్లు పట్టుకొస్తారా?



కోచ్ ద్రవిడ్‌తో పృథ్వీ షా


2018లో ముందుగా రాబోయే మెగా టోర్నీ అండర్-19 వన్డే క్రికెట్ ప్రపంచకప్పే. జనవరి 13న న్యూజిలాండ్‌లో ఈ టోర్నీ ఆరంభమవుతుంది. ముంబయి యువ సంచలనం పృథ్వీ షా నేతృత్వంలో భారత్ ఈ టోర్నీలో బరిలోకి దిగుతోంది. ఇప్పటికే మూడు పర్యాయాలు (1998, 2008, 2012) అండర్-19 ప్రపంచ విజేతగా నిలిచిన భారత్‌కు ఈసారి కూడా మంచి అవకాశాలే ఉన్నట్లు విశ్లేషకుల అంచనా. ఇప్పటికే దేశవాళీల్లో అదరగొట్టిన పృథ్వీ షాపై అందరి కళ్లూ నిలవనున్నాయి. కోహ్లి సహా ఎందరో ప్రతిభావంతులు ఈ టోర్నీలో సత్తా చాటి వెలుగులోకి వచ్చిన వాళ్లే. మరి 2018 టోర్నీ ఎవరిని పైకి తెస్తుందో.. ఈ టోర్నీలో భారత్ ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

- అండర్–19 వన్డే ప్రపంచకప్ (జనవరి 13–ఫిబ్రవరి 3, న్యూజిలాండ్‌లో)

ఓ పట్టు పడతాడా..

రెజ్లింగ్ అనగానే మనకు గుర్తొచ్చే పేరు సుశీల్ కుమార్. ఇక ఆటకు దూరమైనట్లేనని భావించిన అతడు.. ఇటీవలే పునరాగమనం చేసి ఘనంగా ముందుకు సాగుతున్నాడు. ఐతే అతడికి అతిపెద్ద సవాల్ ఈ ఏడాది ఎదురవనుంది. ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సుశీల్ బరిలో దిగే అవకాశముంది. మరి అతడు స్వర్ణంతో పూర్వ వైభవాన్ని చాటుతాడా..? ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ గెలిచిన ఏకైక స్వర్ణాన్ని సాధించి అతడే. టోక్యో ఒలింపిక్స్‌లో పతకం తేవాలని పట్టుదలగా ఉన్న సుశీల్ కుమార్.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌తో సత్తా చాటాలని చూస్తున్నాడు. చూద్దాం మరి ఏమవుతుందో..?

- ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ (అక్టోబరు 22–28, బుడాపెస్ట్‌లో)



అగ్రపీఠాలు అందేనా

మహిళల సింగిల్స్‌లో పి.వి.సింధు, పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ కెరీర్లోనే అత్యుత్తమంగా రెండో ర్యాంకులు సాధించారు. సింధు ప్రపంచ ఛాంపియన్‌షిప్, ప్రపంచ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో రజతాలతో పాటు రెండు సూపర్ సిరీస్ టైటిళ్లు కూడా సాధించింది. శ్రీకాంత్ ఏకంగా నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచాడు. గాయం నుంచి కోలుకున్న సైనా కూడా ఫామ్ చాటుకుంది. ఈ ఏడాది సింధు, శ్రీకాంత్ ఇదే నిలకడను కొనసాగించి నంబర్‌వన్ ర్యాంకులు సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. సైనా కూడా మునుపటి ఫామ్ అందుకుని టైటిళ్లు సాధించాలని భావిస్తోంది.

- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ (జులై 30–ఆగస్టు 5, చైనాలోని నాన్‌జింగ్‌లో)
- ప్రపంచ సూపర్ సిరీస్ ఫైనల్స్ (డిసెంబర్లో)





వాడ్కర్

వాడ్కర్ అజేయ సెంచరీ

● పట్టుబిగించిన విదర్భ ● తొలి ఇన్నింగ్స్‌లో 528/7
● ఇప్పటికే 233 పరుగుల ఆధిక్యం ● దిల్లీతో రంజీ ఫైనల్

ఇండోర్: తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్‌ను చేజిక్కించుకునేందుకు విదర్భ చేరువైంది. దిల్లీతో రంజీ ఫైనల్‌పై ఆ జట్టు పట్టుబిగించింది. వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ (133 బ్యాటింగ్; 243 బంతుల్లో 16×4, 1×6) అజేయ శతకం చేయడంతో మూడో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 528 పరుగులు సాధించింది. ఇప్పటికే 233 పరుగుల ఆధిక్యం సంపాదించింది. వాడ్కర్‌తో పాటు నెరాల్ (56) క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో దిల్లీ 295 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఓవర్‌నైట్ స్కోరు 206/4తో మూడో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ భారీ స్కోరు చేయడంలో వాడ్కర్ కీలక పాత్ర పోషించాడు. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ జాఫర్ (78), వాఖరె (28) త్వరగా నిష్క్రమించడంతో 246/6కు చేరుకున్న విదర్భను 23 ఏళ్ల వాడ్కర్ ఆదుకున్నాడు. సార్వతె (79)తో ఏడో వికెట్‌కు 169 పరుగులు, నెరాల్‌తో అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 113 పరుగులు జోడించాడు. వాడ్కర్‌కు ఇదే తొలి రంజీ శతకం. మూడో రోజు 322 పరుగులు చేసిన విదర్భ.. మూడు వికెట్లు మాత్రమే కోల్పోయింది.

దిల్లీ తొలి ఇన్నింగ్స్: 295; విదర్భ తొలి ఇన్నింగ్స్: 528/7 (ఫజల్ 67, జాఫర్ 78, వాడ్కర్ 133బ్యాటింగ్, సార్వతె 79, సిద్దేష్ నెరాల్ 56 బ్యాటింగ్; సైని 3/126, అక్షయ్ సుదన్ 2/102)

సుశీల్‌పై ప్రతీకారం తీర్చుకుంటా...



దిల్లీ: వచ్చే ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో సుశీల్ కుమార్‌ను ఎలాగైనా ఓడిస్తానని అతడి ప్రత్యర్థి పర్వీన్ రాణా ప్రతిన పూనాడు. సుశీల్ మద్దతుదారులు తనపై దాడి చేశారని తెలిసి క్యాన్సర్ బాధితురాలైన తన తల్లి ఎంతో బాధపడిందని, ఆమె కోసం విజయం సాధిస్తానని అతడు అన్నాడు. కామన్వెల్త్ క్రీడల ట్రయల్స్‌లో సుశీల్ చేతిలో ఓడిపోయిన రాణా, అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని రగిలిపోతున్నాడు. ట్రయల్స్ సందర్భంగా సుశీల్, రాణా వర్గాలు కొట్టుకున్న సంగతి తెలిసిందే. "మా అమ్మ క్యాన్సర్‌తో పోరాడుతోంది. కానీ అంతకన్నా ఎక్కువగా.. నాపై దాడి జరిగినందుకు ఆమె బాధపడుతోంది. దాన్ని దృష్టిలో ఉంచుకునే నేను పీడబ్ల్యూఎల్‌లో బరిలోకి దిగుతా. అన్యాయ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటా" అని రాణా చెప్పాడు. "కామన్వెల్త్ క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో సుశీల్‌తో నా బౌట్లో జడ్జిలు పక్షపాతంతో వ్యవహరించారు. ఐతే అది జరిగిపోయిన కథ. కానీ ఇప్పుడు నేను.. తర్వాతి బౌట్లో అతణ్ని ఓడించాలనే పట్టుదలతో ఉన్నా" అని అన్నాడు.

ఆంధ్రప్రదేశ్ శుభారంభం

జాతీయ సీనియర్ కబడ్డీ

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ శుభారంభం చేసింది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 50-18తో పశ్చిమ్ బంగను చిత్తుచేసింది. మిగతా మ్యాచ్‌ల్లో కర్ణాటక 75-9తో విదర్భపై, గుజరాత్ 48-26తో జమ్మూకాశ్మీర్‌పై, కేరళ 49-35తో ఒడిశాపై విజయం సాధించాయి. మహిళల విభాగంలో తమిళనాడు 45-28తో మణిపూర్‌పై, చత్తీస్‌గఢ్ 61-12తో పాండిచ్చేరిపై నెగ్గాయి.

ఆకట్టుకున్న ఆరంభం: జాతీయ సీనియర్ కబడ్డీ టోర్నీ అట్టహాసంగా ఆరంభమైంది. అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు జనార్దన్‌సింగ్ గహ్లోత్ ఈ టోర్నీని ప్రారంభించారు. కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సిడ్నీలో బాణసంచా పేలుళ్లు

విజయవంతంగా ప్రభుత్వ కార్యక్రమాలు

సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలన్నీ 2018 సంవత్సరంలో విజయవంతంగా ముందుకు సాగుతాయని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

■ ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు చందూలాల్, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితలు ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు రాజ్‌భవన్‌లో ప్రజలు, ప్రముఖులు, నేతలతో గవర్నర్ ముఖాముఖి నిర్వహిస్తారు.

కొత్త ఏడాదిలోనూ ఇదే ఒరవడి: మహేందర్‌రెడ్డి: ప్రమాదాల నివారణలో తెలంగాణకు దేశంలోనే మంచిగుర్తింపు వచ్చిందని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఇదేఊపును కొత్త ఏడాదిలోనూ కొనసాగిస్తామన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు చెప్పారు

సీఆర్పీఎఫ్ శిబిరంపై ఆత్మాహుతి దాడి

- ఐదుగురు జవాన్లు మృతి
- ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఒక సీఆర్పీఎఫ్ శిబిరంపై ఉగ్రవాదులు ఆదివారం తెల్లవారుజామున ఆత్మాహుతి దాడికి తెగబడ్డారు. ఇందులో ఐదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించగా.. ముగ్గురు గాయపడ్డారు. ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతమార్చాయి. వీరిద్దరూ కశ్మీరీలే. స్థానిక ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి దిగడం ఇదే మొదటిసారి. భారీగా ఆయుధాలు ధరించిన ఉగ్రవాదులు ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో లెథపొరలోని సీఆర్పీఎఫ్ 185వ బెటాలియన్ శిబిరం వద్దకు వచ్చారు. శిబిరం ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వర్తిస్తున్న జవాన్లు అప్రమత్తమై, వారిని ప్రశ్నించగా విచక్షణారహితంగా కాల్పులకు దిగారు. తేరుకున్న సెంట్రీలు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు జవాన్లు మరణించారు. మరో జవాన్.. గుండెపోటుతో చనిపోయాడు. ఆ తర్వాత ఉగ్రవాదులు శిబిరంలోకి చొరబడ్డారు. ఒక భవనంలో నక్కి, భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. ప్రధాన భవనంలో మూడు బ్లాక్‌లు ఉన్నాయి. మొదటి బ్లాక్‌లో అధికారుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. బ్లాక్-3లో ఆసుపత్రి, కంట్రోల్ రూమ్ ఉన్నాయి. ఉగ్రవాద దాడిలో ఈ బ్లాక్ దెబ్బతింది. సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసు బలగాలు వచ్చి.. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నామని, మరో ముష్కరుడూ హతమై ఉండొచ్చని అధికార వర్గాలు తెలిపాయి. నాలుగో ఉగ్రవాదీ ఆ ప్రాంగణంలోనే నక్కి ఉంటాడని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నాయి. హతమైన ఉగ్రవాదులను మంజూర్ అహ్మద్ బాబా, ఫర్దీన్ అహ్మద్ ఖండేగా గుర్తించారు. ఫర్దీన్.. ఓ పోలీసు కుమారుడు కావడం గమనార్హం. ఈ దాడికి తామే పాల్పడ్డామని పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ ఉగ్రవాద ముఠా ప్రకటించుకుంది.

కశ్మీర్‌లో పాక్ కాల్పులు.. భారత సైనికుడి మృతి

జమ్మూ: కశ్మీర్‌లో నౌషేరా సెక్టార్‌లో సరిహద్దుల వద్ద భారత శిబిరాలపై పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో ఓ జవాను మరణించాడు.

ప్రయాణికుల సహనానికి 'మెట్రో' పరీక్ష

- నాగోలు నుంచి అమీర్‌పేటకు 52 నిముషాలు
- ఆర్టీసీ బస్సునూ దాటలేని వేగం
- మెట్టుగూడ-ఎస్‌ఆర్‌నగర్ మధ్య సీబీటీసీ టెక్నాలజీ లేకపోవడం వల్లే
- మార్చి నాటికి అధిగమిస్తామన్న ఎల్అండ్‌టీ

ఈనాడు - సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి

హైదరాబాద్ మెట్రో రైలు వేగంలో ఆర్టీసీ బస్సుతో కూడా పోటీ పడలేకపోతోంది. నాగోలు నుంచి అమీర్‌పేట వరకు 17 కిలోమీటర్ల దూరాన్ని మెట్రో కంటే ఆర్టీసీ బస్సే ముందుగా చేరుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మెట్టుగూడ నుంచి ఎస్‌ఆర్‌నగర్ వరకు సీబీటీసీ సాంకేతికత అందుబాటులోకి రాలేదు. దీంతో మెట్రో రైలును లోకోపైలట్లే నడపాల్సి వస్తోందని, ఆలస్యానికి ఇదే కారణమని అధికారులు చెబుతున్నారు. మరో మూడు నెలలు గడిస్తేనే గానీ ఈ సాంకేతిక ఇబ్బందులను అధిగమించలేమంటున్నారు. నాగోలు నుంచి మియాపూర్ వరకు మెట్రో రైలును నవంబర్ 28న ప్రారంభించారు. ప్రస్తుతం నాగోలు నుంచి అమీర్‌పేట వరకు ఒక లైనులో, అమీర్‌పేట నుంచి మియాపూర్ వరకు మరో లైనులో రైళ్లు నడుస్తున్నాయి. నాగోలులో ఎక్కిన ప్రయాణికుడు మియాపూర్ వెళ్లాలంటే అమీర్‌పేటలో దిగి అక్కడ మరో రైలు ఎక్కాలి. మియాపూర్- నాగోలు మార్గంలో నాగోలు నుంచి మెట్టుగూడ, ఎస్‌ఆర్‌నగర్- మెట్టుగూడ వరకు మెట్రో మార్గం ఏడాది కిందటే పూర్తయింది. ఈ లైనులో అన్ని రకాల భద్రతా పరీక్షలు పూర్తవడంతో అత్యాధునికమైన కమ్యూనికేషన్ బేస్డ్ టెక్నాలజీ సర్వీస్ (సీబీటీసీ) టెక్నాలజీతో నడిపిస్తున్నారు. ట్రైన్‌లో ఉంటే లోకోపైలట్ల పాత్ర ఏమీ లేకుండా ఉప్పల్‌లోని మెట్రో కమాండ్ సెంటర్ నుంచే మెట్రోను నడిపించడం దీని ప్రత్యేకత. అయితే ఈ రెండు భాగాలను కలిపి ప్రధానితో ప్రారంభింపజేయడానికి ఎస్‌ఆర్‌నగర్ నుంచి మెట్టుగూడ వరకు హడావుడిగా పనులు పూర్తి చేశారు. ఈ రూట్‌లో సీబీటీసీ టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో మెట్టుగూడ నుంచి అమీర్‌పేట వరకు అక్కడి నుంచి ఎస్‌ఆర్‌గనగర్ వరకు రైళ్లను ప్రస్తుతం ఉన్న సిగ్నల్స్ వ్యవస్థకు అనుగుణంగా లోకో పైలెట్లే నడపుతున్నారు. మెట్రో రైలు ఆలస్యానికి ఇదే ప్రధాన కారణం. ఎస్‌ఆర్ నగర్ దగ్గర లోకోపైలట్ బాధ్యతలు తీసుకుంటారు. అక్కడి నుంచి అమీర్‌పేట వరకు లైను వంపులు లేకపోవడంతో కొంత వేగంగానే నడపగలుగుతున్నారు. 17 కి.మీ. మియాపూర్ - అమీర్‌పేట రూటులో 13 కి.మీ. 25 నిమిషాల్లో నడుస్తున్నాయి. అదే అమీర్‌పేట నుంచి మెట్టుగూడ వరకు మార్గమధ్యలో అనేక మలుపులు ఉన్నాయి. దీంతో అతి జాగ్రత్తగా సిగ్నల్స్ ఆధారంగా నడపాల్సి వస్తుండడంతో ఆలస్యమవుతోంది.

ఆర్టీసీయే ముందు

నాగోలు నుంచి అమీర్‌పేటకు మెట్రోలో 52 నిమిషాలు పడుతోంది. ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు సగటున 50 నిమిషాల్లోనే చేరుతున్నాయి. దీనికితోడు మెట్రో కంటే ఆర్టీసీ బస్సు ఛార్జి తక్కువగా ఉండటంతో ఎక్కువమంది ఆర్టీసీని ఆశ్రయిస్తున్నారు. ఈ సాంకేతిక ఇబ్బందులను మూడు నెలల్లో అధిగమిస్తామని, మార్చి నెలాఖరుకు ఈ లైనులో కూడా వేగం పెరుగుతుందని ఎల్అండ్‌టీ ప్రతినిధికి 'ఈనాడు'కు తెలిపారు.



మెట్రో పరుగుకు తొలి అవాంతరం

- నాగోలు-అమీర్‌పేట మార్గంలో గంటపాటు నిలిచిన రైళ్లు
- సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం

అమీర్‌పేట, న్యూస్‌టుడే: నవంబరు 28న ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలుకు ఆదివారం తొలి అవాంతరం ఏర్పడింది. నాగోలు-అమీర్‌పేట మార్గంలో గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అమీర్‌పేట మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 8 గంటలకు నాగోలు వెళ్లాల్సిన మెట్రో రైలు అర్ధాంతరంగా నిలిచిపోయింది. సాంకేతిక కారణాలతో రైలు ముందుకు వెళ్లడం లేదని సిబ్బంది ప్రకటించారు. ఆ మార్గంల వస్తున్న ఇతర రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేశారు. దీంతో ఆ రైళ్లలోని ప్రయాణికులు, స్టేషన్లలో ఉన్నవారు అమీర్‌పేట స్టేషన్‌లో ఏం జరుగుతుందో తెలియక ఆయోమయానికి గురయ్యారు. అమీర్‌పేటలో కొందరుప్రయాణికులు కిందకు దిగి తమకు డబ్బులు వాపసు ఇవ్వాలని కోరారు. కుదరదని సిబ్బంది చెప్పడంతో వాగ్వాదానికిదిగారు. రైలునిలిచిపోయినా ప్లాట్‌ఫారాలపైకి వెళ్లేందుకు సిబ్బంది అనుమతించకపోవడంతో ప్రయాణికులు మరింత అసహనానికిగురయ్యారు. ఉదయం 9గంటలకు సాంకేతికలోపాన్ని సవరించి రైలును కదిలించారు. సమస్య పరిష్కారమై రైళ్లు నడుస్తున్నా ఆ విషయంతెలియని కింద స్టేషన్‌లోనిసిబ్బంది నాగోలు వైపు వెళ్లే ప్రయాణికులను చాలాసేపటి వరకు అనుమతించలేదు.



అమీర్‌పేట-నాగోలు మార్గంలో ప్రయాణిస్తున్న ఓ మెట్రోరైలులో జనాల రద్దీ

సానుకూల దృక్పథంతోనే ఫలితాలు

- 2017.. నా జీవితంలో మలుపు
- వ్యవసాయంపై పాలకులు దృష్టి పెట్టాలి
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వెల్లడి

ఈనాడు-అమరావతి: పాలకులు అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలని.. అప్పుడే దేశం అనుకున్న రీతిలో పురోగమిస్తుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సంస్కరణలు ప్రజల జీవన విధానాలను మార్చేలా ఉండాలని ఆకాంక్షించారు. జనం కూడా ఇదే కోరుకుంటున్నారని అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పాలకుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలన్నారు. ప్రజల ఆలోచనల్లో ఇంకా మార్పురావాలని, సానుకూల దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. 2018లో అందరూ ఇదే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఇందుకు తానే ఉదాహరణ అన్నారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని తాను దేశంలోనే రెండో అత్యున్నత పదవి అయిన ఉపరాష్ట్రపతిని కాగలిగానని చెప్పారు. తనకు ప్రధాని కావాలన్న ఆశ లేదని, ఆ అర్హతలు కూడా లేవన్నారు. 2017 సంవత్సరం తనకు మధురానుభూతిని మిగిల్చిందని, ఉపరాష్ట్రపతి పదవి వరించిందన్నారు. 2019 ఎన్నికల తర్వాత రాజకీయాల నుంచి విరమించుకుని, 2020 నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని భావించానన్నారు. అనుకోని విధంగా కొత్త బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. చట్ట సభల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదని, సభ్యులు ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సభలకు రాకుండా బహిష్కరించడం తగదన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, పాలకులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. ఉపరాష్ట్రపతిని అయినా తాను అనధికారికంగా ఏపీ సమస్యలపై కేంద్ర మంత్రులతో మాట్లాడుతూనే ఉన్నానని, ఇటీవల పోలవరం, గృహనిర్మాణం వంటి వాటిపై మాట్లాడానన్నారు. రాజధాని నమూనాల విషయం రాష్ట్ర పరిధిలోని అంశమన్నారు. అనంతరం ట్రస్టులో వైద్యశిబిరం, శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు, ఉద్యోగ నియామక పత్రాలను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అందించారు. ప్రతి ఒక్కరూ ఉన్న దాంట్లో కొంత భాగాన్ని ఇతరుల బాగుకు వెచ్చించాలని ఆయన సూచించారు.



వినికిడిలోపం ఉన్న చిన్నారికి ఉపకరణం అమర్చిన అనంతరం కరచలానం చేస్తున్న వెంకయ్యనాయుడు



హైదరాబాద్‌లోని జనసేన పార్టీ పరిపాలనా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్న పవన్‌కల్యాణ్

జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించిన పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లోని పరిపాలన కార్యాలయంలో ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని స్వీకరించిన ఆయన పార్టీలోని ముఖ్యులకు ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. రెండు రాష్ట్రాల్లోనూ త్వరలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. గత పదేళ్లకు పైగా తనను అనుసరిస్తున్న వారితో మూడు రోజులుగా విడతల వారీగా ఇష్టాగోష్ఠి సమావేశాలను పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను వివరించడంతోపాటు రానున్న రోజుల్లో జనసేన నిర్వహించే శిక్షణ శిబిరాలపై వారితో చర్చించారు. పార్టీకి వక్తలుగా, కంటెంట్ రైటర్లుగా, విశ్లేషకులుగా, సమన్వయకర్తలుగా పని చేయడానికి ముందుకొచ్చిన వారిలో తొలుత మహిళల, సీనియర్ సిటిజన్లతో కొత్త సంవత్సర తొలిరోజుల్లో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. పూర్తి వివరాలు త్వరలోనే పార్టీ ప్రతినిధులు ప్రకటిస్తారని పవన్‌కల్యాణ్ తెలిపారు.




ఆంధ్రప్రదేశ్ డీజీపీగా ఆదివారం మాలకొండయ్య బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని కార్యాలయంలో ఆయనకు డీజీపీ సాంబశివరావు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఏపీ పోలీసు శాఖలో సంక్షేమం, శిక్షణకు మరింత పెద్ద పీట వేస్తానని ఈ సందర్భంగా నూతన డీజీపీ మాలకొండయ్య చెప్పారు.

– ఈనాడు, అమరావతి

మత్తు ప్రణాళిక చిత్తు

- నైజీరియన్ దేశ యువతీ యువకుల అరెస్టు
- మాదకద్రవ్యాలు స్వాధీనం

నాగోలు, న్యూస్‌టుడే: కొత్త సంవత్సర వేడుకల్లో యువతకు మత్తెక్కించేందుకు పథకం వేసిన ఇద్దరు నైజీరియన్ యువతీ యువకులను రాచకొండ ఎస్‌వోటీ, జవహర్‌నగర్ ఠాణా పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారి వద్ద అంతర్జాతీయ మార్కెట్లో రూ.16.7లక్షల విలువచేసే వివిధ రకాలైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సీపీ మహేష్‌భగవత్ వివరాలు వెల్లడించారు. నైజీరియా దేశానికి చెందిన చుక్వామా(19).. ఆగస్టు 2015లో విద్యార్థి వీసాపై నగరానికి వచ్చాడు. యాప్రాల్‌లో నివాసం ఉంటూ సికింద్రాబాద్‌లోని పీజీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాడు. అదే ఇంట్లో మరో ఇద్దరు యువకులతోపాటు ఉంటున్న నైజీరియా దేశానికే చెందిన యువతి సండే ప్రిసిల్లియా ఒలూచీ ఉజున్వా బర్కత్‌పురాలోని ఆర్‌బీవీఆర్ఆర్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. వీరిద్దరూ ముఠాగా ఏర్పడి డ్రగ్స్ అమ్ముతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. టోలీచౌకీలో ఉండే నైజీరియా దేశస్థుడు బెంజిమన్ వీరికి డ్రగ్స్ సరఫరా చేసేవాడు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పార్టీలు చేసుకునే యువత కోసం కొకైన్ పొట్లాలతోపాటు..కొకైన్ చాక్‌లెట్లు, గంజాయి సిగరెట్లు, సూదిమందులు, హెరాయిన్ తదితరాలు సిద్ధం చేసుకున్నారు. ఆదివారం ఉదయం కారులో వెళ్తూ యువతకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న వీరిద్దరినీ రాచకొండ కమిషనరేట్ పరిధి ఎల్బీనగర్‌జోన్ ఎస్‌వోటీ పోలీసులు జవహర్‌నగర్ పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 16 గ్రాముల కొకైన్, 23 గ్రాముల హెరాయిన్, ఒక కిలో గంజాయి, ఓ కారు, రూ.3 వేల నగదు, 2 ల్యాప్‌టాప్‌లు, 5 చరవాణులు, 5 పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకున్నారు. బెంజిమన్ పరారయ్యాడని, అతని కోసం గాలిస్తున్నామని సీపీ వివరించారు.



స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు, నగదు, ల్యాప్‌టాప్, పాస్‌పోర్టులు. పోలీసులు అరెస్టు చేసిన నైజీరియా దేశస్థులు

పంతం నెగ్గించుకున్న గుజరాత్ ఉపముఖ్యమంత్రి

అహ్మదాబాద్: తన స్థాయికి తగ్గ శాఖను కేటాయించలేదంటూ అలకబూనిన గుజరాత్ ఉపముఖ్యమంత్రి నితిన్ పటేల్.. చివరికి పంతం నెగ్గించుకున్నారు. కోరుకున్నట్లుగా ఆర్థికశాఖను దక్కించుకున్నారు. గత ప్రభుత్వంలో నితిన్ కీలకమైన ఆర్థికశాఖ, పట్టణాభివృద్ధిశాఖల బాధ్యతలను నిర్వహించారు. అయితే ఈసారి సీఎం విజయ్ రూపానీ ఆయనకు వేరే శాఖలు కేటాయించారు. ఆర్థికశాఖ నిర్వర్తించేవారే మంత్రివర్గంలో రెండో ఉన్నత స్థానంలో ఉన్నట్లు కాదని వ్యాఖ్యానించారు. అయితే ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన నితిన్.. ఇది తన ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమంటూ అలకబూనారు. బాధ్యతలు తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ఆదివారం ఉదయం నితిన్‌కు భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఫోన్ చేసి, సముచిత గౌరవం కల్పిస్తామని హామీఇచ్చారు. అనంతరం నితిన్‌కు ఆర్థికశాఖను కేటాయిస్తున్నట్లు రూపానీ ప్రకటించారు. ఈ మేరకు గవర్నర్‌కు లేఖ పంపినట్లు తెలిపారు. దీంతో నితిన్ నూతన బాధ్యతలను స్వీకరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు, ఆయుధ సామగ్రి అంతరచిత్రంలో మావోయిస్టు మృతదేహం

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఓ మావోయిస్టు మృతి చెందారు. కరిగూడెం, ఇటాపారా అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లిన భద్రాతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. మృతి చెందిన మావోయిస్టు ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఓ తపంచా, రెండు తుపాకులు, డిటోనేటర్లు, విప్లవ సాహిత్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు జిల్లా పరిధిలోని చింతగుప్ప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగింది.

ప్రధానివి వట్టి నినాదాలే!

రాహుల్ గాంధీ విమర్శ

దిల్లీ, పనాజీ: ప్రధాని నరేంద్ర మోదీ వట్టి నినాదాలకే పరిమితమవుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఆకర్షణీయ నగరాల' విషయంలో భారత్‌కు గట్టి పోటీని ఇస్తూ చైనా దూసుకెళ్తోందని అన్నారు. చైనాలోని షెంజెన్ నగర అభివృద్ధికి సంబంధించిన ఓ వీడియోను.. ఆదివారం తన ట్విటర్ ఖాతాలో పోస్ట్‌చేసిన రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఆకర్షణీయ నగరాల ప్రాజెక్టు కోసం రూ.9,860 కోట్లను కేటాయించగా.. అందులో కేవలం ఏడు శాతం నిధులనే ఖర్చుచేశారని అన్నారు. ఉద్యోగకల్పనపై దృష్టిసారించమని మోదీకి సలహా ఇవ్వాలని.. మోదీ మద్దతుదారులకు రాహుల్ సూచించారు. ఇటు కుటుంబసభ్యులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు శనివారం రాత్రే రాహుల్ గోవాకు చేరుకున్నారు. వ్యక్తిగత విమానంలో ఆయన ఇక్కడకు వచ్చారు. రాహుల్ తల్లి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా గోవాలోనే ఉన్నారు.

అటల్ పింఛను పథకంలో ఆధార్‌ను అనుసంధానించేందుకు కొత్త పత్రం

దిల్లీ: అటల్ పింఛను పథకం(ఏపీవై) ఖాతాలకు సంబంధించి ఆధార్ అనుసంధానం కోసం సోమవారం నుంచి కొత్త దరఖాస్తు పత్రాలను వినియోగించాలని.. ఏపీవై సేవలందించే సంస్థలకు పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ(పీఎఫ్ఆర్‌డీఏ) సూచించింది. ఆధార్ వివరాలను సమర్పించేందుకు లబ్ధిదారుల అంగీకారాన్ని నమోదు చేసుకునేలా పత్రాలకు మార్పులు చేసినట్లు తెలిపింది. తమ పొదుపు ఖాతాలున్న బ్యాంకు, తపాలా కార్యాలయాల్లో ఎవరైనా ఏపీవై ఖాతా తెరవొచ్చు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00